బుధవారం
26-11-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 65
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343



మోదీ నిస్సిగ్గు ప్రయత్నం: డి.రాజా

న్యూదిల్లీ: ప్రధాని మోదీ అయోధ్యలో కాషాయ జెండా ఎగురవేసి, భారతీయ నాగరికకు పునరుజ్జీవనం అంటూ వ్యాఖ్యానించడం ఆక్షేపణీయమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మంగళవారం విమర్శించారు. బ్రాబీ మసీదు కూల్చివేతను క్రిమినల్ చర్యగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా... దానికి ఎవరినీ బాధ్యులుగా నిలబెట్టలేదని గుర్తుచేశారు. మోదీది రివిజనిజం మాత్రమే కాదు సంకుచిత, బహిష్కరణవాదంతో కూడుకున్న రాజ్యాంగబద్ధ చరిత్రను తిరగరాసే నిస్సిగ్గు ప్రయత్నమని డి.రాజా సామాజిక మాధ్యమం

- మిగతా 2 లో

ఏదో ఒక నిర్ణయం తీసుకోండి: సిద్ధూ

బెంగళూరు: కర్నాటకలో కొంతకాలంగా ముఖ్యమంత్రి మార్పుపై పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. నవంబరులో సీఎం మార్పు ఉండొచ్చన్న వార్తలు ఇప్పటికీ ఆగలేదు. ఈ ఊహాగానాలపై కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరోసారి స్పందించారు. ఓ రకంగా అసహనం ప్రదర్శిస్తున్నారు. ఆ వార్తలకు శుభం కార్డు వేసేలా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఎంతకాలం ఇలాంటి వార్తలు వినాలని ఆయన అంటున్నారు. 2023లో జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్...

- మిగతా 2 లో

స్వదేశంలోనే 'హామర్' తయారీ

న్యూదిల్లీ: భారత రక్షణ రంగానికి సంబంధించి అధునాతన హామర్ క్షిపణి వ్యవస్థలను మన దేశంలో తయారు చేసేందుకు ఫ్రాన్స్‌తో అంగీకారం కుదిరింది. ఈ మేరకు రెండు దేశాల మధ్య జాయింట్ వెంచర్ కోఆపరేషన్ అగ్రిమెంట్ కుదిరినట్లు రక్షణశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. హైలీ ఎజైల్ మాడ్యులర్ మ్యూనిషన్ ఎక్స్‌టెండెడ్ రేంజ్ (హామర్) అనేది గైడెడ్ ఎయిర్ టు గ్రౌండ్ క్షిపణి వ్యవస్థ. దీనిని యుద్ధ విమానాల నుంచి కూడా ప్రయోగించడానికి వీలుంటుంది. రఫేల్‌తో పాటు తేలికపాటి యుద్ధ విమానాలైన తేజస్ నుంచి దీన్ని ప్రయోగించొచ్చని రక్షణశాఖ వెల్లడించింది. 1000 కిలోల వరకు బాంబులను మోసుకెళ్లగలదు. దీనిలో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మనకింకా టిడ్కో ఇల్లు ఇవ్వలేదు కద మామా? ఈ కార్డెక్కడకెళ్ళి తీసుకుంటాం?

జీహెచ్‌ఎంసీ విస్తరణ

27 మున్సిపాలిటీల విలీనానికి కేబినెట్ పచ్చజెండా

- హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్
- కొత్త డిస్కమ్ పరిధిలోకి హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ సీవరేజ్ బోర్డ్ పవర్ కనెక్షన్లు
- ఎస్సీ, ఎస్టీ బీసీ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 20.28 ఎకరాలు
- మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర–హైదరాబాద్: తెలంగాణ కోర్ అర్బన్ ప్రాంతం పరిధిలో ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని రాష్ట్ర మంత్రిమండలి తీర్మానించింది. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల, బయట ఓఆర్‌ఆర్‌ను ఆనుకొని ఉన్న మొత్తం 27 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను) జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ చట్టం, తెలంగాణ మున్సిపల్ చట్టాలకు అవసరమైన సవరణలు చేయాలని నిర్ణయించింది. మంత్రిమండలి నిర్ణయాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాకు వెల్లడించారు. జీహెచ్ ఎంసీ పరిధిలో అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. దాదాపు రూ. 14,725 కోట్ల ఖర్చు అవుతుందని ప్రాథమిక అంచనా. నగరంలో విద్యుత్ సర్కిళ్ల వారిగా మూడు విభాగాలుగా ఈ ప్రాజెక్టు చేపట్టాలని ప్రతిపాదించింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఎస్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్

- మిగతా 2 లో

కార్మిక కోడ్లకు నిరసనగా

నేడు దేశవ్యాప్త పోరు

న్యూదిల్లీ: కార్మికులను ప్రత్యక్ష బానిసత్వంలోకి నెట్టడమే కాకుండా వారి హక్కులను హరించేలా రూపొందించిన నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్త పోరునకు కేంద్ర కార్మిక సంఘాలు (సీటీయూలు), సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) సిద్ధమయ్యాయి. కదిలి రావాలంటూ కార్మికులు, శ్రామికులు, రైతులకు పిలుపునిచ్చాయి. నవంబరు 26వ తేదీ(బుధవారం)ని నిరసన దినంగా పేర్కొన్నాయి. ఐక్యంగా గర్జించి పాలకుల వెన్నులో వణుకు పుట్టిద్దామని తెలిపాయి. నాలుగు కోడ్లతో కార్మిక లోకంపై కేంద్రం యుద్ధం ప్రకటించిందని దుయ్యబట్టాయి. ఈ కోడ్‌ల అమలుతో భావితరాల ఆశలు, ఆకాంక్షలు ఆవిరవుతాయని హెచ్చరించాయి. తక్షణమే లేబర్ కోడ్ల రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. కోడ్‌లను వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా, సంప్రదింపులు జరపకుండా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించాయి. అప్రజాస్వామిక, అణచివేత విధానాలను తిప్పికొట్టేందుకు చారిత్రక పోరాటంలో భాగస్వాములు కావాలంటూ కార్మిక లోకానికి, రైతాంగానికి కేంద్ర కార్మిక సంఘాలు, ఎస్‌కేఎం పిలుపునిచ్చాయి. కార్మిక

- మిగతా 2 లో

'ముస్లిం బ్రదర్‌హుడ్'పై ట్రంప్ ఉగ్ర ముద్ర!

2లో

మోగిన పంచాయతీ నగారా

- మూడు విడతల్లో ఎన్నికలు
- పోలింగ్ తేదీలు: డిసెంబరు 11, 14, 17
- రేపటి నుండి తొలి విడత నామినేషన్లు
- ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర– హైదరాబాద్: తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో మూడు విడతల్లో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. డిసెంబర్ 11వ తేదీన తొలి విడత, డిసెంబర్ 14వ తేదీన రెండో విడత, డిసెంబర్ 17వ తేదీన మూడో విడత ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల సంఘం కమిషనర్ ప్రకటించారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదలైంది. మొదటి విడత నామినేషన్ నవంబర్ 27వ తేదీ నుండి మొదలవుతుండగా, రెండో విడత నామినేషన్లు 30వ తేదీనుండి, మూడవ విడత నామినేషన్లు డిసెంబర్ 3వ తేదీ నుండి ప్రారంభమవుతాయి. కాగా రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లోని 12,733 గ్రామ పంచాయతీలు, 1,12,288 వార్డు స్థానాలకు మొత్తం 3 విడతల్లో

- మిగతా 2 లో

ధాన్యం కొనుగోలు కేంద్రాలతో

దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట

- ప్రతి గింజనూ కొంటాం... మద్దతు ధర కల్పిస్తాం
- తక్షణమే రైతు ఖాతాల్లో నగదు జమ
- పెనగడప కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో కూనంనేని

విశాలాంధ్ర – కొత్తగూడెం అర్బన్: ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో దళారీ వ్యవస్థకు అడ్డుకట్టపడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికవృద్ధి సాధించాలని అన్నదాతలకు సూచించారు. చుంచుపల్లి మండలం పెనగడపలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మంగళవారం అయన ప్రారంభించారు. అనంతరం రైతు సభలో కూనంనేని మాట్లాడుతూ రైతులకు మద్దతుధర కల్పించేందుకు సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పండించిన ప్రతిగింజను కొనుగోలు చేసేవిధంగా ఏర్పాట్లు జరిగాయన్నారు. నాణ్యతా ప్రమాణాలంటూ, తరుగు పేరుతో కోత విధించకుండా సత్వరమే కొనుగోలు

- మిగతా 2 లో

'హెచ్‌ఐఎల్టీపీ'తో

రూ.5 లక్షల కోట్ల కుంభకోణం

కాంగ్రెస్ అరాచకాలపై విద్యార్థిలోకం ఉద్యమించాలి: కేటీఆర్

విశాలాంధ్ర – హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రూ.ఐదు లక్షల కోట్ల కుంభకోణానికి తెర లేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అందుకోసం 9,292 ఎకరాల భూమి దారాదత్తం చేసేందుకు హెచ్‌ఐఎల్టీపీ పాలసీ తీసుకువచ్చిందని అన్నారు. తన నివాసంలో మంగళవారం విద్యార్థి విభాగం నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లో 20 పారిశ్రామిక వాడలలోని 9,292 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తాము గతంలో తీసుకువచ్చిన గ్రిడ్ పాలసీలో భాగంగా 50శాతం ఐటీ ఆఫీసులకు, మిగిలిన 50 శాతం ఇతర అవసరాలకు వినియోగించుకునేలా ప్రభుత్వానికి తగిన ఫీజులు కట్టిన తర్వాత అవకాశం ఇచ్చామన్నారు. కానీ ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం దారాదత్తం చేస్తున్నదన్నారు. మార్కెట్ ధరలతో సంబంధం లేకుండా కేవలం ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువలో 30శాతం చెల్లిస్తే చాలు అంటూ అప్పనంగా ఒకప్పటి ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తుందని పేర్కొన్నారు. ఈ విధంగా రూ.ఐదు లక్షల కోట్ల కుంభకోణానికి తెరలేపిందని పేర్కొన్నారు. ఇదే అంశాన్ని జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు,

- మిగతా 2 లో

లేబర్ కోడ్లతో మిగిలేది బానిసత్వమే

- కార్మికవర్గం రైతాంగ పోరాట స్ఫూర్తిని ప్రదర్శించాలి
- దుర్మార్గపు కోడ్ల రద్దుకు ఐక్యంగా ఉద్యమించాలి
- ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి శ్రీకుమార్

విశాలాంధ్ర – విశాఖ : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన దుర్మార్గపు లేబర్ కోడ్లను రద్దు చేసేందుకు కార్మికులు సంఘటితంగా పోరాడాలని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి సీ శ్రీకుమార్ పిలుపునిచ్చారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఏఐటీయూసీ అధ్వర్యంలో విశాఖలో మంగళవారం 'ఎన్డీఏ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, పరిశ్రమల ప్రైవేటీకరణ - చట్టాల దుర్వినియోగం' అంశంపై సదస్సు నిర్వహించారు. విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె. అచ్యుతరావు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో పధాన వక్తగా శ్రీకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి తీసుకునేలా రైతాంగం చేసిన పోరాటం స్ఫూర్తితో కార్మిక వర్గం కూడా లేబర్ కోడ్లు ఆచరణలోకి రాకుండా పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేబర్ కోడ్ల వల్ల కార్మిక వర్గానికి మేలు జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం మోసపూరితంగా దుష్ప్రచారం సాగిస్తోందని, నిజానికి కొత్త లేబర్ కోడ్ల వల్ల కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. యూనియన్ గుర్తింపు కోసం 51 శాతం కార్మికులు మద్దతు తెలపాల్సి ఉంటుందని, సమ్మె చేస్తే క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయవచ్చని చెప్పారు. లేబర్ కోడ్లను పార్లమెంటులో ఎటువంటి చర్చా లేకుండా రెండు నిమిషాల్లో ఆమోదించారని తెలిపారు. చట్టానికీ, కోడ్ కీ వ్యత్యాసం ఉందని.. చట్టాన్ని సవరించాలంటే పార్లమెంటులో ప్రవేశపెట్టి చర్చ జరపాల్సి ఉంటుందని, కోడ్ సవరణకు కేబినెట్ ఆమోదం సరిపోతుందని తెలిపారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత 2017లో ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ జరిగిందని, ఆ సదస్సులో సీనియర్ కార్మిక నాయకులు మోదీకి అనేక ప్రశ్నలు సంధించారన్నారు. ఆ తరువాత ఇప్పటి వరకు ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ జరగలేదని తెలిపారు. కార్మికులకు సంబంధించి కొత్త నిబంధనలు, చట్టాలపై ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ లో చర్చించిన తర్వాత చేసిన నిర్ణయాలను ప్రభుత్వం అమల్లోకి తెచ్చే సాంప్రదాయం ఉండేదని తెలిపారు. అంతర్జాతీయ కార్మిక సదస్సులో కార్మిక, పారిశ్రామిక, ప్రభుత్వ ప్రతినిధులు సమావేశమై నిర్ణయాలు తీసుకుంటారని, వాటిని సభ్య దేశాలు అమలు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటి వరకూ ప్రధాని హోదాలో ఒక్కసారి కూడా మీడియాతో మాట్లాడలేదన్నారు. ప్రధానిది 'వన్ వే'

- మిగతా 2 లో

జగమంతా రామమయం

ప్రధాని మోదీ

అయోధ్య: అయోధ్య రామమందిరంపై కాషాయ జెండాను ప్రధాని మోదీ ఆవిష్కరించారు. అనంతరం భావోద్వేగ ప్రసంగం చేశారు. ఎన్నో ఏళ్ల సంకల్పం ఈరోజు నెరవేరిందని తెలిపారు. ధ్వజారోహణతో ఎన్నో ఏళ్ల నాటి గాయాలు మానిపోయాయని చెప్పుకొచ్చారు. రామమందిర నిర్మాణం కోసం ప్రాణ త్యాగం చేసిన ప్రతి భక్తుడికి నివాళులు అర్పిస్తున్నానన్నారు. ఎప్పుడైనా సత్యమే గెలుస్తుందని.. నేడు నిలబెట్టిన ధర్మ ధ్వజము.. పేదరికం, బాధలు లేని సమాజాన్ని నిర్మించడానికి.. వివక్షతను వదిలించుకోవడానికి మనకు స్ఫూర్తినిస్తుందని చెప్పారు. ఈ కాషాయ జెండా హిందూ నాగరికత పునరుజ్జీవనాన్ని సూచిస్తుందని... అంతేకాకుండా సంవత్సరాల గాయం కూడా మానిపోతుందని పేర్కొన్నారు. ఈరోజు దేశం, ప్రపంచం మొత్తం రామనామస్మరణతో మార్మోగుతుందని తెలిపారు. ప్రతి రామ భక్తుని హృదయం సంతోషంగా ఉందని చెప్పారు. శతాబ్దాల బాధ తొలగడంతో భక్తులంతా చాలా సంతోషంగా ఉన్నట్లు పేర్కొన్నారు. 500 సంత్సరాలుగా వెలుగుతున్న ఆ త్యాగానికి

- మిగతా 2 లో

కంచె చేనుమేస్తే...

- ఇళ్లల్లోనే స్త్రీలకు రక్షణ కరువు
- ప్రతి 10నిమిషాలకో హత్య... రోజుకు 137మంది
- యూఎన్‌ఓడీసీ నివేదిక వెల్లడి

న్యూయార్: ప్రపంచంలో స్త్రీజాతికి రక్షణ కరువైంది. అభంశుభం తెలియని పసిపాప నుంచి ముఖంపై ముడతలు వచ్చిన బామ్మ వరకు ఎవరికీ రక్షణ లేదు. వయస్సుతో సంబంధం లేకుండా స్త్రీజాతిపై నేరాలు–ఘోరాలు పేట్రేగిపోతున్నాయి. సొంత ఇంట్లోనే ఆమెకు రక్షణ లేని పరిస్థితులు నెలకొన్నాయి. కుటుంబ సభ్యులే కడతేరుస్తున్నారు. కుటుంబ సభ్యులు లేదా జీవిత భాగస్వాముల చేతుల్లో ప్రతి పది నిమిషాలకు ఓ మహిళ/బాలిక హత్యకు గురవుతున్నారు. అంటే రోజుకు కనీసం 137 మంది ఈ విధంగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక వెల్లడించింది. అదే విధంగా కుటుంబ సభ్యుల్లో హత్యకు గురవుతున్న పురుషుల సంఖ్య మహిళలతో పోల్చితే చాలా తక్కువేనని పేర్కొంది. కంచే చేను మేసిన చందంగా స్త్రీజాతి పరిస్థితి మారిందని ఆందోళన వ్యక్తంచేసింది. ప్రతి 10 నిమిషాలకు ఒక మహిళ చావు నమోదువుతున్నదంటే రోజుకు 137 మంది తమ ఇంట్లోనే హత్యకు గురవుతున్నారని యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్

- మిగతా 2 లో

'ముస్లిం బ్రదర్‌హుడ్'పై ట్రంప్ ఉగ్ర ముద్ర!

వాషింగ్టన్: 'ముస్లిం బ్రదర్‌హుడ్' సంస్థలను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా ముద్ర వేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలు చేపట్టారు. లెబనాన్, ఈజిప్టు, జోర్డాన్ వంటి ముస్లిం బ్రదర్‌హుడ్‌పై చర్యలుకుగాను విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్‌కు ఆదేశాలు జారీ చేశారు. అలాగే కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకాలు చేశారు. నివేదిక అందిన 45 రోజుల్లోపు ఆ సంస్థలపై ఎలాంటి చర్యలపై మంత్రులు నిర్ణయించేలా ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇజ్రాయిల్, అమెరికా భాగస్వాములపై దాడులకు మద్దతు ఇచ్చినట్లు ఆరోపిస్తూ ఈ మేరకు చర్యలకు ట్రంప్ యంత్రాంగం ఉపకరించినట్లు ఫ్యాక్ట్ షీట్ ఆధారంగా తెలుస్తోంది. టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్ కూడా ఇటీవల ముస్లిం బ్రదర్‌హుడ్‌పై చర్యలు తీసుకున్నారు. ఇది రాష్ట్ర స్థాయికే

పరిమితం కాగా ముస్లిం బ్రదర్‌హుడ్ అనేది 1920లో ఈజిప్టులో స్థాపించారు. ఇస్లామిక్ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడమే లక్ష్యంగా అరబ్‌కు వ్యాపించిన ఈ సంస్థ పని గోప్యంగా సాగుతున్నట్లు సమాచారం.

మైన్మార్ శరణార్థులకు టీపీఎస్ రద్దు

మైన్మార్ ఇమిగ్రెంట్లకు తాత్కాలిక భద్రతా హోదా (టీపీఎస్) రద్దు చేస్తూ ట్రంప్ ఉత్తర్వులు జారీచేశారు. తమ దేశం నుంచి వారిని తిప్పి పంపేయాలని నిర్ణయించారు. అమెరికాలో శరణ పొందుతూ టీపీఎస్ కలిగివున్న నాలుగు వేల మందిపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుంది. టీపీఎస్ ఉన్న వారికి ఇమిగ్రేషన్ నుంచి రక్షణ, ఉద్యోగాలకు అనుమతి లభిస్తాయి. స్వదేశంలలో యుద్ధం, విపత్తులు వంటి అసాధారణ పరిస్థితుల్లో ప్రాణ భయం ఉండి తమ దేశంలో శరణ కోరితే అమెరికా ప్రభుత్వం అలాంటి వారికి టీపీఎస్ హోదా కల్పిస్తుంది. అయితే ఇమిగ్రేషన్ నియంత్రణ దిశగా ట్రంప్ యంత్రాంగం చర్యల్లో భాగంగా తాజా నిర్ణయం జరిగింది. అఫ్గాన్, కామరూన్, హైతీ, హోండూరస్, నేపాల్, నికరాగ్వా, సిరియా, దక్షిణ సూడాన్, వెనిజులా పౌరుల కోసం టీపీఎస్ హోదా రద్దు చేస్తూ ట్రంప్ ఉత్తర్వులు జారీచేశారు.

'హెచ్1బీ'కు ట్రంప్ పరిమిత మద్దతు: లీవిట్

వాషింగ్టన్: 'అమెరికాలో విదేశీ కంపెనీలు ట్రిలియన్ డాలర్లు పెట్టుబడితో పాటు బ్యాటరీలు వంటి ప్రత్యేక ఉత్పత్తుల తయారీకి విదేశీ ఉద్యోగులను తీసుకురావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యోచిస్తున్నారు. అందుకోసమే హెచ్-1బీ వీసాలకు పరిమితిగా మద్దతు తెలిపారు' అని శ్వేతసౌధం ఒక ప్రకటన చేసింది. ఇదే అంశమై శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలీన్ లీవిట్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అమెరికన్లకు దక్కాల్సిన ఉద్యోగాలను వేరొకరికి ఇవ్వడాన్ని ట్రంప్ సమర్థించడం లేదన్నారు. తయారీ పరిశ్రమలను మెరుగుదల కోసం వాణిజ్య ఒప్పందాలు- సుంకాల విధంపు వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేశంలో పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేయాలనుకునే కంపెనీలు అమెరికన్లకు ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని స్పష్టంచేశారని లీవిట్ అన్నారు. హెచ్-1బీ వీసాపై కఠినంగా వ్యవహరిస్తూ దరఖాస్తు రుసుమును లక్ష డాలర్లకు పెంచారు. విదేశీ ఉద్యోగుల కారణంగా అమెరికన్లు అవకాశాలు కోల్పోవాల్సి వస్తోందని గట్టిగా వాదించిన ట్రంప్ ఇటీవల హెచ్-1బీ వీసాలు జారీ చేయడాన్ని సమర్థించారు. విదేశీ ఉద్యోగుల అవసరం అమెరికాకు ఉందన్నారు. అమెరికా కంపెనీల్లో బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టే వారిని అనుమతించకపోతే విజయం సాధించలేమని చెప్పారు. విదేశీ ఉద్యోగులు అమెరికన్లకు నైపుణ్యాలు నేర్పించి వారి వారి దేశాలకు తిరిగి వెళ్లిపోవాలని షరతు పెట్టారు.

అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడి

తొమ్మిది మంది చిన్నారులు సహా 10 మంది మృతి

కాబూల్: అఫ్గానిస్థాన్-పాకిస్థాన్ మధ్య ఘర్షణలు మళ్లీ మొదలయ్యాయి. అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడిలో తొమ్మిది మంది చిన్నారులు, ఓ మహిళ మొత్తం 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు అఫ్గాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం మంగళవారం ఒక ప్రకటన చేసింది. సోమవారం రాత్రి పాకిస్థాన్ వరుస దాడులు చేసిందని, డ్రోన్లతో రెచ్చిపోయిందని, ఖోస్ట్ ప్రావిన్స్‌లో నివాసాలు ధ్వంసం కాగా పది మంది చనిపోయారని ప్రభుత్వ ప్రకటన వెల్లడించింది. అఫ్గాన్ వాణిజ్య మంత్రి అల్హాజ్ నూరుద్దీన్ అజీజ్ భారత్ పర్యటన వేళ ఈ దాడులు జరగడం గమనార్హం. 'మా గగనతలాన్ని, మా భూభాగాన్ని, మా ప్రజలను కాపాడుకోవడం మాకున్న న్యాయబద్ధమైన హక్కు. తగు సమయంలో సరైన విధంగా స్పందిస్తాం' అని తాలిబన్ అధికార ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ అన్నారు. అఫ్గాన్ సార్వభౌమత్వంపై దాడి పాకిస్థాన్ అధికారులు అంగీకరించిన నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించారు. సోమవారం పాకిస్థాన్‌లోని పెషావర్‌లో ఆత్మాహుతి దాడుల్లో పారమిలటరీ సిబ్బంది ముగ్గురు చనిపోయారు. ఈనెలారంభంలో ఇస్లామాబాద్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు దశాబ్దం తర్వాత పాక్ రాజధానిలో పౌరులే లక్ష్యంగా మొదటిసారి దాడి జరిగింది. తెహ్రీక్ ఏ తాలిబన్ పాకిస్థాన్ చీఫ్ నూర్‌వలీ మెహ్సూద్ స్థావరం లక్ష్యంగా పాక్ యుద్ధ విమానాలు దాడి చేసినట్లు అప్పట్లో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వ వర్గాలు సమర్థించుకున్నాయి. కాల్పుల విరమణకు అంగీకరించిన తర్వాత తాజా దాడితో మళ్లీ రెండు దేశాల మధ్య ఉద్రిక్తత నెలకొంది.

లేబర్ కోడ్లతో మిగిలేది బానిసత్వమే

(మొదటిపేజీ తరువాయి)

కమ్యూనికేషన్ అని ప్రశ్నలు అంగీకరించరని విమర్శించారు. కొత్త లేబర్ కోడ్ల వల్ల ఏడాది సర్వీసు తరువాత గ్రాట్యూటీ వస్తుందని చెబుతున్నారని, కంపెనీలు ఉద్యోగులను 11 నెలల కాంట్రాక్టుకు నియమించుకుంటున్న విషయాన్ని విస్మరించారని అన్నారు. కొత్త లేబరు కోడ్ల వల్ల ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పర్మినెంట్ ఉద్యోగులు ఉండరన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 15 లక్షల ఉద్యోగాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో 7 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కొత్త లేబర్ కోడ్ల వల్ల కాంట్రాక్టు, ఫిక్స్ టర్మ్ ఉద్యోగులు వస్తారని, ఎన్నో ఏళ్లుగా అమలవుతున్న రిజర్వేషన్లు ఉండబోవన్నారు. ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్లు ఫెసిలిటేటర్లుగా మారతారని, యాజమాన్యాలను ప్రాధేయపడటం మాత్రమే చేయగలరని, వారికి ఉన్న అధికారాలను తీసివేశారని తెలిపారు. ఈ లేబర్ కోడ్లతో కార్మికులు బానిసత్వంలోకి వెళ్తారని అన్నారు. దిల్లీ ఎన్నికల ముందు దిల్లీలో ఎక్కువమంది ఓటర్లు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్న విషయాన్ని గుర్తించి ఎనిమిదవ పే కమిషన్ వేస్తామని ప్రకటించారని తెలిపారు. బీహార్ ఎన్నికల ముందు మరోసారి దీని ప్రస్తావన తీసుకొచ్చారన్నారు. నిజానికి అంతకుముందు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఇకపై పే కమిషన్లు ఉండవని ప్రకటించారని గుర్తు చేశారు. కనీస వేతన నిర్ణయంలో అనేక అంశాలను ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవడం లేదని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం సీపీఐ కృషితో దేశంలో ఉక్కు కర్మాగారాల ఏర్పాటుకు సోవియట్ యూనియన్ సహకరించిందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల వల్ల దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. ప్రపంచంలో సరఫరా సంక్షోభం ఎదురైనప్పుడు చైనా, భారత్ లు తట్టుకొని నిలబడ్డాయన్నారు. స్వాతంత్ర్యానంతరం దేశాభివృద్ధి కోసం అభివృద్ధి చెందిన దేశాలు సహాయం చేయడానికి ముందుకు రాలేదని, సోషలిస్టు దేశాలు సహకారం అందించాయని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ కు రూ. 22 వేల కోట్ల రాయితీలు ప్రభుత్వం ప్రకటించిందని, ప్రభుత్వ రంగ స్టీల్ ప్లాంట్ ఏమైనా రాయితీలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ప్రైవేటు సంస్థలకు కారు చౌకగా భూములు కట్టబెడుతున్నారని, పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తున్నారని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులపై ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు దారుణమని విమర్శించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ 10 గంటల పని, నైట్ షిఫ్ట్ లో మహిళలతో పని చేయించడానికి రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపడాన్ని ఖండించారు. దుర్మార్గమైన లేబర్ కోడ్లను ఎంపీలు ప్రశ్నించడం లేదని అన్నారు. పార్లమెంటులో కమ్యూనిస్టుల బలం తగ్గటం వల్ల ప్రశ్నించే పరిస్థితి లేదని తెలిపారు. కార్మిక వర్గం రాజకీయ, వర్గ చైతన్యాన్ని నింపుకొని కమ్యూనిస్టులను గెలిపించుకోవాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ డీఏ కూడా ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షులు డీ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు దేశ సంపదని, వాటిని విక్రయించే అధికారం కేంద్రానికి లేదన్నారు.

ఈ సదస్సులో ఏఐటీయూసీ విశాఖ జిల్లా అధ్యక్షుడు మన్మధరావు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

జగమంతా రామమయం

(మొదటిపేజీ తరువాయి)

నేటితో పరిపూర్ణత వచ్చిందని చెప్పుకొచ్చారు. దేశం పురోగతి సాధించాలంటే...మన గుర్తింపు గురించి మనం గర్వపడాలని ప్రధాని అన్నారు. మన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మన మనస్సులో ముద్రించిన బానిస మనస్తత్వాన్ని వదిలించుకోవాలని కోరారు. మనకు స్వేచ్ఛ లభించింది కానీ న్యూనతా భావాల నుంచి కాదన్నారు. అంతకముందు అయోధ్య శ్రీరామ్‌లల్లా ఆలయంలో జరిగిన ధ్వజారోహణం కార్యక్రమంలో ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామాలయంపై 22 అడుగుల కాషాయ జెండాను మోదీ ఆవిష్కరించారు. రామ జన్మభూమి ట్రస్ట్ సభ్యుల సమక్షంలో జెండా ఆవిష్కరణ జరిగింది. సాధువులు, ప్రముఖులు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు. "ధ్వజ్ ఆరోహణ్" కార్యక్రమంలో భాగంగా జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ జెండా లంబకోణ త్రిభుజాకారంలో సూర్యుని చిహ్నాన్ని కలిగి ఉంది. శాశ్వత శక్తి, దైవిక తేజస్సు, ధర్మం, జ్ఞానోదయాన్ని సూచిస్తుంది. శ్రీరాముడితో సంబంధం ఉన్న అన్ని లక్షణాలు ఈ జెండాలో కనిపిస్తాయి. 'ఓం' చిహ్నంతో చెక్కబడిన జెండాను ఆలయ 'శిఖర్' పైన ఉంచారు.

'రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'పై సమీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణలో డిసెంబరు ఎనిమిది, తొమ్మిది తేదీల్లో నిర్వహించే రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ -2025 నిర్వహణ... ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విభాగాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 30 వరకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ సమీక్ష సమావేశాలు జరుగుతాయి. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఆయా విభాగాల సమీక్షలో సంబంధిత మంత్రులు పాల్గొంటారు. ఈ నెల 26న లాజిస్టిక్స్ ఏర్పాట్లు, 27న మౌలిక వసతులు, అభివృద్ధి, 28 విద్య, యువజన సంక్షేమం, టూరిజం, టెంపుల్ టూరిజం, 29న వ్యవసాయం, సంక్షేమ విభాగాలు, 30న ఆరోగ్య రంగం పై సీఎంతో పాటు ఆయా శాఖల మంత్రులు, సంబంధిత అధికారులు సమీక్షా సమావేశాలకు హాజరవుతారు.

సంతృప్తి ఎక్కడ?

- పెరగని బస్సుల సంఖ్య
- ప్రయాణికుల ఇక్కట్లు
- మహిళల్లోనూ మిశ్రమ స్పందన
- ఉచిత బస్సు పథకంపై పెదవి విరుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల హామీ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (మహాలక్ష్మి) పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం మొదలైన రోజునుండే ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో ఆనందం వెల్లివిరిసింది. అయితే ఆ ఉత్సాహం క్రమంగా అసహనంగా మారుతోంది. కారణం... అవసరానికి అనుగుణంగా రోడ్లపై బస్సుల సంఖ్య పెరగకపోవడం. అదనపు సిబ్బంది నియామకాలలో లోటు, రవాణా శాఖ ముందస్తు ప్రణాళికా లోపాలు స్పష్టంగా కనబడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా పట్టణాలు, అర్బన్ ప్రాంతాల్లో బస్సుల రద్దీ అమాంతం పెరిగిపోయింది. రద్దీ సమయాల్లో బస్సులో ప్రయాణం ప్రయాణికులకు కష్టతరంగా మారుతోంది. బస్సులో సీటు కోసం మహిళలు, పురుషులు పోటీపడి... ఎగిబడి ఎక్కే పరిస్థితులు కనిపిస్తున్నాయి. చాలా రూట్లలో రెండు బస్సులకు సరిపడా ప్రయాణికులు ఒక్క బస్సులో కిక్కిరిసిపోవడం సాధారణమైపోయింది. బస్సు ఎక్కిన వెంటనే సీటు దక్కించుకోవాలన్న తపనతో మహిళలు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు రూట్‌లలోఅదనపు బస్సులు ఏర్పాటు చేసినా ముందుగా వెళ్లాలన్న తొందరలో ఆర్టీసీ సిబ్బంది మరో పది, పదిహేను నిమిషాల్లో మరో బస్సు ఉందని చెబుతున్నా...ఆ బస్సులోనే అందరూ ఎక్కే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల ప్రయాణం సౌకర్యం కంటే పోరాటంలా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదీకాక బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉన్న సమయంలో డ్రైవర్లు మార్గమధ్యలోని పలు ముఖ్య స్టాప్‌ల వద్ద నిలిపే పరిస్థితి లేకుండా నేరుగా వెళ్లిపోతున్నారు. దీంతో గంటల తరబడి బస్సు కోసం ఎదురు చూడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన ఈ పథకం ఉపయోగకరమే అయినప్పటికీ... సరైన సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రయాణం శ్రమగా మారిందని చాలామంది అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో చిరు ఉద్యోగాలు చేసుకునే గ్రామీణ యువతులు, మహిళలకు ఈ పథకం చాలా ఉపయోగకరంగా ఉన్నప్పటికీ... బస్సుల సంఖ్య పెరగకపోవడంతో సమయానికి ఉద్యోగాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. మరోవైపు బస్సుల్లో సగానికిపైగా మహిళలు నిండిపోవడంతో పురుషులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు చెల్లించి టికెట్ తీసుకుని తాము నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తుందని బాధపడుతున్నారు. చాలామంది మహిళలు సైతం రద్దీ సమయాల్లో బస్సులో నిలబడే ప్రయాణం చేస్తున్నారు. ఈ పథకం వల్ల మహిళలు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారా అంటే అదీ కనబడటం లేదు. పథకం ఉద్దేశం ఎంత మంచిదైనా... అమలు సక్రమంగా లేకపోతే ప్రజలకు సంతృప్తి దక్కదనే మాట వినబడుతోంది. పూర్తిస్థాయిలో ప్రజల నుంచి సంతృప్తి రావాలంటే అవసరానికి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచడంతో పాటు ప్రయాణికులకు బస్సుల సమయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ఏదో ఒక నిర్ణయం తీసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

అధికారం చేపట్టిన నాటి నుంచీ రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఉంటుందని ప్రచారంలో ఉంది. నవంబరు 20తో ఆ రెండున్నరేళ్ల గడువు ముగిసింది. దాంతో కర్నాటక రాజకీయాలు వేడెక్కాయి. ఐదేళ్లూ సిద్ధరామయ్యే సీఎంగా కొనసాగుతారని ఒకవైపు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ చెబుతున్నా... మరోవైపు సీఎం పదవిపై ఆశను మాత్రం చంపుకోలేదు. ముఖ్యమంత్రి పదవిపై పరోక్షంగా సంకేతాలు ఇస్తున్నారు. కర్నాటక రాజకీయాల్లో మరికొన్ని రోజుల్లో కీలక పరిణామాలు చోటు చేసుకోనున్నాయని విపక్ష నేతలు జోస్యం చెబుతున్నారు.

కంచె చేనుమేస్తే...

(మొదటిపేజీ తరువాయి)

(యూఎన్‌ఓడీసీ) తాజా నివేదిక తెలిపింది. స్త్రీజాతిపై నేరాల నియంత్రణలో ప్రపంచవ్యాప్తంగా పెద్దగా పురోగతి లేదని వ్యాఖ్యానించింది. చట్టాలు ఎన్ని ఉన్నాగానీ స్త్రీజాతికి రక్షణ లేకపోవడం నిత్యం చర్చనీయాంశంగా ఉంటుందంటే అతిశయోక్తి కాదు.

ఐరాస తాజా నివేదిక ప్రకారం గతేడాది 83వేల మంది మహిళలు/ యువతులు హత్యకు గురి కాగా వీరిలో 60 శాతం అంటే 50వేల మందికిపైగా తమ కుటుంబ సభ్యులు, జీవిత భాగస్వాముల చేతుల్లోనే హతమయ్యారని నివేదిక వెల్లడించింది. అదే పురుషులపై ఇలాంటి నేరాలు 11శాతం మేర నమోదైనట్లు తెలిపింది. బాలికలు, యువతులు, మహిళలకు తమ ఇల్లే అత్యంత ప్రమాదకరమైన స్థలంగా మారిపోయిన పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నాయని యూఎన్‌ఓడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాన్ బ్రాండోలినా వెల్లడించారు. స్త్రీజాతిపై హింస, నేరాలను కట్టడి చేయడం కోసం మరింత మెరుగైనా వ్యూహాలు, క్రిమినల్ జస్టిస్ ప్రతిస్పందనలు అవసరమని నొక్కిచెప్పారు. అన్ని దేశాల్లోనూ మహిళలు, బాలికలు తీవ్రస్థాయిలో హింసను ఎదుర్కొంటున్నట్లు యూఎన్ ఉమన్స్ పాలసీ డివిజన్ డైరెక్టర్ సారా హెండ్రిక్స్ వ్యాఖ్యానించారు. ఆన్‌లైన్ హింస కూడా ప్రమాదకరంగా మారిందని అన్నారు. మహిళలు తమ జీవిత భాగస్వాములు లేక కుటుంబ సభ్యుల చేతిలో హతమైన కేసులు ఆఫ్రికా, అమెరికా, ఆసియా, యూరప్‌లో ఎక్కువగా ఉన్నట్లు అంచనా ఉంది. 2023లో ఈ విధంగా హత్యకు గురైన మహిళలు, యువతుల సంఖ్య 51,100 కాగా 2024లో సంఖ్య కాస్త తగ్గి 50వేల మేర నమోదైనట్లు ఐరాస నివేదిక తెలిపింది. దేశీయంగా డేటాను పరిగణనలోకి తీసుకుంటే సంఖ్య మారుతుందని, నేరాల్లో నిజంగా తగ్గుదల వచ్చినట్లు కాదని పేర్కొంది.

దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి నిర్వహణలో ఏమైనా సమస్యలు తలెత్తితే, తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తక్షణమే పరిష్కరించడానికి కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను తరలించడంలో ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. రైతులకు నగదును కూడా త్వరగా వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. టార్పాలిన్లు, తూకాల పరికరాలు, తగిన బస్తాల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే. సాబీర్ పాషా, సంఘం అధ్యక్షులు మండే హన్మంతరావు, ఉపాధ్యక్షులు కూచుపూడి జగన్, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో సుభాషిణి, ఏఓ రామేశ్వరి, సలిగంటి శ్రీనివాస్, వీరస్వామి, వి. మల్లికార్జున్, సుధాకర్, మన్నే వెంకన్న, హుమయున్, తోట రాజు, జగదాంబ పాల్గొన్నారు.

భూ విజ్ఞాన శాస్త్ర పరిశోధనలో 'ఎర్త్ సైన్సెస్' కీలకం

నియోజకవర్గంలో ప్రారంభం కానున్న డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ దేశంలోనే భూ విజ్ఞాన శాస్త్ర పరిశోధనలో కీలకం కానుందని, ఇది భద్రాద్రి జిల్లాకు దక్కిన అరుదైన గౌరవమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా డిసెంబరు రెండో తేదీన ప్రారంభం కానున్న ఎర్త్ సైన్సెస్ వర్సిటీ ప్రాంగణాన్ని మంగళవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి పరిశీలించారు. భవన సముదాయాలు, తరగతి గదులు, పరిశోధనాశాలలు, ప్రొఫెసర్ల కార్యాలయాలు, క్రీడా మైదానాలు పరిశీలించి పెండింగులో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీర్లకు, అధికారులకు సూచించారు. మీడియాతో కూనంనేని మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తొలి వర్సిటీ ఏర్పాటు చేయాలన్న తన కృషి ఫలించబోతుందని చెప్పారు. ఇది కేవలం ఒక విద్యా సంస్థ మాత్రమే కాదని భవిష్యత్తు

తరాలకు జ్ఞానాన్ని, సరికొత్త పరిశోధనలను అందించే శక్తి కేంద్రమన్నారు. ఈ యూనివర్సిటీ కొత్తగూడెం నియోజకవర్గం పేరును ప్రపంచ పటంలో నిలబెడుతుందని పేర్కొన్నారు. ఎర్త్ సైన్సెస్ కోర్సులతో మన యువతకు బొగ్గు, ఖనిజ, ఇంధన రంగాల్లో అపారమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. వేలాదిమందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, మున్సిపల్ కమిషనర్ సుజాత, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు పాల్గొన్నారు.

మోగిన పంచాయతీ నగారా

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు ఎస్ఈసీ చెప్పారు. డిసెంబరు 11, 14, 17 తేదీల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ ఓటర్లు 1.66 కోట్ల మంది ఉన్నారు. 4,200 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు మొదటి దశలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

'హెచ్ఐఎల్టీపీ'తో రూ.5 లక్షల కోట్ల కుంభకోణం

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జనరల్ బాడీ కౌన్సిలింగ్ సమావేశంలో నిలదీశారని తెలిపారు. ప్రజల భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా చేస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలు, అరాచకాలపై విద్యార్థి లోకం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 'గత పదేళ్లలో ఏమీ జరగలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం గోబెల్స్ ప్రచారానికి తెరతీసింది. వారి అబద్ధాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉంది' అని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వచ్చే నెల నుంచి పోరాటాన్ని ఉధృతం చేయనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. విద్య, ఉద్యోగ, ఉపాధిపై కాంగ్రెస్ ద్రోహాన్ని ఎండగట్టాలన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కేవలం స్థానిక సంస్థలకే కాదని, విద్యా, ఉద్యోగ అవకాశాల్లోనూ రిజర్వేషన్లు పెంచుతామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నీ అమలయ్యేదాకా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ చరిత్రలో దీక్ష దివాస్ నవంబరు 29 ఒక గొప్ప మహా ఘట్టంగా నిలిచిపోతుందన్నారు. ఆరోజే కేసీఆర్ దీక్ష ఫలితంగా తెలంగాణ సాధ్యమైందన్నారు. "ఉద్యమాల నుంచే నిజమైన నాయకులు పుడతారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పోరాటం చేసేవారినే ప్రజలు నాయకులుగా కోరుకుంటారు. కాంగ్రెస్ అరాచకాలపై పోరాడి, ప్రతి విద్యార్థి ఒక యోధుడిగా ఎదగాలి" అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

జీహెచ్ఎంసీ విస్తరణ

(మొదటిపేజీ తరువాయి)

రెండు డిస్కమ్‌లతో పాటు కొత్తగా మూడో డిస్కమ్ ఏర్పాటు. రాష్ట్రంలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్, మిషన్ భగీరథ, సురక్షిత మంచి నీటి పథకాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ సీవరేజ్ బోర్డ్ పవర్ కనెక్షన్లన్నీ కొత్త డిస్కమ్ పరిధిలోకి రానున్నాయి. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, రాబోయే పదేండ్లకు అవసరమయ్యే విద్యుత్ సరఫరా, ఉత్పత్తి అంచనాలను పరిగణలోకి తీసుకుని పునరుత్పాదక విద్యుత్ వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నిబంధనల ప్రకారం, రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా 5 ఏళ్ల కాలపరిమితి ఒప్పందాలతో 3 వేల మెగావాట్ల సోలార్ పవర్ కొనుగోలుకు వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని నిర్ణయించారు.. సోలార్ పవర్ తరహాలోనే పంప్డ్ స్టోరేజ్ పవర్ వినియోగం పెంచడానికి 5 ఏళ్ల కాలపరిమితి ఒప్పందాలతో 2 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకు వచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే డిస్కమ్‌ల వద్ద ఉన్న ఎంఓయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. అందుకు ఆసక్తిని వ్యక్తీకరించే కంపెనీలకు అవసరమైన భూమి, నీటిని ప్రభుత్వం కేటాయిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ముందుగా రాష్ట్ర డిస్కమ్‌లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది. రాష్ట్రానికి వచ్చే కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ లో కొత్త పరిశ్రమలకు అవసరమైన విద్యుత్తును సొంతంగా ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. కొత్త పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ జనరేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే వెంటనే అనుమతి ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. అందులో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యానికి సంబంధిత ఎలాంటి గరిష్ఠ పరిమితి ఉండదు. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌లో కొత్తగా నిర్మించే 800 మెగావాట్ల ప్లాంట్‌ను ఎన్టీపీసీ అధ్వర్యంలో చేపడతారు. పాల్వంచ, మక్తల్‌లోనూ ఎన్టీపీసీ అధ్వర్యంలో విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణానికి అవకాశాలను పరిశీలిస్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్ద నల్లబెల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ బీసీ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 20.28 ఎకరాలు, అలాగే ములుగు జిల్లా జగ్గన్నపేట గ్రామంలో స్పోర్ట్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు 40 ఎకరాల భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో 56 ఏటీసీలకు అదనంగా జూబ్లీహిల్స్‌తో పాటు రాష్ట్రంలో కొత్తగా 6 ఐటీఐలను ఏటీసీలుగా మార్పు చేయనున్నారు.

మోదీ నిస్సిగ్గు ప్రయత్నం

(మొదటిపేజీ తరువాయి)

వేదికగా దుయ్యబట్టారు. బహుళవాదానికి బదులుగా ఆర్ఎస్ఎస్ సైద్ధాంతిక అజెండాకు చట్టబద్ధత కోసం దేశ సర్వోన్నత వ్యవస్థ దుర్వినియోగం ఆందోళనకరమని అన్నారు. 'హిందూ, ముస్లిం, సిక్కు క్రైస్తవుడు, దళితుడు, గిరిజనుడు, మహిళ, పురుషుడు అన్న బేధం లేకుండా భారతీయులుగా మనకు గుర్తింపునిచ్చే జెండా ఒక్కటే. అదే త్రివర్ణ పతాకం! స్వాతంత్ర్యం కోసం... లౌకిక, ప్రజాస్వామ్య దేశం నిర్మాణం కోసం మువన్నెల జెండా చేబూని పోరాడాం. నేడు జరిగినది పునరుజ్జీవం కాదు. మన జాతీయవాదం, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం, చట్టపాలనను నిర్వచించే విలువల్ని తిరస్కరించే ఘట్టం' అని డి.రాజా వ్యాఖ్యానించారు.

నేడు దేశవ్యాప్త పోరు

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేక-యాజమాన్యాల అనుకూల విధానాలతో కేంద్రం అప్రజాస్వామిక పద్ధతులు అవలంబిస్తోందని దుయ్యబట్టాయి. శ్రామికవర్గంపై ప్రత్యక్ష దాడికి పూనుకున్నట్లు విమర్శించాయి. 'చరిత్రలో నిలిచిపోయే విధంగా ఐక్యంగా తీవ్రస్థాయిలో ప్రతిఘటిద్దాం... కదిలి రండి' అంటూ కేంద్ర కార్మిక సంఘాలతో పాటు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చాయి. ఉమ్మడిగా పోరాడి ప్రభుత్వం మెడలు వంచుదామని శ్రామికులకు సూచించాయి. 2015 నుంచి ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సీ) నిర్వహించలేదని గుర్తుచేశాయి. ఈ సమావేశం నిర్వహించేందుకు తక్షణమే కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించాయి. శ్రమ్ శక్తి నీతి 2025 రద్దునకు డిమాండ్ చేశాయి. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని కేంద్ర కార్మిక సంఘాలు ఇటీవల పిలుపునివ్వడం విదితమే.

స్వదేశంలోనే 'హామర్' తయారీ

(మొదటిపేజీ తరువాయి)

జీపీఎస్, ఇన్ఫ్రారెడ్, లేజర్ టెర్మినల్ వంటి గైడెడ్ ఆప్షన్లు ఉన్నాయి. 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదు. ఇందులోని గైడెడ్ మెకానిజం జీపీఎస్ అందుబాటులో లేని పరిస్థితుల్లోనూ లక్ష్యాన్ని ఛేదించగలదు. స్థిరంగా ఉండే, కదిలే లక్ష్యాలపైనా ఇది సమర్థంగా పనిచేస్తుందని రక్షణశాఖ పేర్కొంది. మాలి, లిబియా, సిరియాలో యుద్ధాల సమయంలో కొన్ని నాటో అనుబంధ దేశాలు ఈ వ్యవస్థను ఉపయోగించాయి. రష్యాతో యుద్ధం చేస్తోన్న ఉక్రెయిన్‌కు కూడా ఫ్రాన్స్ వందలాది హామర్ క్షిపణులు అందించింది. ఈ ఏడాది పాకిస్థాన్‌పై జరిపిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఈ క్షిపణులను ఉపయోగించి శత్రుదేశ వైమానిక స్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. మేక్-ఇన్-ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల్లో భాగంగా ఈ ఒప్పందం జరిగింది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), ఫ్రాన్స్‌కు చెందిన శాఫ్రాన్ ఎలక్ట్రానిక్స్ అండ్ డిఫెన్స్ సంస్థలు ఈ జాయింట్ వెంచర్‌పై సంతకాలు చేశాయి. 50:50 భాగస్వామ్యంతో ఈ రెండు సంస్థలు సంయుక్త వెంచర్‌ను ఏర్పాటు చేస్తాయి. భారత వాయుసేన, నౌకాదళం అవసరాలకు అనుగుణంగా హామర్ వ్యవస్థను స్థానికంగా తయారు చేయనున్నాయి. స్థానికంగా తయారయ్యే ఎలక్ట్రానిక్స్, ఇతర మెకానికల్ విడి భాగాలను ఈ క్షిపణి వ్యవస్థలో వినియోగించనున్నారు. తద్వారా 60 శాతం వరకు భారత్ వీటి తయారీలో స్వావలంబన సాధించినట్లవుతుంది.

మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర తొర్రూర్: మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం చేపట్టిన భాగంగా, మత్స్యశాఖ 100 శాతం రాయితీతో ఉచిత చేపపిల్లల కార్యక్రమంలో భాగంగా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామంలోని పెద్ద చెరువులో పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి హాజరై చేపపిల్లలను చెరువులో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం ద్వారా ప్రాంతంలోని మత్స్యకార కుటుంబాలు, గ్రామీణ రైతుల ఆదాయం పెరిగే అవకాశం ఉందని, పెద్ద చెరువుల అభివృద్ధి మత్స్యోత్పత్తి పెంపుతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని తెలిపారు. గ్రామాల్లో స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల సస్యశ్యామల అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకువస్తున్న పథకాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఉచిత చేపపిల్లల పంపిణీ గ్రామీణ జీవనాధారాలను దృఢపరచే కార్యక్రమమని ఆమె అభిప్రాయపడనున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు, మత్స్యకార సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధితో సమాజాభివృద్ధి : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వడ్డీలేని రుణాల పంపిణీ పథకంలో భాగంగా మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, మండలాల తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలిసి లబ్ధిదారులకు వడ్డీలేని రుణాల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభివృద్ధి లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తుందని, ఇందులో భాగంగా మహిళల ఆర్థిక అభివృద్ధికి వడ్డీ లేని రుణాలను అందిస్తుందని తెలిపారు. మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళను కుటుంబ పెద్దగా గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా కోళ్ళ పెంపకం, డైరీ ఫార్మ్, క్యాంటీన్ ఇతర వ్యాపార రంగాలలో మహిళలను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేయడం జరిగిందని, మందమర్రి మండలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుతో పాటు మిగతా ప్రాంతాలలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దండేపల్లి మండలంలో మహిళల నిర్వహణలో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మంచిర్యాల నియోజకవర్గంలోని 1 వేయి 618 స్వయం సహాయక సంఘాలకు 1 కోటి 43 లక్షల 61 వేల రూపాయల వడ్డీ లేని రుణాల పంపిణీ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎంపి వంశీక్రిష్ణపై ఎందుకీ వివక్షా

విశాలాంధ్ర బ్యూరో పెద్దపల్లి: ప్రజలచే ఎన్నుకోబడిన పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీక్రిష్ణ ప్రోటోకాల్ విషయంలో అధికారులు వివక్ష చూపెట్టడం దారుణమని మద్దికుంట మాజీ సర్పంచ్ సజ్జద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రెస్ క్లబ్బులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రెండేళ్ళుగా ఎంపి పట్ల చూపెడుతున్న వైఖరి గర్హనీయమన్నారు. ఈనెల 24న జరిగిన ఇందిరమ్మ సంబరాలు చీరల పంపిణి కార్యక్రమానికి ఎంపి వంశీక్రిష్ణను ఆహ్వానించకుండా అవమానపరిచారని ఆవేదన చెందారు. రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్న కార్యక్రమంలో స్థానిక ఎంపికి ప్రోటోకాల్ ఉండదా అని ప్రశ్నించారు. ఇదేవిషయమై అనేకమార్లు లిఖితపూర్వకంగా లేఖలు ఇచ్చినప్పటికీ, అధికారుల తీరులో మార్పు రావడంలేదన్నారు. ప్రోటోకాల్ విషయంలో ఎంపి గడ్డం వంశీక్రిష్ణను అవమానించిన జిల్లా అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు బందారి సునిల్ గౌడ్, పెరుక నవీన్, గంగుల సంతోష్, తాజోద్దిన్ పాల్గొన్నారు.

అధ్యాపకుడు దుర్భాషలాటపై విద్యార్థి ఆత్మహత్యాయత్నం?

విశాలాంధ్ర కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిపై అధ్యాపకుడు దుర్భాషలాడటంతో తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.అందుకు సంబంధించి విద్యార్థి,అతని తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.కామేపల్లి మండలం పాతలింగాల గ్రామానికి చెందిన విద్యార్థి కారేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. నాలుగు రోజుల క్రిందట ఎకనామిక్స్ అధ్యాపకుడు విద్యార్థులను సాయంత్రం ఐదు గంటల వరకు స్టడీ అవర్లో ఉంచాడు.పాత లింగాల గ్రామానికి చెందిన విద్యార్థి తమ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు మార్గం సక్రమంగా లేదని సాయంత్రం ఐదు గంటల వరకు కళాశాలలో ఉండటంవల్ల ఇంటికి వెళ్లేందుకు ఇబ్బంది అవుతుందని ఎకనామిక్స్ అధ్యాపకుడికి కొంచెం ముందు పంపాలని అభ్యర్థించాడు.దీంతో ఆంగ్ల అధ్యాపకుడు కలుగజేసుకొని ఆ విద్యార్థి పట్ల తోటి విద్యార్థులు ముందు నా కాలు కింద మట్టికి కూడా సరిపోవు అంటూ దుర్భాషలాడాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆ విద్యార్థి ఇంటికి వెళ్లే సమయంలో లారీ కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు.పక్కనే ఉన్న అతని సోదరుడు,ఇతరులు అప్రమత్తమై అతని కాపాడారు.ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయడంతో కళాశాలకు వచ్చి ప్రిన్సిపాల్ కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ప్రిన్సిపల్ కూడా సీరియస్ గా తీసుకోకపోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు మీడియాను ఆశ్రయించారు. గతంలో ఆంగ్ల ఉపాధ్యాయుడు బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే ప్రిన్సిపల్ ఫిర్యాదు చేయగా పైఅధికారుల ఆదేశాలతో మెమో కూడా జారీ చేయడం జరిగింది. అయినప్పటికీ ఆంగ్ల అధ్యాపకుడి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఆంగ్ల అధ్యాపకుడు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని నా దృష్టికి తీసుకువస్తే మేము జారీ చేశానని కళాశాల ప్రిన్సిపల్ ఎన్ విజయ్ కుమారి తెలిపారు.

మహిళలకు ఆర్థిక భరోసా : ఎమ్మెల్యే పాయం

విశాలాంధ్ర - మణుగూరు : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల హార్దిక అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతుందని, ఒక్కో మహిళను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వడ్డీ లేని రూ. 2 కోట్ల 66 లక్షలను చెక్కుల రూపంలో 2945 మహిళా సంఘాలకు ఎమ్మెల్యే అందించారు. గుట్టమల్లారం గ్రామంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపడితేనే ఆయా కుటుంబాలు అన్ని విధాల నిలదొక్కుకుంటాయన్నారు. మహిళల్లో స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించడం కోసం ప్రభుత్వం వేగంగా పనిచేస్తుందన్నారు. తమ ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గ్రామీణ కుటుంబాల ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేసి తీరుతమన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ విద్యా చందన, ఎంపిఓ వెంకటేశ్వరరావు, పిఆర్డి ఏ బాబు, సీడీపీఓ జయలక్ష్మి,ఎంఎంఎస్ మౌనిక, ఏడు మండలాల ఏపీఎంల తోపాటు కాంగ్రెస్ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, యూత్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు , మైనారిటీ నేత రహీం పాషా, కె. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డిపో ఏర్పాటయ్యే వరకు సీపీఐ పోరాటం

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ : రైల్వే డిపో ఏర్పాటు చేసే వరకు సిపిఐ పోరాటం ఆగదని సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రానికి 903 కోట్లతో మంజూరైన రైల్వే మెయింటెన్స్ డిపో వేరే ప్రాంతానికి తరలించే కుట్రలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ నుండి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం రైల్వే స్టేషన్ సెంటర్‌లో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ఆందోళనకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ మానుకోట జిల్లా కేంద్రానికి వచ్చిన రైల్వే డిపో పరిశ్రమను వేరే ప్రాంతానికి తరలించే కుట్రలు జరుగుతున్నా యని ,ఆ కుట్రలు మానుకొని ,వెంటనే మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పరిశ్రమను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నాడు రైల్వే డిపో పరిశ్రమలు తీసుకోవచ్చామని బిజెపి నాయకులు మీటింగ్‌లు పెట్టి మరియు పాలాభిషేకాలు చేసి ఇప్పుడు వేరే ప్రాంతానికి వెళుతుందని వారే చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. గతంలో బయ్యారం ఉక్కు పరిశ్రమ ఉమ్మడి విభజన చట్టంలో ఉందని పోరాటాలు జరుగుతుంటే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాణ్యత లేదని చేతులు దులుపుకున్నారన్నారు. జిల్లా కేంద్రంలో ప్రారంభించేంతవరకు సిపిఐ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు పెరుగు కుమార్ ,రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి ,కట్లోజు పాండురంగ చారి ,తండ సందీప్ , వెలుగు శ్రావణ్ ,ఎండి ఫాతిమా, కేదాసు రమేష్ ,ఆబోతు అశోక్ ,మేక వీరన్న, బానోత్ లింగ్య నాయక్ ,ఎండి మహమూద్ ,చిదిరాల జ్ఞానేశ్వర్, మంద శంకర్, గాదం శ్యాం ప్రసాద్ యాదవ్, ఎర్రోజు పద్మ ,కూరాకుల పాల్ ,జానీ, కొమ్ము యాకయ్య ,తోట రమేష్ ,వెతుకు కుమార్, బల్లెం శ్రీకాంత్ ,తండ సతీష్, రామచంద్రు ,సారయ్య ,మేక వెంకటేష్, పులి యాకయ్య ,మంద శ్రీను, శివ, అలీమా లక్ష్మి ,శ్రీకాంత్ ,రాంప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలు చిత్తశుద్ధితో ముందుకెళ్ళాలి : కలెక్టర్

నల్లగొండ బ్యూరో : మహిళలు చిత్తశుద్ధితో ముందుకెళ్లాలని, మహిళ కోసం మహిళనే అండగా నిలబడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె మాడుగులపల్లి మండలం, పోరెడ్డిగూడెంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌లతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం కార్యక్రమానికి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసాన్ని అందిస్తోందని కలెక్టర్ అన్నారు. తక్కువ సమయంలో ఇల్లు నిర్మించుకోవడం చాలా గొప్ప విషయమని,పోరెడ్డి గూడెం పైలెట్ ప్రాజెక్టు కింద లేనప్పటికీ, జూన్‌లో వర్షాలు వచ్చినా త్వరగా ఇండ్లు నిర్మించుకొని లబ్ధి పొందడం నూతన గృహప్రవేశాలు చేసిన కుటుంబాలను అభినందించారు. మహిళలు మహిళ శక్తిగా ఎదగాలని, మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, మహిళలకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు,బస్సుల నిర్వహణ,బ్యాంక్ లింకేజీ రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు .మహిళలు ఒకేపనికి పరిమితం కాకుండా, అని రంగాల్లో అభివృద్ధి చెందాలని, మహిళల పేరు మీదనే కల్యాణ లక్ష్మి, ఇందిర మహిళా శక్తి చీరల వంటి పథకాలు అందిస్తుందన్నదని తెలిపారు. ఇందిరా మహిళ శక్తి చీరలు,తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నదని, వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.అనంతరం శాసనసభ్యులు, ఎమ్మెల్సీ, జిల్లా కలెక్టర్ మహిళలకు ఇందిర మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి సంక్షేమ పథకాలు : రమేష్‌రెడ్డి

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మకంగా మహిళలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలో జివివి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సూర్యాపేట నియోజకవర్గమునకు చెందిన స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, చీరల పంపిణికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యాటక సంస్థ చైర్మన్ మాట్లాడుతూ వడ్డీ లేని రుణాలు నేరుగా మహిళల ఖాతాలోకి జమ అవుతాయని, మహిళలకు 30 లక్షలు రుణాలు ఇచ్చి ఆర్టీసీ బస్సు కొనుగోలు చేసి లీజ్‌కు తీసుకొని నెలకు రూ. 70,000 ఆదాయం వచ్చేలా చూస్తున్నామని, సోలార్ ప్లాంట్స్, పెట్రోల్ బంక్ లు ఏర్పాటు కు రుణాలు ఇచ్చి మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం నిరంతర కృషి చేస్తుందని అలాగే మహిళలకు ఇందిరా మహిళా శక్తి పేరుట నాణ్యమైన చీరలను సారేగా మార్చి ఇస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతే లక్ష్యంగా పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని,మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా, రాష్ట్రం, దేశం కూడా అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు.

ద్విచక్ర వాహన చోరీల నిందితుల అరెస్టు

విశాలాంధ్ర ఖమ్మం క్రైమ్ : ఖమ్మం నగరంలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. మంగళవారం నగరంలోని రాపర్తి నగర్ లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు ముగ్గురు యువకులు ఒక మోటార్ సైకిల్ పై వస్తూ పోలీసుల చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ ముగ్గురు కలసి గత కొంతకాలంగా చెడు వ్యసనాలకు బానిసలై చదువు మానేసి స్నేహితుల వెంట తిరుగుతూ మోటార్ సైకిల్ దొంగతనాలు చేస్తున్నారని తెలిపారు.రెండు నెలల్లో ఖమ్మం రెండవ పట్టణ, ఖానాపూర్ హవేలీ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం ఐదు మోటర్ సైకిల్ దొంగతనాలు చేశారని తెలిపారు. ఈ ముగ్గురు యువకులు మైనర్లని పేర్కొన్నారు. వారి నుండి ఏడు లక్షల విలువచేసే ఐదు మోటర్ సైకిల్లు రికవరీ చేసి న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినట్లు ఇన్స్పెక్టర్ వివరించారు.

సామినేని హంతకులను అరెస్టు చేయండి

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు, చింతకాని మండలం పాతర్లపాడు మాజీ సర్పంచ్ సామినేని రామారావు హత్యా నేరస్తులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ వద్ద మంగళవారం చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు, నిరసనకారుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో పలువురు సొమ్మసిల్లి పడిపోయారు. మూడుగంటలకు పైగా ఈ ధర్నా ఏకబిగిన సాగింది. ఈ ధర్నాకు బీఆర్ఎస్, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలు సైతం మద్దతు ప్రకటించాయి. హత్య జరిగి 26 రోజులవుతున్నా , హంతకులను పట్టుకోవటంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వివిధ గ్రామాల నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నాకు తరలివచ్చారు. రామారావు స్వగ్రామం పాతర్లపాడు నుంచి గ్రామస్తులు భారీగా హాజరయ్యారు. హంతకులను వెంటనే అరెస్టు చేసి న్యాయం చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆయన సతీమణి నందినికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ధర్నా సందర్భంగాపోలీసులను భారీగా మోహరించారు. బారికేడ్‌లు అడ్డుగా పెట్టి కలెక్టరేట్‌లోకి ఎవరూ లేకుండా బందోబస్తు చేపట్టారు. కలెక్టర్‌కు తమ సమస్య వివరించాలని అఖిలపక్ష నేతలు కదిలిన సమయంలో పోలీసులు ఒక్కసారిగా హడావుడి మొదలుపెట్టారు. దాంతో నిరసన కారుల్లో ఆందోళన మొదల్కె అడ్డుగా ఉన్న బారికేడ్‌లు, పోలీసు వలయాన్ని ఛేదించుకుని కలెక్టరేట్ గేట్ల వరకూ వెళ్లారు. అధికారపార్టీకి పోలీసుల గులాంగిరీ చేస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు.తమ పార్టీ నాయకుడిని హత్య చేస్తే నాయకులు అడక్కపోతే ఎవరడుగుతారని పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌ను ప్రశ్నించారు . పోతినేని సుదర్శన్‌రావు, మాట్లాడుతూ పోలీసు విచారణ అత్యంత హాస్యాస్పదంగా సాగుతోందని అన్నారు. సీపీఐ, బీఆర్ఎస్, న్యూడెమోక్రసీ నేతలు, మాట్లాడుతూ సామినేని రామారావుది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని, ఆరోపించారు.

ప్రజాస్వామ్యం శ్వాస తీసుకున్న రోజు డిసెంబర్ 26

విశాలాంధ్ర -కొనిజర్ల : భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో డిసెంబర్ 26 భారత ప్రజాస్వామ్యం శ్వాస తీసుకున్న రోజని,ఇది న్యాయం స్వేచ్ఛ సమానత్వం సోదర భావం అనే 4 అక్షరాల మహాగ్రంథం పుట్టిన రోజు అని ప్రభుత్వ ప్రశంస పత్ర అవార్డు గ్రహీత,ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి తెలగమల్ల గోవింద్ అన్నారు. మంగళవారం ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ భారతదేశం తన ఆత్మను పొందిన భారత రాజ్యాంగం అమలైన రోజని ప్రజలే పరమాధికారులన్న నిజం శాసన రూపం దాల్చిందని వారు తెలియజేశారు.1949 డిసెంబర్ 26న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహనీయుని యొక్క నాయకత్వంలో రాజ్యాంగ సభ రెండు సంవత్సరాల 11 నెలల 17 రోజులు శ్రమించి రసించి ప్రపంచంలోనే అత్యంత ఆధునికమైన అత్యంత మానవతావాద రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించారని చెప్పారు. వివక్ష, అసమానత , అన్యాయం మీద శాశ్వత యుద్ధం ప్రకటించి పూలే అంబేద్కర్ కలలో ఉన్న సమాజం రూపకల్పనకు రాజ్యాంగం పునాదులు వేసిందన్నారు. ఈ రాజ్యాంగంలోనే భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ తత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందని గోవిందు కొనియాడారు..అన్యాయంపై మౌనం అంటే రాజ్యాంగాన్ని బలహీనపరచడమేనని రాజ్యాంగం మనకు ఇచ్చిన బాధ్యత సమానత్వం కోసం నిలబడటం మానవత్వం కోసం మాట్లాడటం, అన్నారు. రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా గోవింద్ తమ శుభాకాంక్షలు తెలియజేసి తన భావాన్ని వ్యక్తపరిచారు.

అభ్యుదయ రచనలకు ఆహ్వానం

విశాలాంధ్ర ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని సిపిఐ ఖమ్మం జిల్లా సమితి ఒక ప్రత్యేక సావనీరన్ను విడుదల చేయనుంది. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమం, ఉమ్మడి ఖమ్మం పోరాటాలు, గ్రామీణ నేపథ్యం, కళలు, సంస్కృతి, సాంప్రదాయాలకు సంబంధించి అభ్యుదయ విప్లవ కవితలను, పాటలను ఆహ్వానిస్తున్నది. డిసెంబర్ మొదటి వారంలో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రపై కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఆసక్తి గల వారు వివరాలకు ప్రముఖ కవి లెనిన్ శ్రీనివాస్‌ను సంప్రదించగలరు. 9959852154కు పంపవచ్చునని కన్వీనింగ్ కమిటీ బాధ్యులు లెనిన్ శ్రీనివాస్, రౌతు రవి, కొంపల్లి రామయ్య, గోపిశెట్టి వెంకటేశ్వరరావు లు తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని ధర్నా

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడులను అమలను అమలుచేయడాన్ని నిరసిస్తూ,కోడ్ లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ అన్ని గనులు,డిపార్టుమెంటుల్లో ఏఐటీయుసి,ఐఎన్టీయుసి, టీబీజీకేఎస్, సిఐటీయు కార్మిక సంఘాల జేఏసి ఆధ్వర్యంలో ధర్నాలు చేసి యాజమాన్యానికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా గనులపై జరిగిన సభల్లో వివిధ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం తక్షణమే కోడ్ లను రద్దు చేయాలని లేకుంటే దేశ వ్యాప్తంగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా నగర ఏఐటీయుసి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులతో పాటు ఏఐటియుసి నాయకులు ఎంఎ గౌస్,రంగుశ్రీనివాస్,మాదన మహేష్, బోగ సతీష్ బాబు,మానాల శ్రీనివాస్,పొన్నాల వెంకటయ్య,కారంపూరి వెంకన్న,అజీం పాషా, గుర్రం ప్రభుదాస్,నాయిని శంకర్,గొడిశల నరేశ్, చెప్యాల భాస్కర్,పొన్నం రంజిత్,దొంత సాయన్న,బండి మల్లేష్,దాసరి శ్రీనివాస్, అటికేటి రాజు,ఏవిఎస్ ప్రకాశ్,ఇజ్జగిరి రాజు దాసరి అనిల్,వేముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ చీరల పంపిణీ

విశాలాంధ్ర,కొమరం భీమ్ : జిల్లాలోని ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని వద్దేపల్లి గార్డెన్‌లో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి దత్తరావు అధ్యక్షతన నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మహిళకు చీర అందించే లక్ష్యంతో లక్ష 11 వేల చీరలు పంపిణీకి సిద్ధమైనట్లు . రెండు రోజుల్లో చీరల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మహిళా శక్తి ఎంతో గొప్పదని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక ఎదుగుదల కోసం పెట్రోల్ బంకు, ఆర్టీసీ బస్సు, క్యాంటీన్లు, సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటు, వడ్డీ లేని రుణాలు లాంటి పథకాలను అమలు చేస్తుందన్నారు మూడు విడతల్లో ఆరు కోట్ల రూపాయలు వడ్డీ లేని బ్యాంకు రుణాలు మంజూరు చేయగా, మూడో విడతలో రెండు కోట్ల 70 లక్షల రూపాయలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సమైక్య భవనం కూడా నిర్మాణ దశలో ఉందని త్వరలోనే పూర్తయి అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హెడ్ కానిస్టేబుళ్లుగా 19 మందికి పదోన్నతులు

విశాలాంధ్ర ఖమ్మం క్రైమ్ : పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో బాధ్యతలు నిర్వహిస్తూ హెడ్ కానిస్టేబుల్ గా ఉద్యోగన్నతి పొందిన 19 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి అభినందించారు. ఖమ్మం జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న 19 మంది పోలీసు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కలిపించారు. అందులో నలుగురు మహబూబాబాద్ జిల్లా,14 మంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు, ఒకరిని ఇతర విభాగానికి కేటాయిస్తు బదిలీ చేశారు.

గీతన్నల రణభేరి విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-మరిపెడ: కల్లుగీత కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా 28న సూర్యాపేటలో నిర్వహిస్తున్న భారీ ప్రదర్శన,బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుండి గీత కార్మికులు వేలాదిగా తరలిరావాలని కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు, కార్యదర్శి ఈరగాని శ్రీనివాస్, మొగుళ్ల యాకన్న పిలుపునిచ్చారు.మంగళవారం మరిపెడ మండలంలోని గుండెపుడి, తాళ్ల ఊకల్, రాంపురం, చిల్లంచర్ల,యల్లంపేట, ఎడ్జెర్ల పురుషోత్తమాయగూడెం, మరిపెడ, ఉల్లేపల్లి, గాలివారిగూడం, అబ్బాయిపాలెం గ్రామాల్లోబహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ సభ అనంతరం 29,30 తేదీలలో జరిగే ప్రతినిధుల మహాసభలో రాష్ట్రంలోని గీత కార్మికుల సమస్యలు చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.కేంద్ర బిజెపి ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమానికి ఒక్క పథకం కూడా పెట్టలేదన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని, అధికారులకు, మంత్రులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ 4 వేలకు, ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచాలని, ప్రమాద నివారణకు వృత్తి చేసే వారందరికీ జాప్యం లేకుండా కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని, ప్రమాదానికి గురైన గీత కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని, నీరా మరియు తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బోడపట్ల రాజశేఖర్, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు టీషర్ట్స్, టై బెల్టులు

విశాలాంధ్ర గూడూరు: గూడూరు మండలం లక్ష్మీపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నాడు టీ షర్ట్, టైబెల్టులను తాళ్లపాటి గ్రామానికి చెందిన ధరావత్ శ్రీనివాస్ అందజేశాడు.పాఠశాల అభివృద్ధి కోసం విద్యార్థులకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి.షాహిన్ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్యను అందిస్తుండడం విద్యార్థుల పట్ల శ్రద్ధ వహిస్తూ వారి ప్రగతికి బాటలు వేస్తున్నారని ముందుకు వచ్చి టీషర్ట్స్ టై బెల్టులను అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. ధరావత్ శ్రీనివాస్‌కు ప్రధానోపాధ్యాయులు షాహిన్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎండి.షాహిన్, ఉపాధ్యాయులు నిఖిల్ ఉమా మహేశ్వరి యశ్వంత్, సి ఆర్ పి నరేష్, గ్రామ పెద్దలు నవీన్ రమేష్ జగపతి అనిల్ లక్ష్మణులు ఉన్నారు.

దీక్షా దివస్ విజయవంతం చేయండి

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: ఈ నెల 29న దీక్ష దివస్‌ను విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మాదేవేందర్ రెడ్డి పార్టీ శ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, నియోజవర్గ ఇంచార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ళ మల్లికార్జున్ గౌడ్, ఏఎంసి మాజీ చైర్మన్ కృష్ణ రెడ్డి, జిల్లా ముఖ్య నేతలతో సన్నాహక సమావేశ నిర్వహించారు. దీక్ష దివస్ రోజు నిర్వహించే కార్యక్రమాల గురించి నాయకులతో చర్చించారు. తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే రోజు నవంబర్ 29 అన్నారు. మెదక్ పిఏసిఎస్ చైర్మన్ రెడ్డి, పట్టణ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, మెదక్, హవేలీఘనపూర్, శంకరంపేట(ఆర్) పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షులు యం. అంజగౌడ్, సిహెచ్.శ్రీనివాస్ రెడ్డి పట్లోరి. రాజు, గంగుల విష్ణువర్ధన్ రెడ్డి, పట్టణ పార్టీ కో కన్వీనర్లు లింగారెడ్డి, జుబేర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్లు విశ్వం, భీమరి. కిషోర్,ఆర్కే శ్రీనివాస్, మాయ.మల్లేశం,నార్సింగ్ మాజీ వైస్ ఎంపీపీ. సుజాత శంకర్,జిల్లాలోని వివిధ మండలాల నాయకులు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు ఎంపీటీసీలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. బీసీలకు 42% శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని బీసీలకు వివరించాలని పార్టీ శ్రేణులకు మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి సూచించారు. ఈ రిజర్వేషన్ ప్రక్రియలో 20 శాతం కూడా సరైన పద్ధతిలో జరగలేదన్నారు. కామారెడ్డి డిక్లేషన్ మీటింగ్లో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు రిజర్వేషన్ ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇబ్బంది చేసి తీవ్రమైన అన్యాయం చేసిందని ఆరోపించారు.

జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ డి సునీత

విశాలాంధ్ర-వనపర్తి : వనపర్తి జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డి సునీత ఐపీఎస్, మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలెక్టర్ ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతన ఎస్పీకి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరువురు జిల్లాలో శాంతి భద్రతలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు పాత్ర కీలకమని అన్నారు

నేటి నుంచి జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన : డిఈఓ

విశాలాంధ్ర - కొత్తగూడెం : విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఈనెల 26 27 తేదీల్లో కొత్తగూడెంలోని సెయింట్ మేరీ పాఠశాలలో జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనశాల ఏర్పాటు చేస్తున్నట్లు డీఈవో నాగలక్ష్మి వెల్లడించారు. తొలి రోజు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తారని తెలిపారు. మంగళవారం ఆమె ఆ పాఠశాలలో ఏర్పాటులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కమిటీల బాధ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థుల్లో నిక్షిప్తంగా ఉన్న వైవిధ్య పరిజ్ఞానాన్ని వెలికి తీసేందుకు ఈ సైన్స్ ఫెయిర్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. గత సైన్స్ ఫెయిర్లలో జరిగిన కొన్ని తప్పిదాలను దృష్టిలో ఉంచుకొని పటిష్టమైన ఏర్పాటును చేస్తున్నామన్నారు. ముఖ్యంగా భోజనాలు, మంచి నీటి సౌకర్యం తోపాటు దూర ప్రాంతాల నుండి హాజరయ్యే విద్యార్థులకు 26న బుధవారం రాత్రి బస చేసేందుకు వసతి, వారు రూపొందించిన పరికరాలను భద్రం చేస్తూ న్యాయ నిర్ణేతలు ఖచ్చితంగా అనుసరించాల్సిన విధి విధానాలపై పలు సూచనలు చేసారు. కమిటీల బాధ్యులందరూ సమిష్టి కృషితో ఈ వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే కూనంనేని అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమం లో విశిష్ట అతిథులు గా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలతో పాటు మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, జిల్లా లోని పార్లమెంట్ సభ్యులు రఘురామ్ రెడ్డి, శాసనసభ్యులు, జిల్లా అధికారులు హాజరౌతారని నాగలక్ష్మి తెలిపారు.జిల్లా సైన్స్ అధికారి సంపత్ కుమార్, డి సి ఈ బి కార్యదర్శి నీరజ, మానిటరింగ్ అధికారులు నాగరాజ శేఖర్, సతీష్, సైదులు, ఎమ్ఈ ఓ లు మధురవాణి, బాలాజీ, ఝాంకి లాల్, పాఠశాల హెచ్ఎమ్ లు సిస్టర్ రూబీ, సంజీవరావు, సత్యనారాయణ, సత్యనారాయణ రెడ్డి, మీడియా ఇంచార్జి షేక్. దస్తగిరి, జహంగీర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

రామాలయంపై కాషాయ జెండా

అయోధ్యలో రామ మందిరాన్ని ప్రధాన మంత్రి మోదీ 2024 జనవరి 22 న ప్రారంభించారు. బాల రాముడికి ప్రాణ ప్రతిష్ఠ, సంప్రోక్షణ కూడా చేశారు. ఇలాంటి కార్యక్రమాలను పక్కన భార్య లేకుండా నిర్వహించడం సంప్రాదాయం కాదని అప్పుడే విమర్శలు ఎదురైనా మోదీ ఏ మాత్రం ఖాతరు చేయలేదు. మళ్లీ మంగళవారం మోదీ అయోధ్యలో నిర్మించిన రామ మందిరంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. 2024 లో రామ మందిరాన్ని ప్రారంభించినప్పుడు దాదాపు ఏడు వేల మంది ఆహ్వానితులు హాజరయ్యారు. అందులో బాలీవుడ్ నటులు, ప్రముఖులు, ప్రసిద్ధ క్రీడాకారులు, బడా వ్యాపారవేత్తలు, ఆధ్యాత్మిక ప్రముఖులు పాల్గొన్నారు. తమను ఆహ్వానించలేదని అలిగిన వారూ ఉన్నారు. ఆహ్వానించినా రామ మందిర ప్రారంభోత్సవానికి వెళ్లని ప్రముఖుల జాబితా కూడా పెద్దదే. అందులో రాహుల్‌గాంధీ కూడా ఉన్నారు. అయితే గుర్తు పెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే 2024 లో రామ మందిరం ప్రారంభోత్సవం సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగింది. అప్పుడు ఏడు వేల మంది అతిథులు హాజరైనప్పటికీ ప్రాణ ప్రతిష్ఠ కోసం కలశం పట్టుకుని మోదీ ఆలయంలో ఒక్కరే నడుచుకుంటూ వెళ్లిన వాస్తవం కూడా ఇప్పటికీ కళ్ల ముందు ఆడుతోంది. గర్భాలయంలో పూజాదికాలు చేసినప్పుడు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీఆదిత్యనాథ్, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్‌కు రెండవ ప్రాధాన్యత మాత్రమే లభించింది. ప్రారంభోత్సవ వేడుక మర్నాడు దాదాపు మూడు లక్షల మంది భక్తులు కొత్తగా నిర్మించిన ఆలయంలో బాల రాముడిని దర్శించారట. మోదీ ఆలయాన్ని ప్రారంభించిన సందర్భంలో ప్రచారం ఉధృతంగా జరిగింది. అప్పుడు రామాలయంలో ప్రతిష్ఠించింది అయిదేళ్ల బాల రాముడి విగ్రహం. మోదీ బాల రాముడిని వేలుపట్టి నడిపించుకున్న చిత్రాలు కూడా ఆ సమయంలో బాగా ప్రచారంలోకి వచ్చాయి. ఇప్పుడు మంగళవారం ధ్వజారోహణంతో రామ మందిర నిర్మాణం సంపూర్ణమైంది అని మోదీ ప్రకటించారు. రామాలయంపై మోదీ ఆవిష్కరించింది కాషాయ జెండా. ధ్వజారోహణ కార్యక్రమం జరిగినప్పుడు కూడా ఉత్తరప్రదేశ్ ముఖ్య మంత్రి యోగీఆదిత్యనాథ్, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భవత్ ఉన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కనక యోగీఆదిత్యనాథ్‌ను ఆహ్వానించడం అధికార ప్రమాణాలకు అనువైంది కావొచ్చు. కానీ 2024 లో, ఇప్పుడూ మోహన్ భగవత్‌ను ఏ లెక్కన ఆహ్వానించారో తెలియదు. బహుశ రామాలయ నిర్మాణం ఆర్‌ఎస్‌ఎస్ గుత్తకు తీసుకుందేమో! అయోధ్యలో రామమందిర నిర్మాణ ఉద్యమం సాగినప్పుడు కీలక పాత్ర పోషించిన విశ్వహిందూ పరిషత్ నాయకులు అప్పుడూ, ఇప్పుడూ కూడా కనిపించలేదు. ఈ పతాకం చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్న స్ఫూర్తి కలిగిస్తుందని మోదీ చెప్పారు. ప్రాణం పోయినా సరే మాట నిలబెట్టుకోవాలని కూడా మోదీ అన్నారు. ఏ వాగ్దానమైతే ఇచ్చామో అది నిలబెట్టుకోవాలి అని ఆయన ఉద్బోధించారు. మంగళవారం ఆవిష్కరించిన పతాకం బ్రహ్మ స్వరూపం అంటున్నారు. ఇది సత్యం, ధర్మం విజయానికి చిహ్నమని మోదీ తెలియజేశారు. "ఇవాళ జగమంతా రామ మయమే" అని కూడా మోదీ ప్రకటించారు. ప్రతి రామ భక్తుడి హృదయంలో ఇవ్వాళ సంతృప్తి ఉంది. విపరీతమైన కృతజ్ఞతా భావం ఉంది. మాటలకందని అలౌకిక ఆనందం ఉంది. శతాబ్దాల నాటి గాయాలు ఇప్పుడు మానుతున్నాయి" అని మోదీ ఆనందాతిరేకంతో ప్రకటించారు. మంగళవారం ధ్వజారోహణ సందర్భంగా మోదీ ప్రసంగం అంతా ఉద్వేగ భరితంగా సాగింది. విలువలు, సంస్కృతి ఒక మనిషి జీవితాన్ని ఎలా తీర్చు దిద్దుతాయో రాముడి జీవితం తెలియజేస్తుందని కూడా మోదీ చెప్పారు. రాముడు అయోధ్య వదిలి వెళ్లినప్పుడు యువరాజే. కానీ వనవాసం పూర్తి అయిన తరవాత తిరిగివచ్చిన రాముడు మర్యాదా పురుషోత్తముడు అని కూడా ప్రధాని అన్నారు.

ఇది అయిదు వందల ఏళ్ల నాడు ప్రారంభమైన యజ్ఞానికి పూర్ణాహుతి అని మోదీ చెప్పడమే కాదు, కోట్లాది మంది రామ భక్తులకు ఈ భావన ఉండొచ్చు. దాదాపు రెండేళ్ల కింద రామ మందిరాన్ని ప్రారంభించినప్పుడు కనిపించిన జన సందోహం మంగళవారం ధ్వజారోహణ సందర్భంగా మాయమైంది. రెండేళ్ల కిందట కూడా అభ్యంతరాలు వ్యక్తం చేసిన వారిలో చాలా మంది మఠాధిపతులు ఉన్నారు. మోదీకి గురువైన రామభద్రాచార్య ధ్వజారోహణ సందర్భంగా కూడా పెదవి విరిచారు. తనను ఆహ్వానించలేదని కూడా ఆయన అంటున్నారు. 1984 నుంచి రామ మందిర ఉద్యమంతో తనకు సంబంధం ఉన్నా ఆహ్వానం అందనే లేదన్నది జగద్గురు రామభద్రాచార్య బాధ. అయోధ్య వివాదం సుప్రీంకోర్టుకు ఎక్కినప్పుడు రామభద్రాచార్య సాక్ష్యం కూడా చెప్పారు. జ్యోతిర్మఠ్ పీఠాధిపతి అయిన శంకరాచార్య స్వామీ అవిముక్తేశ్వరానంద అయితే ధ్వజారోహణను బాహాటంగానే దుయ్యబట్టారు. ఈ కార్యక్రమం ఏ మాత్రం శాస్త్రోక్తంగా జరగలేదని ఆయన అంటున్నారు. శిఖర ప్రతిష్ఠ ఉంటుంది తప్ప ధ్వజారోహణ ఎక్కడిది అని శంకరాచార్య ప్రశ్నిస్తున్నారు. ఆలయాల్లో ధ్వజాలను మార్చడం మాత్రమే ఉంటుంది కానీ ధ్వజారోహణం ఉండదని ఆయన చెప్తున్నారు. కొన్ని ఆలయాల్లో ఈ ధ్వజాన్ని రోజూ మారుస్తారు. కొన్ని చోట్ల రోజుకు నాలుగుసార్లు కూడా మారుస్తారు. కానీ ధ్వజారోహణ సంప్రదాయం ఎక్కడిది అని అవిముక్తేశ్వరానంద ప్రశ్నిస్తున్నారు. ఆలయ నిర్మాణం పూర్తి కాకుండానే 2024 లో ఆలయాన్ని ప్రారంభించడాన్ని కూడా ఆయన అభ్యంతర పెట్టారు. 2024 లో మరి కొంతమంది శంకరాచార్యులు కూడా రామ మందిరాన్ని ప్రారంభించడాన్ని ఆమోదించలేదు. సనాతన ధర్మాన్ని పాటిస్తామని చెప్పుకునే వారు బాహాటంగా ఆ ధర్మాన్ని ఉల్లంఘిస్తున్నారన్నది కొందరు శంకరాచార్యుల విమర్శ. మఠాధిపతులు, పీఠాధిపతులు ఎన్ని అభ్యంతరాలు లేవదీసినా తనది కేవలం మానవ జన్మ కాదని, తాను అవతార పురుషుడిని అని స్వయంగా మోదీ చెప్పుకుంటున్నప్పుడు ఈ అభ్యంతరాలను లక్ష్యపెట్టేదెవరు? ఆలయాల్లో పతాకాన్ని ఉంచుతారు తప్ప ధ్వజారోహణ ఉండదు అన్నది శాస్త్ర రీత్యా నిజమే అయినా భగవద్స్వరూపుడు ఈ మాటలను పాటించవలసిన అవసరం ఉంటుందా అనేది అసలు ప్రశ్న. ఆలయాల మీద ఉండే జెండాను అవనతం చేయడం కూడా ఉండదు కనక ఆరోహణ ప్రశ్నే తలెత్తదు. రెండేళ్ల కింద ఆలయం ప్రారంభించినప్పటికి అప్పుడు గుర్తురాని ధ్వజారోహణం ఇప్పుడే గుర్తు వచ్చిందంటే దీనివల్ల మోదీ స్పష్టమైన రాజకీయ ప్రయోజనాలు ఆశిస్తున్నారన్నది నిజం. అసలు అయోధ్య ఉద్యమం మొత్తం రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే సాగింది. అద్వాణీ రథ యాత్రల దాకా, మోదీ ప్రాణ ప్రతిష్ఠ, ధ్వజారోహణ కార్యక్రమాల దాకా అంతా ఇదే తంతు. రాజకీయాలు మతంతో మిళితమైంది మాయమయ్యేది మత విధులు నియమాలేగా!

ఆర్‌టీఐకి దెబ్బ!

విషయం ఆసక్తికరంగా కన్పించకపోవచ్చు. కానీ ప్రతి ఒక్కరిపై తీవ్ర ప్రభావాన్ని చూపే అతి ప్రమాదకరమైన పరిణామం దేశంలో రాబోతున్నది. భారత సుప్రీంకోర్టు గోప్యతను ప్రాథమిక హక్కుగా పరిగణించి ఎనిమిది సంవత్సరాలకు పైగా గడిచింది. అయితే ఈ ఎనిమిదేళ్లలో మోదీ ప్రభుత్వం మౌనంగా ఉండకుండా, డేటా రక్షణ చట్టం కోసం మూడు వేర్వేరు ముసాయిదాలను సిద్ధం చేసింది. ఏదోఒక సమయంలో ఈ బిల్లు చట్టరూపాన్ని సంతరించుకోవచ్చు. కాకపోతే, దీనిపై పూర్తి అవగాహన కలిగి ఉన్న ప్రతిపక్షాలు కచ్చితంగా దీన్ని వ్యతిరేకిస్తాయి. ఎన్డీయే కూటమిలోని భాగస్వామ్య పార్టీలు వాటివాటి స్వప్రయోజనాలు సహజంగానే ఉంటాయి కాబట్టి అవి ఈ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇవ్వవచ్చు. అదే జరిగితే, ఈ చట్టం వల్ల కలిగే లాభాల కన్నా నష్టాలే ఎక్కువన్న విషయాన్ని బలంగా చెప్పాల్సిన తరుణం ఆసన్నమైంది. ఇప్పటికే మనకు అవసరమైన సమాచారాన్ని తీసుకునే సమాచార హక్కు చట్టాన్ని ఈ డేటా రక్షణ చట్టం పూర్తిగా నిర్వీర్యం చేస్తోంది. అంటే ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న ఓ హక్కును ప్రభుత్వం లాగేసుకుంటున్నదని స్పష్టమవుతోంది.

నిజానికి, డేటా రక్షణ చట్టం తుది రూపురేఖలు ఎలా రూపుదిద్దుకున్నాయో ఇప్పటివరకు స్పష్టంగా తెలియదు. 2018 నాటి ముసాయిదా బిల్లును విపరీతంగా సరళీకరించి, 2023 చట్టంగా మార్చారు. వినియోగదారుల డేటాకు కల్పించాల్సిన కొన్ని ముఖ్యమైన రక్షణలనే కేంద్ర ప్రభుత్వం చట్టంగా రూపొందించింది. కానీ ఇది ప్రభుత్వ సంస్థలకు భారతీయుల డేటాను నిర్వహించడానికి విస్తృత స్థానాన్ని ఇవ్వడం, అత్యంత బలహీనమైన డేటా

ప్రొటెక్షన్ బోర్డ్ ఆఫ్ ఇండియా (డీపీబీఐ) ను అమలు చేయడం, సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టం-2005 ను క్రూరంగా సవరించడం ద్వారా గత రెండు దశాబ్దాలుగా సాధించిన పారదర్శకతలో ప్రధాన పురోగతిని వెనక్కి నెట్టింది. 2025 నవంబర్ 14 న డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ రూల్స్-2025 ను సర్కారు నోటిఫై చేసింది. మాతృ చట్టంలో గుర్తించిన, స్పష్టమైన అంతరాలను, నష్టాన్ని సరిచేసి ఉంటారని మొదట్లో భావించారు. కానీ అదేమీ జరగకపోగా, కొత్తగా చేర్చిన నిబంధనలు పౌరుల హక్కులను మరింత కాలరాసేలా ఉన్నాయని హక్కుల కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి, ఏదైనా వ్యక్తిగత సమాచారాన్ని తిరస్కరించడానికి ప్రజా సమాచార అధికారులకు ఇప్పుడు అధికారం ఉంటుంది. అంటే జవాబుదారీతనం కోరుకునే పౌరులకు అధికారం చాలా తక్కువ. ఇప్పటికే ముసాయిదా నియమాల పేరిట ప్రభుత్వం మూడు నెలల సంప్రదింపుల వ్యవధిని ఆలస్యం చేయగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజున అదే వేడిలో తుది ఫారమ్‌ను ప్రారంభించడం అనుమానాలకు తావిస్తోంది. బీహార్ ఫలితాలతో తమకు తిరుగులేదన్న భావనలో మోదీ ప్రభుత్వం ఉండవచ్చు. అందుకే నాలుగు కార్మిక స్మృతులను సైతం అదును చూసి అమల్లోకి తెచ్చేసింది. డేటా రక్షణ చట్టాన్ని తీసుకురావాలని అనుకున్నప్పుడు, ప్రస్తుత దశకు చేరుకునే క్రమంలో ఎందుకింత జాప్యం చేసినట్లు? పైగా మూడు ముసాయిదాలను ఎందుకు మార్చినట్లు? ఇవన్నీ సమాధానాలు లేని ప్రశ్నలే. ఈ ఫ్రేమ్‌వర్క్ గురించి టెక్నాలజీ పరిశ్రమలోని దిగ్గజాలకు ముందుగానే తెలుసు. ఈ సందేహాలకు ఆధారమైన సంస్థాగత చట్రంలో స్వేచ్ఛ లేకపోవడం ముఖ్యంగా ఆందోళనకరం. ఉదాహరణ ఏమిటంటే, డీపీబీఐ అనేది ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తుంది. అయితే, ప్రపంచంలోని ప్రధాన డేటా మోసగాళ్లతోపాటు భారతదేశంలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రయత్నిస్తున్న గూగుల్, అమెజాన్, మెటా వంటి సంస్థలు ఈ ప్రభుత్వ సంస్థపై పెత్తనం చేయకుండా ఉంటాయా? భారతీయుల డేటాను భవిష్యత్తులో దుర్వినియోగం చేయకుండా పరిశీలించాల్సిన ఈ సంస్థ (డీపీబీఐ) ను గూగుల్ వంటి సంస్థలు పర్యవేక్షించే పరిస్థితి ఉంటే ఇక పౌరుల హక్కులకు హామీ ఏముంటుంది? ప్రస్తుతం భారతీయుల డేటాను నిర్వహించే సంస్థలు కొత్త నిబంధనలతో కలత చెందడానికి కారణం అదే.

భారత ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం-2023 (డీపీడీబీ) అనేది ఇంటర్నెట్ వినియోగదారుల సమాచారానికి రక్షణ కల్పించడంలో ఒక కీలకమైన ముందడుగుగా ప్రభుత్వం చెపుతోంది. నిజానికి కొన్ని లాభాలూ లేకపోలేదు. ఏ కంపెనీ అయినా వినియోగదారుల డేటాను సేకరించాలంటే ముందుగా వారి అనుమతి స్పష్టంగా తీసుకోవాలి. వారు ఆ డేటాను ఎందుకు తీసుకుంటున్నారో చెప్పాలి. తప్పుడు సమాచారం ఉంటే దాన్ని సరిచేయమని కోరవచ్చు. ఒకసారి పని పూర్తయిన తర్వాత, డేటాను వారి సర్వర్ల నుంచి తొలగించమని అడిగే హక్కు వినియోగదారులకు ఉంటుంది. కంపెనీలు వినియోగదారుల డేటాను కాపాడటంలో విఫలమైనా, డేటా లీక్ చేసినా, ఆ కంపెనీలకు రూ.250 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. ఇది కంపెనీలను మరింత బాధ్యతగా ఉండేలా చేస్తుంది. పిల్లల డేటాను సేకరించేటప్పుడు కంపెనీలు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. తల్లిదండ్రుల అనుమతి లేకుండా పిల్లల డేటాను వాడకూడదు. డేటా విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి 'డేటా ప్రొటెక్షన్ బోర్డ్' (డీపీబీఐ) ఏర్పాటవుతుంది. నష్టాల విషయానికొస్తే, ప్రభుత్వానికి విస్తృత మినహాయింపులివ్వడం ఆందోళనకరం. దేశ రక్షణ, శాంతి భద్రతల పేరుతో ప్రభుత్వం లేదా ప్రభుత్వ సంస్థలు ఈ చట్టం పరిధిలోకి రాకుండా మినహాయింపు పొందవచ్చు. దీనివల్ల పౌరులపై నిఘా పెరిగే ప్రమాదం ఉంది. ఈ కొత్త చట్టం ప్రకారం, అధికారుల వ్యక్తిగత సమాచారం పేరుతో ఆర్టీఐ కింద అడిగే వివరాలను తిరస్కరించే అవకాశం ఉంది. ఇది పారదర్శకతను దెబ్బతీస్తుంది. అంటే సమాచార హక్కు దాదాపు దూరమవుతుంది. బోర్డు స్వయం ప్రతిపత్తిపైనా అనుమానాలే. ఫిర్యాదులను స్వీకరించే 'డేటా ప్రొటెక్షన్ బోర్డ్' సభ్యులను ప్రభుత్వమే నియమిస్తుంది. దీనివల్ల ఆ బోర్డు ప్రభుత్వంపై వచ్చే ఫిర్యాదుల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించగలదా? బాధితులకు పరిహారమూ ఉండదు. అంటే, డేటా లీక్ అయినప్పుడు కంపెనీ కట్టే జరిమానా ప్రభుత్వ ఖజానాకు వెళ్తుందే తప్ప డేటా నష్టపోయిన బాధితుడికి ఎటువంటి పరిహారం అందదు. పరోక్ష అనుమతి మరింత ప్రమాదకరం. కొన్ని సందర్భాల్లో (ఉదాహరణకు ప్రభుత్వ సేవలు పొందడానికి లేదా అత్యవసర సమయాల్లో) వినియోగదారులు ప్రత్యేకంగా అనుమతి ఇవ్వకపోయినా, ఇచ్చినట్లుగానే భావించి డేటాను వాడుకోవచ్చు. డిజిటల్ యుగంలో వినియోగదారుల గోప్యతను కాపాడే ఒక బలమైన చట్రంగా దీన్ని భావిస్తున్నా, విస్తృతార్థంలో ఇది ఆందోళన కలిగిస్తున్నందున, ఇది పౌరుల హక్కులకు నష్టదాయకమే.

ఉద్యోగ భద్రతలేని లేబర్ కోడ్‌లు

చలసాని వెంకట రామారావు

2025 నవంబరు 21 వ తేదీ నుంచి నాలుగు కార్మిక స్మృతు (కోడ్)లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయించింది. ఈ నిర్ణయం సంఘటిత, అసంఘటిత రంగంలోని కోట్లాది మంది కార్మికులకు అశనిపాతం లాంటిది. ఈ నాలుగు లేబరు కోడ్‌లు ఆచరణలో కార్మికుల చేతులకు సంకెళ్లు కానున్నాయి. భారతదేశ కార్మిక వర్గం నూరేళ్లకుపైగా బ్రిటీష్ సామ్రాజ్యవాదులతో, విదేశీ, దేశీయ పెట్టుబడిదారులతో పోరాడి అనేక కార్మిక చట్టాలను సాధించుకున్నది. అసమానమైన త్యాగాలు చేసిన కార్మికులు ఎన్నో నిర్బంధాలను, పోలీసు కాల్పులను, జైలు జీవితాలను అనుభవించారు. అండమాన్ జైలులో దీర్ఘకాలిక కఠినమైన ప్రవాస శిక్షలను, మీరట్ కుట్ర కేసు వంటి కుట్ర కేసులను ఎదుర్కొన్నారు. ఎందరో కార్మిక నాయకులు, కార్యకర్తలు తుపాకీ గుళ్లకు బలయ్యారు. కార్మికుల త్యాగాల ఫలితంగా సుమారు 100 వరకు కార్మిక చట్టాలు వచ్చాయి. అందులో 44 కార్మిక చట్టాలు నేటికి ఆచరణ యోగ్యతను కలిగి ఉన్నాయి. ఈ కార్మిక కోడ్‌ల నిర్ణయం వలన ఎంతో విలువైన 29 కార్మిక చట్టాలు రద్దు కానున్నాయి. కేవలం ఆశ్రిత పెట్టుబడిదారులకు కార్మికుల శ్రమశక్తిని, దేశ సంపదను దోచిపెట్టే లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ కార్మిక స్మృతులను ముందుకు తెచ్చింది. 2019 లో వేతనాల కోడ్‌కు పార్లమెంటు ఆమోదం తెలిపింది. 2020లో కోవిడ్ విషమ పరిస్థితులలో ఎటువంటి చర్చ లేకుండా మిగిలిన మూడు కోడ్‌లను ఆమోదింపజేశారు. 2019-20 నుంచి భారత కార్మిక వర్గం తీవ్రంగా ఈ కోడ్‌లను ప్రతిఘటిస్తున్నది. ఐదుసార్లు దేశ వ్యాపిత కార్మిక సమ్మెలు జరిగాయి. 25 కోట్ల మంది ఉద్యోగులు, కార్మికులు ఈ సమ్మెలలో, నిరసన కార్యక్రమాలలో పాల్గొని తమ నిరసన తెలియపర్చారు. ప్రభుత్వం కార్మిక కోడ్‌లను ప్రకటించగానే దేశ వ్యాపితంగా కార్మికుల, ఉద్యోగుల నిరసన వెల్లువెత్తినది. లక్షలాది మంది కార్మికులు వీధులలోకి వచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు. 11 కేంద్ర కార్మిక సంఘాలు (బీఎంఎస్ మినహా) నవంబరు 26న దేశ వ్యాప్త సార్వత్రిక నిరసనకు పిలుపునిచ్చాయి. ఆనేక మంది ఆర్థికవేత్తలు ప్రభుత్వ ఈ చర్యను "కర్రు కాల్చి వాతలుపెట్టి, మందు రాసినట్లు"గా పేర్కొన్నారు.

ప్రభుత్వం ప్రకటించిన కార్మిక కోడ్‌లు అమలులోకి వస్తే కార్మిక జీవితాలు, జీవనోపాధి ప్రశ్నార్థకం కానున్నది. ఈ కోడ్‌లు ప్రభుత్వం ప్రకటించినంత విశాల దృక్పథంతో కన్పించటం లేదు. పైకి ఎన్నో సౌకర్యాలు కల్పించినట్లు ప్రచారం చేస్తున్నా దాని వెనుక ఎంతో విలువైన హక్కులను కార్మికులు కోల్పోతున్నారు. ఈ లేబర్ కోడ్‌లు ఎంతో దుర్మార్గంగా కార్మిక హక్కులను కొల్లగొడుతున్నాయి. కార్మిక సంఘాలతో ఎటువంటి చర్చలు జరపకుండా, వారి అభిప్రాయాలు స్వీకరించకుండా ఏకపక్షంగా, అన్యాయంగా ప్రభుత్వం వ్యవహరించింది. ఇప్పటికే గ్రాట్యూటీ, ఈపీఎఫ్, ఈఎస్ఐ చట్టాలు ఉన్నా కోట్లమంది కార్మికులకు అవి అమలు జరగటంలేదు. కోడ్‌ల అమలులో ఎటువంటి జవాబుదారీతనం కన్పించటం లేదు. కేవలం కార్పొరేట్ల ప్రయోజనాలు మాత్రమే కన్పిస్తున్నాయి. ఐటీ రంగం ఎటువంటి చట్టం అదుపులోనూ లేదు. ఇప్పటికే 12 గంటల పని విధానం కొనసాగుతున్నది. వర్క్ ఫ్రం హోం పేరుతో శ్రమశక్తి దోపిడీ సాగుతున్నది. ఇక్కడ యూనియన్లు కూడా పెట్టుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. 10 శాతం కార్మికులు లేదా 100 మంది ఉంటేనే కార్మిక సంఘం రిజిస్ట్రేషన్ జరుగుతుంది. ఇప్పటి వరకు కార్మికుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఏడుగురు సంతకం చేస్తే కార్మిక సంఘం రిజిస్ట్రేషను జరిగేది. నూరేళ్లుగా ఉన్న ఈ విధానాన్ని ఇప్పుడు రద్దు చేస్తున్నారు. పారిశ్రామిక వివాదాల చట్టం పరిధిలో కార్మికులు, యజమానుల మధ్య సమస్యల పరిష్కారం జరిగేది. ఇప్పుడు పారిశ్రామిక సంబంధాల కోడ్ వస్తుంది. దీనితో సమ్మె హక్కు, సమష్టి బేరసారాల హక్కులను కార్మికులు కోల్పోతారు. ఒకరోజు సమ్మె చేస్తే 8 రోజుల జీతం నష్టపోవలసి వస్తుంది. కార్మికులను రెచ్చగొట్టారనే సాకుతో యూనియన్ రిజిస్ట్రేషన్ రద్దు, కార్మిక సంఘాలలోని బయటి వ్యక్తులను అరెస్టులు చేయవచ్చును. సంస్థలకు, యజమానులకు సమ్మెల వలన నష్టం వచ్చిందనే సాకుతో యూనియన్లపై సివిల్ దావాలు వేయవచ్చును. ఇప్పటి వరకు ఇటువంటి అవకాశాలు లేవు. ఇప్పుడు సమ్మె చేయాలంటే 60 రోజులు ముందస్తు నోటీసు ఇవ్వాలి. ఇప్పటి వరకు ఇది 14 రోజులుగా ఉంది. 60 రోజులకు ముందు అంటే 59వ రోజు యజమానులు చర్చలకు పిలిస్తే సమ్మె చేయకూడదు. చర్చలు విఫలం అయితే సమ్మె చేయాలంటే మళ్లీ 60 రోజుల ముందస్తు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. ఇది కార్మికులలో అశాంతికి దారితీసి ఉత్పత్తికి, దేశాభివృద్ధికి దెబ్బ తగులుతుంది.

ఆరవ వేతన సంఘం కనీస వేతనం 26 వేలు ఉండాలని చెబితే కేంద్ర ప్రభుత్వం కనీస వేతనం రోజుకు 178 రూపాయలుగా నిర్ణయించింది. అంటే నెలకు 4,600 మాత్రమే కనీస వేతనంగా ప్రకటించారు. కోడ్‌ల అమలుతో కరువు భత్యం రద్దవుతుంది. గతంలో 10 వ తేదీలోపు వేతనం ఇవ్వకపోతే జైలు శిక్ష ఉండేది. ఇప్పుడు ఎటువంటి శిక్షలు లేవు. జరిమానా మాత్రం వేస్తారు. భద్రతా ప్రమాణాలకు గ్యారంటీ లేదు. కార్మిక నష్ట పరిహార చట్టం రద్దవుతుంది. యజమాని తప్పుచేస్తే విధించే జరిమానాలో కొంత భాగం మాత్రమే పరిహారంగా ఇస్తారు. ఇది చాలా తక్కువ మొత్తంగా ఉంటుంది. దీనికి తోడు కార్మిక సంక్షేమ బోర్డులు రద్దు అవుతాయి. కార్మిక సంక్షేమానికి తిలోదకాలు ఇస్తారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో కార్పొరేట్లను ప్రోత్సహిస్తారు. ఈ కోడ్‌ల వలన కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఉన్న హక్కులు పోతున్నాయి. చాలామంది కార్మికులకు సంక్షేమ చట్టాలు ఉన్నా అమలు జరగటం లేదు. సుప్రీంకోర్టు చెప్పినా యాజమాన్యాలు లక్ష్య పెట్టటంలేదు.

కనీస వేతనాలను కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. దానికి లోబడి రాష్ట్రాలు వేతనాలు నిర్ణయించాలి. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, సుప్రీం తీర్పులు, వేతన సంఘాల నిర్ణయాలు అమలుకు నోచుకోవటం లేదు. కనీస వేతనాలకు ప్రాతిపదిక ఏమిటో చెప్పలేదు. డా॥అక్రాయిడ్ ఫార్ములా ప్రశ్నార్థకమౌతుంది. భవిష్యత్తులో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల పట్ల ప్రిన్సిపల్ ఎంప్లాయిర్‌కు ఎటువంటి బాధ్యత ఉండదు. యజమానులు అప్రెంటిస్ కార్మికులను పెట్టుకోవచ్చు. వారికి జీతం కాకుండా స్టైఫండ్ ఇచ్చి పని చేయించుకోవచ్చు. ఇప్పటిలా 60, 62 ఏళ్ల వయసు వచ్చే వరకు ఉద్యోగులు ఉండవలసిన అవసరం ఇక ముందు ఉండదు. ఫిక్స్‌డ్ టైం ఎంప్లాయిమెంటు పేరుతో స్వల్పకాల ఉద్యోగాలను మాత్రమే ఇస్తారు. శాశ్వత ఉద్యోగుల స్థానంలో "తుమ్మితే ఊడే ముక్కు" లా ఉద్యోగుల పరిస్థితి మారనుంది. అసలు ఉద్యోగ భద్రత కల్పించకుండా ఒక సంవత్సరం సర్వీసుకు గ్రాట్యూటీ, ఈపీఎఫ్, ఈఎస్ఐ అంటున్నారు. అంటే భవిష్యత్తులో అన్నీ ఫిక్స్‌డ్ టైం ఉద్యోగాలు మాత్రమే ఉంటాయని చెప్పకనే చెబుతున్నారు.

భారతదేశంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలే నూటికి 70 శాతం ఉన్నాయి. గతంలో 100 మంది కార్మికులు ఉన్న సంస్థగాని, పరిశ్రమగాని మూసి వేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఇప్పుడు దానిని 300 మందికి పెంచారు. అంటే 300 మందికిపైగా కార్మికులు ఉంటేనే పరిశ్రమగా గుర్తిస్తారు. ఫ్యాక్టరీ యాక్టును వర్తింప చేస్తారు. 100 మంది కార్మికులతో యూనియన్ రిజిష్టరు చేయించినా తరువాత కార్మికుల సంఖ్య వంద కంటే తగ్గితే రిజిస్ట్రేషను రద్దు అవుతుంది. గతంలో మెజారిటీ యూనియన్‌కు గుర్తింపు ఉండేది. ఇప్పుడు 51 శాతం ఉంటేనే గుర్తింపు ఇస్తారు. ఎక్కువ యూనియన్లు పోటీలో ఉండి 51 శాతం మద్దతు రాకపోతే గుర్తింపు యూనియన్ ఉండదు. కార్మికులు తమ బేరసారాల హక్కును కోల్పోతారు. జీతం 18 వేలు దాటితే కార్మికుని గుర్తింపు పోతుంది. సూపర్‌వైజరుగా పరిగణిస్తారు. గతంలో విద్యుత్‌తో పనిచేసే 20 మంది కార్మికులు, విద్యుత్ లేకుండా 40 మంది కార్మికులు ఉంటే ఫ్యాక్టరీ కింద పరిగణించే వారు. ఇప్పుడు దానిని 50 మందికి పెంచారు. ప్లాంటేషన్, బీడీ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాలు, బోర్డులు రద్దు అవుతాయి. సామాజిక భద్రతకు తిలోదకాలు ఇవ్వనున్నారు. భవిష్యత్‌లో ఏమైనా సంక్షేమ స్కీంలు వస్తే కార్మికులకు అమలు చేస్తాం అని చెబుతున్నారు తప్ప వాటికి గ్యారంటీ లేదు. గ్రిగ్, ప్లాట్‌ఫాం కార్మికులు మిలియన్ల సంఖ్యలో ఉన్నారు. వీరికి 1 లేక 2 శాతం వెల్‌ఫేర్ ఫండ్ వసూలు చేసి సామాజిక భద్రత కల్పిస్తాం అంటున్నారు. ఉద్యోగ నియామక పత్రాలు ఇస్తాం అంటున్నారు. వీరికి సరైన ఆదాయం కల్పించే మార్గం సూచించలేదు. జీతం, బెనిఫిట్స్ కల్పించటం లేదు.

ప్రభుత్వ ప్రతిపాదిత నాలుగు లేబర్ కోడ్‌లను కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ కోడ్‌లు కార్మిక నాయకుల పాత్రను రద్దు చేస్తాయి. దీనివల్ల కార్మిక దోపిడీకి హద్దులు లేకుండా పోతాయి. ఉద్యోగ భద్రత లోపిస్తుంది. శాశ్వత ఉద్యోగాలు పోయి స్వల్పకాలిక ఉద్యోగాలు వస్తాయి. కార్మిక సంఘాల బేరసారాల సామర్థ్యం తగ్గిపోయి కార్మిక బానిసత్వానికి బీజాలు పడతాయని కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. రాష్ట్రాలు నిరాధరణకు గురై కేంద్ర ప్రభుత్వ జోక్యం పెరుగుతుంది. ఇది కార్మికుల దోపిడీకి దారి తీస్తుంది. కార్మిక ఉద్యోగ వ్యతిరేక లేబర్ కోడ్‌లను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎఐటీయూసీతో పాటు కేంద్ర కార్మిక సంఘాలు కోరుతున్నాయి. నవంబరు 26 న దేశ వ్యాప్త నిరసనలను జయప్రదం చేయటం ద్వారా పాలకులకు కనువిప్పు కలిగించాలి.

ఎఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు
సెల్: 9490952093

రాజ్యాంగ నిర్ణాయక సభలో ఏకైక కమ్యూనిస్టు

ఆర్వీ రామారావ్

ఒక్కొక్కసారి మహానుభావుల శతజయంతులను కూడా విస్మరిస్తుంటాం. 2009 సెప్టెంబర్ ఒకటిన ఇలాగే జరిగింది. ప్రసిద్ధ కమ్యూనిస్టు నాయకుడు సోంనాథ్ లాహిరి శతజయంతిని అలాగే ఎవరూ గుర్తు చేసుకోకుండానే గడిచిపోయింది. అయినా ఆయనకు కలిగిన నష్టం ఏమీ లేదు. ఆయన కమ్యూనిస్టు పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి పునాది రాళ్లు వేసిన వారిలో ప్రముఖుడు. రాజ్యాంగ నిర్ణాయక సభలో దాదాపు అన్ని రకాల వారికి ఎంతో కొంత ప్రాతినిధ్యం లభించింది. కమ్యూనిస్టు పార్టీ తరఫున రాజ్యాంగ నిర్ణాయక సభలో సోంనాథ్ లాహిరీ ఒక్కరే సభ్యులు. రాజ్యాంగ రచన కోసం జరిగిన చర్చల్లో లాహిరి చాలా క్రియాశీలంగా పాల్గొనే వారు. వ్యక్తుల గోప్యత గురించి లాహిరి రాజ్యాంగ నిర్ణాయక సభలో చాలా ప్రగతిశీలంగా వ్యవహరించారు. వ్యక్తుల మధ్య జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని ఆయన 1947 ఏప్రిల్ 30 న గట్టిగా వాదించారు.

మన రాజ్యాంగం పౌరుల ప్రాథమిక హక్కులకు ప్రతీతి. కానీ "అనేక ప్రాథమిక హక్కులు ఒక పోలీసు కానిస్టేబుల్ దృష్టితో రూపొందించినట్టుగా ఉన్నాయి. చాలా కొద్దిపాటి ప్రాథమిక హక్కులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారు. వాటికీ మళ్లీ అనేక షరతులు పెట్టారు. ప్రాథమిక హక్కులకు పూచీ పడే ప్రతి అధికరణం తరవాత ఆ హక్కులను సంపూర్ణంగా అధిగమించే మరో అధికరణం చేరుస్తున్నారు." అని ఆ రోజుల్లో తీవ్ర భాషలో విమర్శించారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రస్తుత తరుణంలో సోంనాథ్ లాహిరి ఎంతటి దూరదృష్టితో ఆలోచించారో ఆయన మాటలు చూస్తే అర్థం అవుతుంది.

సాదా సీదా మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన సోంనాథ్ లాహిరి భూపేంద్రనాథ్ దత్తా సాహచర్యంలో మార్క్సిజం వైపు ఆకర్షితుడై 1931 లోనే కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అప్పుడు ఆయన రైలు, ట్రాం కార్మికుల సంఘంలో పని చేసేవారు. జంషెడ్‌పూర్‌లో టాటా ఇనుము, ఉక్కు కర్మాగారంలో 1933 లో మొట్టమొదటిసారి కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసింది లాహిరీనే. ఎస్ఎస్. మిరాజ్కర్ అరెస్టు అయినప్పుడు 1935 లో కొద్ది కాలం సీపీఐ ప్రధాన కార్యదర్శిగా పని చేశారన్న అంశాన్ని చాలా మంది గమనించి ఉండరు. కొద్ది నెలలకే లాహిరి అరెస్టు కావడంతో పీసీ జోషి సీపీఐ ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1944 లో కోల్‌కతా మునిసిపల్ కార్పొరేషన్‌లో వీధులూడ్చే వారి చరిత్రాత్మక సమ్మెకు నాయకత్వం వహించింది కూడా సోంనాథ్ లాహిరీనే.

ప్రజా ప్రతినిధిగా ఆయన ఎదుగుదల కింది స్థాయి నుంచి ప్రారంభం అయింది. మొదట ఆయన 1944 లో కోల్‌కతా మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. 1957 నుంచి 1977 దాకా ఆయన బెంగాల్ శాసనసభ్యుడిగా ఉన్నారు. 1967 నుంచి 1970 దాకా మంత్రిగా కూడా పని చేశారు. 1943 లో ఆయన మొదటిసారి సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1948 లో మళ్లీ కేంద్ర కమిటీ సభ్యులయ్యారు.

1964 లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయినప్పుడు ఆయన సీపీఐతో ఉండి పోయారు. 1967 శాసనసభ ఎన్నికలలో సీపీఐ, సీపీఎం పరస్పరం చుక్కెదురుగా ఉన్నప్పుడు లాహిరి త్రికోణపు పోటీలో నెగ్గారు. అప్పుడే యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. 1969 లో ఏర్పడిన ప్రభుత్వంలోనూ ఆయన మంత్రిగా పని చేశారు. 1977 ఎన్నికలలో ఆయన పోటీ చేయలేదు.

సోంనాథ్ కేవలం రాజకీయ నాయకుడు, కార్మిక నాయకుడు మాత్రమే కాదు. ఆయన ఉత్తమ మేధావి. ప్రతిభావంతుడైన రచయిత. అనువాదకుడు. 1931 లో ఆయన "స్టేట్ అండ్ రెవల్యూషన్" గ్రంథాన్ని బెంగాలీలోకి అనువదించారు. సామ్యవాద్ అన్న ఆయన గ్రంథం బహుళ ప్రచారంలోకి వచ్చింది. కమ్యూనిస్టు పార్టీ నడిపిన స్వాధీనత దిన పత్రికకు సంపాదకుడిగా ఉన్నారు. గణశక్తి, ఆగే చలో, కాలాంతర్, కలిజుగేర్ లాంటి పత్రికలకు వ్యాసాలు రాసే వారు. ఆయన రచనా వ్యాసంగం కేవలం రాజకీయ రచనలకు, అనువాదాలకు పరిమితమైంది కాదు. ఆయన మంచి కథా రచయిత కూడా. ఆయన మొదటి కథా సంకలనం 1967 లో వెలువడింది. బెంగాలీలో అభిజన్, హిందీలో జంగీ మజ్దూర్ పత్రికలను నిర్వహించారు. ఈ రెండూ కార్మికవర్గం కోసం నిర్వహించిన పత్రికలు. నవలలు చదవడం, సినిమాలు చూడడం, సంగీతం వినడం ఆయనకు ఇష్టమైన అభిరుచులు. ఆయన నవలలు కూడా రాశారు.

ఆయన జనాన్ని కట్టి పడేసే వక్త. 1949 జనవరి 30 న మహాత్మాగాంధీని హత్య చేసినప్పుడు ఆయన రాసిన "క్రోధ్" వ్యాసం చాలా ప్రచలితమైంది. అందులో ఆయన తీవ్రమైన ధర్మాగ్రహం వ్యక్తం చేశారు. 1947 ఆగస్టు 15 న మనకు స్వాతంత్ర్యం వచ్చినా రాజ్యాంగ రచన పూర్తి అయిన తరవాతే గణతంత్ర వ్యవస్థ నెలకొంది. రాజ్యాంగ రచన నవంబర్ 26 న పూర్తి అయింది. అది అమలులోకి వచ్చిన జనవరి 26 న మనం గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ అంశాన్ని విస్మరించి మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత నవంబర్ 26 ను రాజ్యాంగ దినోత్సవం అంటున్నారు. ఏ పేరు అయితేనేం ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్ణాయక సభలో ఏకైక కమ్యూనిస్టు ప్రతినిధి అయిన సోంనాథ్ లాహిరీని గుర్తు చేసుకోవడం మన విధి.

ఏఐతో నకిలీ ఆధార్, పాన్ కార్డు

బెంగళూరు: కృత్రిమ మేధతో ఉపయోగాలతో పాటు ముప్పు కనిపిస్తోంది. దీనికి సంబంధించి ఇబ్బందులు ఎప్పటికప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా నకిలీ గుర్తింపు కార్డులను ఏఐతో తయారు చేస్తున్నట్లు వెల్లడైంది. పైగా ఫేక్ అని గుర్తించలేనంత కచ్చితత్వంతో ఉండడం ఆందోళన కలిగిస్తున్నది. బెంగళూరుకు చెందిన టెకీ హర్వీన్ సింగ్ చద్దా ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. ఫొటోల సృష్టి కోసం ఓ ప్రముఖ ఏఐ మోడల్ తీసుకొచ్చిన అత్యాధునిక ఫీచర్‌ను ఉపయోగించి నకిలీ ఆధార్, పాన్ కార్డును రూపొందించారు. అందరికీ అర్థం కావడం కోసం వాటిని 'ఎక్స్'లో షేర్ చేశారు. అవి అత్యంత కచ్చితత్వంతో అచ్చుగుద్దినట్లు ఉన్నాయి. ఏఐ మోడళ్లు నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని ఆయన తెలిపారు. ఏఐ టూల్స్‌ను ఏ స్థాయిలో దుర్వినియోగం చేసే అవకాశం ఉందో ఈ ఉదంతం వెలుగులోకి తీసుకొచ్చింది. హర్వీన్ సింగ్ పోస్ట్‌తో ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది మాత్రం ఏఐ జనరేట్ చేసిన ఫొటోలు గుర్తించేందుకు తగిన టూల్స్ అందుబాటులో ఉన్నాయని వాదించారు. దీనిపై హర్వీన్ స్పందిస్తూ... ఎన్నిచోట్ల అలా ఆధార్, పాన్‌ను స్కాన్ చేసి గుర్తించే వెసులుబాటు ఉందని ప్రశ్నించారు.

బుర్హాన్‌వని హత్యకు ప్రతీకారం

ఆత్మాహుతి బాంబర్ ఉమర్ నబీ ఆలోచన అదే
ఢిల్లీ పేలుడుపై ఉగ్ర డాక్టర్ల విచారణలో సంచలన విషయాలు

న్యూఢిల్లీ: ఉగ్రవాది బుర్హాన్ వని హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని ఢిల్లీలో పేలుడుకు పాల్పడిన ఆత్మాహుతి బాంబర్ ఉమర్ ఉన్ నబీ కోరుకున్నాడు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో పట్టుబడిన వైట్ కాలర్ మాడ్యూల్‌కు చెందిన అనేక మంది ఉగ్రవాద అనుమానితులను ప్రశ్నించినప్పుడు దర్యాప్తు అధికారులు అనేక కుట్రలకు సంబంధించిన సమాచారం సేకరించారు. ఇందులో భాగంగా ఢిల్లీ ఎర్రకోట సమీపంలో కారు బాంబు పేల్చిన ఉమర్ ఉన్ నబీ... తన మాడ్యూల్‌లోని ఇతర వైట్ కాలర్ ఉగ్రవాదులకు తాను వారి పాలకుడినని, వారి నాయకుడినని చెప్పుకునేవాడు. ఇతరులకు తనను తాను ఎలా చూపించుకున్నాడనే దానిలో దాదాపు యువరాజు లాంటివాడని చెప్పడానికి తనను తాను 'ఎమిర్' అని పిలుచుకునేవాడని దర్యాప్తు వర్గాలు ఎన్‌డీ టీవీకి తెలిపాయి. 2016లో భద్రతా దళాలు ఉగ్రవాది బుర్హాన్ వనీని కాల్చి చంపినందుకు ప్రతీకారం తీర్చుకోవాలని కూడా అతను కోరుకున్నాడని ఆ వర్గాలు వెల్లడించాయి. జైషే మహ్మద్‌కు చెందిన మౌల్వీ ఇర్ఫాన్ అహ్మద్ ద్వారా ఉగ్రవాద మాడ్యూల్‌లోకి మొదటగా నియమించబడిన ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయంలోని వైద్యుడు ముజామిల్ షకీల్ ఆత్మాహుతి బాంబర్ పాత్రను 'ఎమిర్'గా వర్ణించాడు. అరెస్టు చేయబడిన మరో ఉగ్రవాద అనుమానితుడు షాహీన్ సయీద్ కూడా విచారణ సమయంలో కీలకమైన సమాచారాన్ని అందించాడని దర్యాప్తు వర్గాలు తెలిపాయి. ఉమర్ ఉన్ నబీకి ఉన్న హోదా , అనుభవంతో పోలిస్తే తాను కేవలం కార్మికుడినని ముజామిల్ షకీల్ తమతో చెప్పాడని దర్యాప్తు అధికారులు తెలిపారు. ఉగ్రవాదులు తమ ప్రణాళికకు 'ఆపరేషన్ ఎమిర్' అని పేరు పెట్టారు. ఆత్మాహుతి బాంబర్ వారి పాయింట్‌మన్‌గా ఉన్నారు. ఉమర్‌కు తొమ్మిది భాషలు తెలుసు. ఉగ్రవాద మాడ్యూల్‌లో అత్యంత విద్యావంతుడు, తెలివైన వ్యక్తి అని ముజామిల్ షకీల్ చెప్పిన విషయాన్ని ఉటంకిస్తూ అధికారులు తెలిపారు. ముజామిల్ షకీల్ ఆత్మాహుతి బాంబర్‌గా మారిన ఉమర్‌ను సులభంగా అణు శాస్త్రవేత్త అయ్యే వ్యక్తిగా పేర్కొన్నాడు. భారతదేశంలో ముస్లింలకు వాతావరణం అనుకూలంగా లేదని, విధ్వంసం జరిగే అవకాశం ఉన్నందున వారు సిద్ధంగా ఉండాలని ఉమా ఉన్ నబీ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌లోని ఇతర వైద్యులతో తరచుగా చెబుతూ ఉండేవాడని వర్గాలు వెల్లడించాయి.

బీజేపీ నన్ను గెలవలేదు

బెంగాల్ జోలికొస్తే పునాదులు కదిలిస్తా
సీఎం మమతా బెనర్జీ హెచ్చరిక

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీని తీవ్రంగా హెచ్చరించారు. బీజేపీ తనతో రాజకీయంగా పోరాడలేదని, తనను ఓడించడం సాధ్యం కాదని ఆమె స్పష్టం చేశారు. బెంగాల్‌లో తనకు సవాల్ విసరాలని చూస్తే... దేశవ్యాప్తంగా ఆ పార్టీ పునాదుల్ని కదిలిస్తానని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) కు వ్యతిరేకంగా బన్‌గావ్‌లో నిర్వహించిన ర్యాలీలో ఈ మేరకు ప్రసంగించారు. ఎన్నికల సంఘం ఏ మాత్రం నిష్పాక్షికంగా పనిచేయడం లేదని, అది బీజేపీ కమిషన్‌గా మారిందన్నారు. ఎస్ఐఆర్ కారణంగానే బీహార్ ఎన్నికల ఫలితాలు ఆ విధంగా వచ్చాయని, అక్కడ బీజేపీ ఆటను ప్రతిపక్షాలు అంచనా వేయలేకపోయాయని మమత తెలిపారు. ఒకవేళ అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులను తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమైతే... బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. అంటే... 'డబుల్ ఇంజిన్' సర్కారు రాష్ట్రాల్లో చొరబాటుదారులు ఉన్నట్లు ఆ పార్టీ అంగీకరిస్తోందా? అని అన్నారు. రాష్ట్రంలో మతువా మెజారిటీ ప్రాంతాల్లోని ఓటర్లు 'సీఏఏ' కింద తమను తాము విదేశీయులుగా ప్రకటించుకుంటే వెంటనే ఓటర్ల జాబితా నుంచి వారి పేర్లు తొలగిపోతాయన్నారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితా బయటకు వచ్చిన తర్వాత.. ఈసీ, భాజపా సృష్టించిన గందరగోళాన్ని ప్రజలు గుర్తిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను రెండు, మూడేళ్లపాటు నిర్వహిస్తే సహకరిస్తామని చెప్పారు. తొలుత హెలికాప్టర్ ద్వారా బన్‌గావ్‌కు చేరుకునేందుకు దీదీ సిద్ధం కాగా.. ఆ ప్రణాళిక రద్దయింది. దీంతో కోల్‌కతా నుంచి ఆమె రోడ్డు మార్గంలో ఇక్కడికి చేరుకున్నారు. చివరి క్షణంలో హెలికాప్టర్ ప్రయాణం రద్దు కావడం వెనుక భాజపా హస్తం ఉందని ఆమె ఆరోపించారు. ఆ పార్టీ తనను ఇరుకున పెట్టలేదని, తనతో ఆటలాడొద్దని హెచ్చరించారు. అయితే.. గడువు ముగిసిన లైసెన్స్‌తో ఆ హెలికాప్టర్‌ను నడుపుతున్నట్లు గుర్తించామని, దీంతో రద్దు చేయాల్సి వచ్చిందని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

28న ఈసీతో టీఎంసీ ప్రతినిధుల భేటీ

పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ కొనసాగుతున్న వేళ.. తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధులు ఈసీతో భేటీ కానున్నారు. అపాయింట్‌మెంట్ కోరుతూ పార్టీ నేత డెరెక్ ఓబ్రియన్ చేసిన విజ్ఞప్తికి ఈసీ స్పందిస్తూ... ఈ నెల 28న ఓ అధికార ప్రతినిధి, మరో నలుగురితో కూడిన బృందం తమను కలవొచ్చని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి లేఖ రాసింది. పార్టీలతో నిర్మాణాత్మక చర్చలను తాము ఎల్లప్పుడూ స్వాగతిస్తామని తెలిపింది.

యువతకు కోటి ఉద్యోగాలు

నితీశ్ కేబినెట్ నిర్ణయం

పట్నా: రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలోని యువతకు కోటి ఉద్యోగాలు కల్పించాలని బీహార్ కొత్త కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని బీహార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యయ్ అమృత్ మంగళవారం విలేరులకు వెల్లడించారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం ప్రత్యయ్ మీడియాతో మాట్లాడుతూ 'ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో విస్తృత ఉపాధి కల్పన, పారిశ్రామిక అభివృద్ధి గురించి కీలక అంశాలుగా చర్చించాం. తూర్పు భారతదేశంలో బీహార్‌ను టెక్ హబ్‌గా మార్చడానికి డిఫెన్స్ కారిడార్, సెమీకండక్టర్ తయారీ పార్క్, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు, మెగా టెక్ సిటీ, ఫిట్‌నెస్ సిటీ ఏర్పాటు చేస్తాం. నూతన యుగ ఆర్థిక వ్యవస్థ కింద బీహార్ రాబోయే ఐదు సంవత్సరాలలో బ్యాక్-ఎండ్ హబ్, గ్లోబల్ వర్క్‌ప్లేస్‌గా అభివృద్ధి చెందుతుంది' అని అన్నారు. రాష్ట్రంలోని ప్రతిభావంతులైన, యువ పారిశ్రామికవేత్తలకు జీవనోపాధి అవకాశాలను నిర్ధారించడానికి స్టార్టప్ డొమైన్‌లో ఉపాధి ఆధారిత కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేయడానికి కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు ప్రత్యయ్ అన్నారు. రాష్ట్రంలో మూసివేసిన తొమ్మిది చక్కెర మిల్లులను తిరిగి తెరుస్తామని, 25 కొత్తవి ఏర్పాటు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

డేటా ప్రొటెక్షన్ చట్ట నిబంధనలు ఆందోళనకరం: పీసీఐ

న్యూఢిల్లీ: డేటా ప్రొటెక్షన్ చట్టం 2023లోని కొన్ని నిబంధనలు పత్రికా స్వేచ్ఛను దెబ్బతీసేలా ఉన్నాయని ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం 2023లో కొన్ని నిబంధనలు అస్పష్టతతోనూ, అపరిమిత పరిధి కలిగి ఉన్నాయి. దీంతో ఈ చట్టాన్ని పత్రికా స్వేచ్ఛను దెబ్బతీసేందుకు ఆయుధంగా ఉపయోగించడానికి అవకాశం పెరిగిందని పీసీఐ పేర్కొంది. డీపీడీపీ చట్టంలోని నిబంధనలను ఇటీవల నోటిఫై చేసిన విధానంపై పీసీఐ ఆవేదన వెలిబుచ్చింది. ఈ చట్టంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపడానికి జూన్ 2025లో ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖకు 22 ఇతర జర్నలిస్టు యూనియన్‌లతో కలిసి సంయుక్త వినతిపత్రం సమర్పించినట్లు పీసీఐ తెలిపింది. ఈ డీపీడీపీ చట్టం పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తుంది. భావ ప్రకటనా హక్కు ఆర్టికల్ 19(1)ను నేరుగా దెబ్బతీస్తుంది. అందుకే రెండు ప్రధాన అంశాలపై పీసీఐ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖకు వినతిపత్రం సమర్పించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో జర్నలిస్టులు, మీడియా సంస్థల పనితీరును అణచివేయకుండా ఒక నమూనా అమలు నియమాలు రూపొందించడంలో సహాయపడడానికి ప్రభుత్వంతో అత్యంత నిర్మాణాత్మకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలు జరపాలని, డీపీడీపీ చట్టం 2023లోని కొన్ని సెక్షన్లు వాటి విస్తృత నిర్వచనాలు గానీ, వాటి పరిధికి సంబంధించిన అంశాలు చాలా అస్పష్టంగా ఉన్నాయని పీసీఐ వెల్లడించింది. ఈ నిబంధనలు పత్రికా స్వేచ్ఛను తగ్గిస్తాయి. మీడియా గొంతు నొక్కేయడానికి, చట్టాన్ని ఆయుధంగా మార్చుకోవడానికి ఈ నిబంధనలు అవకాశాలు కల్పిస్తాయని పీసీఐ నొక్కి చెప్పింది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖకు ఇచ్చిన మెమోరాండంలోనూ ఈ రెండు అంశాలనే పీసీఐ తెలిపింది.

బాలుడిపై పెంపుడు కుక్క దాడి...

యజమాని అరెస్ట్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఓ బాలుడిపై పెంపుడు కుక్క దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ చిన్నారిని కుక్క నుంచి తప్పించేందుకు స్థానికులు ప్రయత్నించినప్పటికీ... అతడి చెవి తెగిపోయేదాక వదల్లేదు. ప్రేమ్‌నగర్ ప్రాంతంలోని విజయ్ ఎన్‌క్లేవ్‌లోని తన ఇంటి సమీపంలో బాలుడు ఆడుకుంటున్నాడు. ఇంతలో రాజేశ్ పాల్(50) అనే టైలర్‌కు చెందిన పిట్‌బుల్ జాతి కుక్క అకస్మాత్తుగా ఇంటి నుంచి బయటకు వచ్చింది. అక్కడే ఆడుకుంటున్న బాలుడిపై దాడి చేయబోయింది. పిల్లవాడు దాని బారి నుంచి తప్పించుకుని పరుగుతీస్తుండగా వెంటాడిన కుక్క అతడిపై ఎగబడింది. ఓ మహిళ దానిని ఆపడానికి ప్రయత్నించినప్పటికీ అది ఆగలేదు. అక్కడే ఉన్న మరో వ్యక్తి దానిని గమనించిన ఆ బాలుణ్ని రక్షించబోయారు. అయినప్పటికీ బాలుడిని వదలని శునకం... అతడి కుడి చెవి తెగిపోయేలా కరిచింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని వెంటనే స్థానిక రోహిణిలోని బీఎస్ఏ హాస్పిటల్‌కి, అక్కడి నుంచి సఫ్దర్‌జంగ్ దవాఖానకు తరలించారు. కాగా, బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కుక్క యజమాని రాజేశ్‌పాల్‌పై కేసుపెట్టిన పోలీసులు... హత్యాయత్నం కింద అతడిని అరెస్టు చేశారు. రాజేశ్ పాల్ కుమారుడు సచిన్ పాల్.. సుమారు ఏడాదిన్నర క్రితం ఆ శునకాన్ని పెంచుకునేందుకు ఇంటికి తెచ్చినట్టు సమాచారం. కాగా, కుక్క తన యజమాని చేతి నుంచి విడిపించుకుని ఈ దారుణానికి పాల్పడిందని బాలుడి తాత కామేశ్వర్ రాయ్ చెప్పారు.

పర్యావరణ విపత్తు సృష్టించడమే!

అదానీ ప్రాజెక్టు కోసం చెట్ల నరికివేతపై కాంగ్రెస్

న్యూఢిల్లీ: కార్పొరేట్ల కోసం ఏమి చేయడానికైనా మోదీ ప్రభుత్వం వెనుకాడటం లేదని కాంగ్రెస్ విమర్శించింది. పర్యావరణ విపత్తు, సామాజిక విపత్తు, ఆర్థిక విపత్తులు సృష్టిస్తూ ఆదివాసీల జీవితాలు దుర్భరం చేస్తోందని దుయ్యబట్టింది. మధ్యప్రదేశ్‌లోని ధిరౌలీలో అదానీ బొగ్గు ప్రాజెక్టు కోసం పెద్ద ఎత్తున చెట్లు నరికివేస్తున్నారని, 'ప్రొసీజరల్ షార్ట్-సర్క్యూటింగ్'కు అదానీ సంస్థ పాల్పడుతున్నదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మంగళవారం ఆరోపించారు. 'బొగ్గు గని కోసం అడవుల నరికివేతకు 'మోదానీ అండ్ కో' మధ్యప్రదేశ్‌లోని ధిరౌలీలో విధానపరమైన షార్ట్ సర్క్యూటింగ్ చేస్తున్న అంశాన్ని ప్రస్తావించాం. భారీగా పోలీసులను మోహరించి ఆ గ్రామంలో పెద్ద ఎత్తున చెట్లు కొట్టివేస్తున్నట్లు నివేదికలు అందాయి. అడవి ప్రాంతంలో చెట్లు కొట్టేస్తున్న స్థలం దగ్గరకు గ్రామస్తులను వెళ్లనివ్వడం లేదు. బయట వారికి ప్రవేశాన్ని నిరాకరించారు. ఇదే అంశాన్ని లేవనెత్తిన మధ్యప్రదేశ్ ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాము తీకమ్‌ను అరెస్టు చేశారు. తమ జీవనోపాధి కోసం అడవులపై ఆధారపడే ఆదివాసీ తెగలకు సంబంధించి ఇది పర్యావరణ విషాదం. సామాజిక-ఆర్థిక విపత్తు' అని జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తంచేశారు.

తమిళనాట ఎస్ఐఆర్‌పై ఈసీ వివరణ ఇవ్వాలి: సుప్రీం

న్యూఢిల్లీ: తమిళనాడులో ఎస్ఐఆర్ నిర్వహణపై ఎన్నికల సంఘం వివరణను సర్వోన్నత న్యాయస్థానం కోరింది. రాజ్యసభ మాజీ సభ్యుడు, ఎండీఎంకే వ్యవస్థాపకుడు వైకో పిటిషన్ క్రమంలో మంగళవారం ఈసీకి నోటీసులిచ్చింది. డిసెంబరు 2వ తేదీన దీనిపై విచారణ జరుగుతుందని నూతన సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. ప్రజా ప్రతినిధుల చట్టం, ఓటర్ల నమోదు నిబంధనలతో పాటు సమానత్వం హక్కు సహా ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా ఎస్ఐఆర్ నోటిఫికేషన్ ఉన్నట్లు వైకో ఆరోపించారు. ఓటర్ల జాబితాల ప్రక్షాళన ప్రక్రియను సవాల్ చేశారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఆర్ఐ నిర్వహణను సవాల్ చేస్తూ డీఎంకే, సీపీఎం, కాంగ్రెస్, తృణమూల్ నాయకుల ఫిర్యాదులపై ఈసీ స్పందన కోరుతూ ఈనెల 11న సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చింది. తమిళనాడు, బెంగాల్‌లో ప్రక్రియను సవాల్ చేసే పిటిషన్లపై చర్యల నిలుపుదలను సూచిస్తూ మద్రాసు, కలకత్తా హైకోర్టులకు ఆదేశాలు ఇచ్చింది.

యాపిల్ సేల్స్ విభాగంలో ఉద్యోగాల కోత!

న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా టెక్ సంస్థలు వరుసగా ఉద్యోగుల తొలగింపును కొనసాగిస్తున్నాయి. ఇప్పటికే గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలు విడతలవారీగా లేఆఫ్స్ ప్రకటించింది. ఖర్చులను తగ్గించడంలో భాగంగా ఉద్యోగులను తొలగించాయి. తాజాగా ఈ జాబితాలోకి ప్రముఖ టెక్ కంపెనీ యాపిల్ కూడా వచ్చి చేరింది. ప్రముఖ వార్తా సంస్థ బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం... యాపిల్ తన సేల్స్ విభాగంలో ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమైంది. అయితే, స్వల్ప సంఖ్యలో ఉద్యోగులపై మాత్రమే ఈ తొలగింపు ప్రభావం ఉంటుంది. కాగా, తాజా లేఆఫ్స్‌లో ఉద్యోగాలు కోల్పోయిన వారు ఇతర విభాగాల్లో పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం సంస్థ కల్పించింది. ఈ మేరకు యాపిల్ వర్గాలను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ నివేదించింది.

విమాన రాకపోకలకు ఇబ్బంది లేదు

పౌరవిమానయాన శాఖ

న్యూఢిల్లీ: ఆఫ్రికాలోని ఇథియోపియాలో హేలీ గుబ్బి అగ్నిపర్వతం పేలడంతో దానికి సంబంధించిన బూడిద మేఘాలు భారత్ వైపు కదిలి వచ్చాయి. ఈ నేపథ్యంలో విమాన సర్వీసులతోపాటు ఆయా రాష్ట్రాలపై ఇవి ప్రభావం చూపే అవకాశం ఉందనే కథనాలు వచ్చాయి. దీనిపై పౌరవిమానయానశాఖ స్పందించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా విమాన కార్యకలాపాలు సజావుగానే సాగుతున్నట్లు వెల్లడించింది. ముందు జాగ్రత్త చర్యగా కొన్ని విమానాలను దారిమళ్లించినట్లు తెలిపింది. ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ వ్యవహారంపై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ , భారత వాతావరణ విభాగం , విమానయాన సంస్థలు, అంతర్జాతీయ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటున్నామని పౌర విమానయానశాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా విమాన కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. ప్రస్తుతానికి ఎటువంటి ఆందోళన అక్కర్లేదని, పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. ఇక ఇథియోపియాలో హేలీ గుబ్బి అగ్నిపర్వతం విస్ఫోటంతో ఏర్పడిన ఈ బూడిద మేఘాలు నింగిలో వేల అడుగుల ఎత్తులోకి చేరాయి.

ఎర్రసముద్రం మీదుగా అరేబియా ద్వీపకల్పం చేరుకొని అక్కడినుంచి భారత ఉపఖండం దిశగా పయనించాయి. గుజరాత్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు విస్తరించాయి. ఇవి చైనా దిశగా కదులుతున్నాయని, మంగళవారం రాత్రి 7.30 నాటికి భారత గగనతలం దాటిపోయే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు వెల్లడించారు.

టీచర్ల అమానవీయ చర్య

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. హోంవర్క్ చేయలేదని ఐదేళ్ల బాలుడికి ఇద్దరు టీచర్లు దారుణమైన శిక్ష విధించారు. ఆ బాలుడిని చెట్టుకి వేలాడదీశారు. సూరజ్‌పూర్ జిల్లా నారాయణ్‌పూర్‌లోని హంసవాణి విద్యా మందిర్‌లో ఈ దారుణ ఘటన జరిగింది. స్థానికుల్లో ఒకరు ఈ ఉదంతాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఈ ఘటన బయటపడింది. దీనిపై ఆగ్రహానికి గురైన గ్రామస్థులు ఆ టీచర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల వద్ద పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించామని జిల్లా విద్యాశాఖ తెలిపింది. సమగ్ర విచారణ జరుపుతామని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

జుబీన్ గర్గ్‌ది హత్య: హిమంత శర్మ

గువహతి: అసోం ప్రముఖ గాయకుడు జుబీన్ గర్గ్ (52) ప్రమాదంలో చనిపోలేదని, అతడు హత్యకు గురయ్యారంటూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సంచలన ప్రకటన చేశారు. ఇటీవల సింగపూర్ వెళ్లిన జుబీన్ అక్కడ ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఆయన మరణంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో అసోం ముఖ్యమంత్రి ... జుబీన్ ప్రమాదంలో చనిపోలేదని, హత్యకు గురయ్యారంటూ అసెంబ్లీలో వెల్లడించారు. గాయకుడి మృతిపై చర్చించేందుకు ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానం సందర్భంగా సీఎం ఈ మేరకు ప్రకటన చేశారు. 'జుబీన్ గర్గ్ ప్రమాదవశాత్తూ మరణించలేదు. ఆయన్ని హత్య చేశారు' అని వ్యాఖ్యానించారు. జుబీన్ రెండు నెలల క్రితం సింగపూర్‌లో స్కూబా డైవింగ్ సందర్భంగా చోటుచేసుకున్న ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆయన మరణంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో సింగర్ మృతిపై సీఎం హిమంత బిశ్వ శర్మ దర్యాప్తునకు ఆదేశించారు. ఈ కేసులో జుబీన్ మేనేజర్, వ్యక్తిగత భద్రతా సిబ్బంది సహా పలువురిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

సైన్యం మతాలకు అతీతం: సుప్రీం

న్యూఢిల్లీ: సైన్యానికి సంబంధించిన లౌకికవాదంపై సుప్రీంకోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. ఆలయంలోకి ప్రవేశించేందుకు తిరస్కరించిన హిందూయేతర సైనిక అధికారి తొలగింపును సమర్థించింది. ఒక వ్యవస్థగా ఆర్మీ లౌకికమైందని, దాని క్రమశిక్షణ విషయంలో రాజీ పడలేమని తేల్చి చెప్పింది. ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించేందుకు ఒక మత వర్గానికి చెందిన ఆర్మీ అధికారి శామ్యూల్ కమలేశన్ నిరాకరించారు. ఉన్నతాధికారి ఆదేశాలను ధిక్కరిస్తూ... అది తన మత స్వేచ్ఛను ఉల్లంఘించడమే అవుతుందని వాదించారు. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకున్న ఉన్నతాధికారులు... సైనిక క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు కమలేశన్‌ను విధుల నుంచి తొలగించారు. తనపై తీసుకున్న చర్యలను ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. ఆర్మీ నిర్ణయాన్ని మే నెలలో ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. ఇది పూర్తిగా క్రమశిక్షణారాహిత్యమని తన తీర్పులో పేర్కొంది. దాంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా కమలేశన్‌కు చుక్కెదురైంది. ఈ తీర్పు సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఆయన ఎలాంటి సందేశం పంపుతున్నారు? ఇది పూర్తిగా క్రమశిక్షణారాహిత్యం. ఒకసారి ఆర్మీ యూనిఫాం ధరించాక వ్యక్తిగత అభిప్రాయాలు, విశ్వాసాలకు తావుండకూడదు. ఆ వ్యక్తి అత్యుత్తమంగా విధులు నిర్వర్తించే అధికారిగా కావచ్చు. ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించేటువంటి దుందుడుకు స్వభావం ఆర్మీకి సరిపోదు' అని పేర్కొంది. ఈ కేసు విచారణ సందర్భంగా కమలేశన్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. 'ఒకేఒక్క ఉల్లంఘనకే ఆయనను తొలగించారు. హోలీ, దీపావళి వంటి పండగల్లో పాల్గొని ఇతర మతాల వ్యక్తులతో గౌరవంగా వ్యవహరిస్తుంటారు. అన్ని రెజిమెంటల్ కేంద్ర కార్యాలయాల్లో సర్వ ధర్మస్థలం(అన్ని మతాలకు చిహ్నమైన నిర్మాణం) ఉంటుంది. అలాకాకుండా పంజాబ్‌లోని మమున్‌లో గురుద్వారా, ఆలయం మాత్రమే ఉన్నాయి. అధికారులు ఇచ్చిన ఆదేశాల్లో గర్భగుడిలోకి ప్రవేశించడానికి మాత్రమే ఆయన నిరాకరించారు. ఆయన దుందుడుకు స్వభావం ఉన్న వ్యక్తి కాదు. ఆర్మీలో చేరడం వల్ల తన మతపరమైన గుర్తింపును కోల్పోయారు. ఆయన గుడి, గురుద్వారాలోకి వెళ్లారు కానీ... పూజ చేయమన్నప్పుడే ఆగిపోయారు. ఆ మాత్రం స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించింది' అని వెల్లడించారు. అయితే ఈ వాదనతో కోర్టు ఏకీభవించలేదు. హైకోర్టు తీర్పును సమర్థించింది.

ఏడుగురు కాంగ్రెస్ నాయకులపై వేటు

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న కాంగ్రెస్ ... పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరించారనే కారణంతో ఏడుగురు సీనియర్ నాయకులపై వేటువేసింది. ఆరేళ్లపాటు వారి ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా రద్దుచేసింది. పార్టీ క్రమశిక్షణ కమిటీ సమీక్ష చేసిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. వేటుపడిన వారిలో పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఆదిత్య పాశ్వాన్, మరో మాజీ ఉపాధ్యక్షుడు షకీల్ ఉర్ రెహమాన్, కిసాన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాజ్‌కుమార్ శర్మ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్ కుమార్ రంజన్, మరో మాజీ అధ్యక్షుడు కుందన్ గుప్తా, కాంగ్రెస్ బంకా జిల్లా అధ్యక్షురాలు కాంచన కుమారి, నలంద జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు రవి గోల్డెన్ ఉన్నారు. ఈ ఏడుగురు నేతలు తరచూ మీడియాలో పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు చేసినట్లు క్రమశిక్షణ కమిటీ తేల్చింది. వీరి నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు ఇచ్చామని, అయినా ఆ నోటీసులకు వారు సంతృప్తికరమైన వివరణ ఇవ్వలేదని, దాంతో బహిష్కరణ వేటు వేశామని తెలిపింది.

ఢిల్లీ సీఎం రేఖాగుప్తాకు అగ్ని పరీక్ష

ఎంసీడీ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం తంటాలు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు తొలి అగ్నిపరీక్ష ఎదురుకాబోతుంది. దేశ రాజధాని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ)కు సంబంధించి 12 స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, బీజేపీ పోటీ పడుతున్నాయి. ఈ పోరులో బీజేపీ గెలుపు కోసం ముఖ్యమంత్రి రేఖా గుప్తా తన సైనికులను యుద్ధభూమిలో మోహరించించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతే ప్రభుత్వంపై తప్పుడు సంకేతాలు వెళతాయని రేఖా గుప్తా సర్కార్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలోని 12 మున్సిపల్ కార్పొరేషన్ వార్డులకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. దక్షిణపురి, సంగం విహార్-ఎ, గ్రేటర్ కైలాష్, వినోద్ నగర్, షాలిమార్ బాగ్-బి, అశోక్ విహార్, చాందినీ చౌక్, చాందినీ మహల్, ద్వారక-బి, ముండ్కా, నారాయణ, దిచౌన్ కలాన్ స్థానాల పరిధిలో ఈ ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ 12 సీట్లలో తొమ్మిది స్థానాలు బీజేపీ కౌన్సిలర్లకు, మూడు స్థానాలు ఆమ్ ఆద్మీ పార్టీకి ఉన్నాయి. ఈ ఎన్నికల్లో అందరి దృష్టి షాలిమార్ బాగ్-బి, ద్వారకా-బి సీట్లపై ఉంది. ఎందుకంటే షాలిమార్ బాగ్-బి నుంచి గెలిచిన మాజీ కౌన్సిలర్ రేఖాగుప్తా ఇప్పుడు ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. ద్వారకా-బి నుంచి కౌన్సిలర్ అయిన కమల్జీత్ సెహ్రావత్ లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ ఢిల్లీ నుంచి బీజేపీ ఎంపీగా విజయం సాధించారు. ఢిల్లీలోని 12 వార్డులకు జరుగుతున్న ఉప ఎన్నికలు బీజేపీకి పెద్ద పరీక్షగా విశ్లేషకులు చెబుతున్నారు. రేఖా గుప్తా రాజీనామాతో షాలిమార్ బాగ్-బి స్థానం ఖాళీ అయింది. వినోద్ నగర్ స్థానంలో బీజేపీ ఎమ్మెల్యే రవీందర్ సింగ్ నేగి గతంలో గెలుపొందారు. అందుకే ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ తన మొత్తం సైన్యాన్ని మోహరించింది. ఈ ఉప ఎన్నికల్లో రేఖాగుప్తా విశ్వసనీయత ప్రమాదంలో ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే ఇందులో విజయం సాధించడానికి ఢిల్లీ మంత్రులందరినీ వార్డు ఎన్నికల ఇంచార్జ్‌లుగా నియమించారని పేర్కొన్నారు. ప్రతి మంత్రికి రెండు వార్డులు కేటాయించారని, బూత్ స్థాయిలో నిశితంగా పర్యవేక్షణ నిర్వహించడం, ఇంటింటికీ నేరుగా వెళ్లి ఓటర్లను సంప్రదించడం, గెలుపు దిశగా ప్రచార వ్యూహాలు రూపొందించడం వంటి పనులను రేఖాగుప్తా ఇప్పటికే ఎన్నికల ఇంచార్జ్‌లు, సమన్వయకర్తలకు అప్పగించారని బీజేపీ పేర్కొంది. బీజేపీకి అత్యంత సవాలుతో కూడిన సీట్లు పాత ఢిల్లీలోని చాందినీ చౌక్, చాందినీ మహల్. చాందినీ మహల్ గత ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ 17,000 ఓట్ల తేడాతో గెలిచింది. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలల తర్వాత జరుగుతున్న ఈ ఉప ఎన్నిక పార్టీకి తొలి ప్రధాన పరీక్షగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

టెక్నికల్ కోర్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర, హైదరాబాద్ : టెక్నికల్ కోర్స్ సర్టిఫికెట్ పరీక్షలకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్. రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీలలో లోయర్, హయ్యర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికేట్ కోర్సు పరీక్ష వచ్చే జనవరి, ఫిబ్రవరి-2026 నెలలో నిర్వహించబడుతుందని జిల్లా విద్యాధికారి ఆర్.రోహిణి తెలిపారు. లోయర్ గ్రేడ్ సర్టిఫికెట్‌కు 7వ తరగతి ఉత్తీర్ణులు అర్హులని, అలాగే సంబంధిత ట్రేడ్‌లో లోయర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికేట్ కలిగిన వారు హయ్యర్ గ్రేడ్ పరీక్షకు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు www.bse.telangana.gov.in వెబ్సైటు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అలాగే డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తు ఫారమ్‌లను జిల్లా విద్యా అధికారి కార్యాలయం, నిజాం కళాశాల ఎదురుగాబీ అలియా జూనియర్ కళాశాల ప్రాంగణాలు, గన్ ఫౌండ్రీలో సమర్పించాలని తెలియజేసారు. తెలంగాణేతర రాష్ట్రం/బోర్డు జారీ చేసిన పాస్ సర్టిఫికెట్లు ఉన్న అభ్యర్థులు పైన పేర్కొన్న సాంకేతిక పరీక్షలకు ప్రవేశం కోసం డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎక్సమినేషన్స్ నుండి ముందస్తు అనుమతి పొందాలని తెలిపారు. పరీక్షా రుసుంను ప్రభుత్వ ట్రెజరీ చలాన్ ద్వారా చెల్లించాలని తెలిపారు.

డంప్ యార్డు తరలింపునకు ఆదేశాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండల కేంద్రంలోని బాడుగుల చెరువు పక్కన ఉన్న డంపింగ్ యార్డు వల్ల ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్న అంశాలను స్థానిక ప్రజలు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకురాగానే వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. వెంటనే జిల్లా కలెక్టర్ డంప్ యార్డు మార్చుటకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ ఆదేశాల ప్రకారం కోహెడ మండలంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 998లో 2 ఎకరాల భూమిని డంప్ యార్డు కొరకు కేటాయిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డంప్ యార్డు తరలించడం వల్ల స్థానిక ప్రజల సమస్యలు, అక్కడే చెరువులో చేపల వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్న మత్యకారుల కుటుంబాల సమస్యలు తీరనున్నట్లు వెల్లడించారు.

తాగునీటి వృథాపై వ్యక్తికి జరిమానా

విశాలాంధ్ర, హైదరాబాద్ : జలమండలి సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించిన వ్యక్తికి అధికారులు జరిమానా విధించారు. ఈ ఘటన బంజారా హిల్స్‌లో జరిగింది. జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి బంజారా హిల్స్ ప్రధాన రహదారిపై వెళుతుండగా... రోడ్ నం. 12లో ఓ వ్యక్తి జలమండలి సరఫరా చేసే నీటితో కార్‌ను కడుగుతూ కనిపించారు. దీంతో ఎండీ ఆగ్రహం వ్యక్తం చేసి.. తాగునీటిని ఇలా ఇతర అవసరాలకు వినియోగించవద్దని హెచ్చరించారు. అంతే కాకుండా అతనికి నోటీసు అందించి, జరిమానా వెయ్యాలని సంబంధిత మేనేజర్ ను ఆదేశించారు. ఎండీ ఆదేశాల మేరకు ఆ వ్యక్తికి రూ.10000 జరిమానా విధించారు. జలమండలి సరఫరా చేసే తాగునీరు ఇలా ఇతర అవసరాలకు వినియోగించద్దని ఎండీ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే.. తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

డిసీసీ అధ్యక్షుడికి సత్కారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్‌నగర్ నగరం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన సంజీవ్ ముదిరాజ్ స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారంలో సమిష్టిగా పని చేయాలని ఆకాంక్షించారు. కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సంజీవ్ ముదిరాజ్ గారు పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బెక్కరి మధుసూదన్ రెడ్డి, సీజే బెనహర్, ప్రవీణ్ కుమార్, రఘుపతి రెడ్డి, రియాజ్, తాహెర్, బండిమల్లేష మల్లేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా ప్రజా ప్రభుత్వం

విశాలాంధ్ర కొత్తూరు : ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆడపడుచులకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లారం శేఖర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన మండల పరిధి లోని సిద్దాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. గ్రామంలో మహిళలు ఈ చీరల పంపిణీకి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకత్వంలో అర్హులైన ప్రతి మహిళకు చీరలను అందించేలా ఏర్పాట్లు చేశారు. ఇది మహిళా సాధికారతకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తోందని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. చేనేత కార్మికులు తయారు చేసిన ఈ చీరలను అందుకున్న మహిళలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే శంకర్ తో పాటు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, కొత్తూరు మండలం కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు నుశ్రత్ బేగం, మాజీ ఎంపిటిసి రాసుల జంగయ్య,గుండెమోని కుమార్,షేక్ జాఫర్, ఖాజా పాషా వద్దె వేంకటయ్య, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: తెలంగాణ ఆడపడుచులను తోబుట్టువులుగా భావించి వారికీ ఎల్లప్పుడూ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండల మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి అన్నారు. కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు,గ్రామ పెద్దలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ.... మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నట్లు, పేద మహిళల అభ్యున్నతికి, మహిళల ఎదుగుదలను ఆకాంక్షిస్తూ మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, నిరంతరం మహిళల అభివృద్ధిని కోరుకుంటుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మహిళల కోసం ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, చీరలు వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్

విశాలాంధ్ర, హైదరాబాద్ : జిహెచ్ఎంసి పాలక మండలి సమావేశం రచ్చరచ్చగా సాగింది. సభ ప్రారంభానికి ముందు వందే మాతరం, జయజయహె తెలంగా రాష్ట్ర గీతంతో ప్రారంభించే ముందు సభ రసాబాస మొదలైందని, వందేమాతంను ఎంఐఎం సభ్యులు వ్యతిరేకిం చడంతో బిజెపి సభ్యులు వందేమాతరం ఆలపిస్తేనే ఈ దేశంలో ఉండాలని నినదించారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది. కౌన్సిల్ సమావేశానికి ముందే హాల్లో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ సభ్యుల ప్రదర్శించిన ఫ్లకార్డులను మార్షల్స్ లాక్కున్నారు. మార్షల్స్ హాల్ లోపటికి రావడంపై కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ ప్రారంభం అవ్వడానికి ముందే మార్షల్స్ హాల్‌లోకి ఎలా వస్తారని కార్పొరేటర్లు ప్రశ్నించారు. ప్రస్తుత పాలకవర్గం పూర్తి పదవీకాలానికి ముగింపు దశలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నగర అభివృద్ధికి సరికొత్త దశ,దిశ నిర్దేశించాం. హైదరాబాద్ అభివృద్ధి పట్ల అందరం కలిసి పని చేసిన ప్రతి క్షణం నాకు చిరస్మరణీయం. ఈ బాధ్యతను నాపై ఉంచిన ప్రజలకు, రాష్ట్ర ప్రభుత్వంకు, నాతో కలిసి నడిచిన మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. దాదాపు 5 ఏళ్లలో నగరంలో రోడ్లు, డ్రైనేజీ, ఫ్లైఓవర్లు, జంక్షన్ అభివృద్ధి వంటి ప్రాథమిక సదుపాయాల మరింత విస్తరించా మన్నారు. స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమం ద్వారా శుభ్రతలో కొత్త ప్రమాణాలు నెలకొల్పామని, థీం పార్కు, అర్బన్ ఫారెస్టులు, పచ్చదనం పెంపునకు ప్రత్యేక కృషి చేశామన్నారు. డిజిటల్ సర్వీసెస్, ముఖగుర్తింపు, కార్యాలయం మెరుగుతో నగర పాలనలో పారదర్శకత పెంపొందించే ప్రయత్నం చేసామన్నారు. మహిళలకు ఇందిరమ్మ క్యాంటీన్‌లు ఏర్పాటు చేశామని, పేద, మధ్య తరగతి ప్రజలు, నిరుద్యోగులు, చిరుద్యోగులకు రూ.5 బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను జిహెచ్ఎంసి విజయవంతంగా అమలు చేసిందన్నారు. ఈ విజయాలన్నీ మనందరి సమిష్టి కృషికి ప్రతీక అని, హైదరాబాద్‌ను దేశంలోనే మేటి నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనీస్తుందన్నారు. ఎటువంటి రాజకీయ భేదాలు లేకుండా నగరం కోసం పని చేసిన మీరు అందరూ ఈ సమావేశాన్ని అర్థవంతంగా జరగడానికి పూర్తి సహకారం అందించాలని ఆమె కోరారు. మనం వేసిన పునాది మీద భవిష్యత్తు తరాలు మరింతగా నగర అభివృద్ధికి కృషి చేస్తాయని, ఈ ప్రయాణంలో మీతో కలిసి పని చేయడం నాకు గౌరవంగా భావిస్తున్నాను. సహకరించిన కమిషనర్లు, ఉన్నతాధికారులు, పారిశుధ్య సిబ్బంది, ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సభ ప్రారంభానికి ముందు జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ ముజఫర్ హుస్సేన్‌కి ప్రకృతి కవి, 'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గీత రచయిత అందెశ్రీకి జీహెచ్ఎంసీ సర్వ సభ్య సమావేశం నివాళులు అర్పించింది.

జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిలు పాలవర్గ సభ్యులతో కలిసి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఆవరణలో గ్రూప్ ఫోటో దిగారు. దీనిని కౌన్సిల్ హాల్‌లో పెట్టనున్నారు. ప్రస్తుత పాలకవర్గం నుంచే ఇది ప్రారంభం కానుంది. జిహెచ్ఎంసి సాధారణ సమావేశం మంగళవారం ముఖ్యమైన తీర్మానం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 150 డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాల కోసం ఒక్కో వార్డు/డివిజన్‌కు రూ.2 కోట్లు కేటాయిస్తూ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఈ బడ్జెట్ కేటాయింపులో భాగంగా రూ.1 కోటి, కార్పొరేటర్ ప్రత్యక్షంగా ప్రతిపాదించే పనులకురూ.1 కోటి-జిల్లా ఇన్‌చార్జ్ మంత్రితో సమన్వయం చేస్తూ కార్పొరేటర్ ప్రతిపాదించే పనులకు మంజూరు చేయనున్నట్లు జిహెచ్ఎంసి స్పష్టం చేసింది. ఈ నిధులను రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు, కాలుష్య నియంత్రణ, వర్షపు నీటి కాల్వలు, పార్కులు, కమ్యూనిటీ హాల్స్, పబ్లిక్ సౌకర్యాల అభివృద్ధి వంటి అత్యవసర పౌర సదుపాయాల మెరుగుదలకు వినియోగించాల్సిందిగా సూచనలు జారీ అయ్యాయి. ఈ సందర్భంలో గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్ అభివృద్ధి, ప్రజల అవసరాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిధులను పారదర్శకంగా వినియోగిస్తామని తెలిపారు.. కాంగ్రెస్ ప్రభుత్వమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంతోనే ఈ బడ్జెట్‌కు శాంక్షన్ ఇవ్వడం వలన ఈ కేటాయింపు సాధ్యమైందని డిప్యూటీ మేయర్ ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో లేదా దానిని ఆనుకుని ఉన్న 27 మున్సిపాలిటీలను జిహెచ్ఎసిలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనకు జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపింది. గ్రేటర్‌లో విలీనం అయ్యే మున్సిపాలిలు పెద్ద అంబర్‌పేట్, జల్పల్లి, షంషాబాద్, తుర్కయాంజల్, మణికొండ, నర్సింగి, ఆదిబాట్ల, తుక్కుగూడ, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, బోలారం, తెల్లాపూర్, అమీన్పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జగీర్, మీర్‌పేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట్ మున్సిపాలిటీలున్నాయి. జీహెచ్ఎంసీ కౌన్సిల్ ఈ ప్రీయాంబుల్‌కు ఆమోదం తెలిపింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ... హైదరాబాద్‌లో పారిశ్రామిక స్థలాలు తక్కువ ధరకు ప్రభుత్వం అమ్ముతుందని, సీఎం రేవంత్ రెడ్డి, రియల్ ఎస్టేట్ మాఫియా భూ కుంభకోణంకు పాల్పడుతుందన్నారు. 5 లక్షల కోట్ల రూపాయల భూములు 5 వేల కోట్లకే అమ్మేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ స్థలాలు కాబట్టే మేము జీహెచ్ఎంసీలో నిలదీస్తున్నామని, అసెంబ్లీలో ఇదే అంశంపై ప్రశ్నిస్తామన్నారు. మెట్రో రైల్ భూములను కాజేయడానికి రేవంత్ రెడ్డి ప్లాన్ చేస్తున్నారని బిఆర్ఎస్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ఆరోపించారు. బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి మాట్లాడుతూ 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో కలపడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తుందని, వందేమాతరం గీతం ఆలపించిన సమయంలో కొందరు మజ్లిస్ కార్పొరేటర్లు కొందరు కూర్చొని ఉండడం దౌర్భాగ్యమన్నారు. వందేమాతర గీతాన్ని రెస్పెక్ట్ చేయని సభ్యులను పదేళ్లపాటు పోటీ చేయకుండా నిషేధించాలని, వందేమాతరం గీతం చట్ట వ్యతిరేకమా? సభలో అల్లా హు అక్బర్ అంటూ చిత్ర, విచిత్రంగా ప్రవర్తించారన్నారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, మంత్రులు తలసాని, సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దేసింగరాజు 98వ జన్మదినోత్సవం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: ఏఐటీయూసీ అనుబంధ రైల్వే యూనియన్ నాయకులు, సీఆర్ ఫౌండేషన్ శ్రేయోభిలాషి సి. దేసింగరాజు 98వ జన్మదినోత్సవ సందర్భంగా వారి నివాసంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు, సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, దృశ్యాలువతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పిజే చంద్రశేఖరరావు మాట్లాడుతూ సి. దేసింగరాజు జోస్యభట్ల సత్యనారాయణ, ఏవీఆర్ శర్మతో కలిసి ఏఐటీయూసీ అనుబంధ రైల్వే యూనియన్ అభివృద్ధికి కృషి చేశారన్నారు. సి. దేసింగరాజురాజు జన్మదినోత్సవ సందర్భంగా సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేసింగరాజు కేక్‌కట్ చేసి అందరికీ ఆశీస్సులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి కుమారులు విశ్వం, విజయ కుమార్, కోడళ్ళు ఝాన్సీ, శ్రీదేవి, కుమార్తెలు విమలాదేవి, లక్ష్మీదేవి, అల్లుడు బంగారు రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమానపనికి సమానవేతం ఇవ్వాలని వినతి

విశాలాంధ్ర, హైదరాబాద్ : టూరిజం కార్పొరేషన్లో 23 సంవత్సరాలుగా కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ పద్దతిలో ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరందరూ శాశ్వత ఉద్యోగులతో సమానంగా పనులు చేస్తున్నారు. కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు గతంలోనే సమానపనికి సమాన వేతనాలు ఇస్తామని యాజమాన్యం చెప్పింది. అది అమలు కావడం లేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వీరి వయోపరిమితి వయస్సు 61 సంవత్సరాలకు పెంచాలని, ఉద్యోగులు గత కొంతకాలంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో కాంట్రాక్టు ఉద్యోగులకు సమానంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం ఇవ్వడం లేదు. మానవతాదృక్పథంతో శాశ్వత ఉద్యోగుల మాదిరిగా సమానపనికి సమాన వేతనం ఇస్తూనే పదవీ విరమణ వయస్సును 61 సంవత్సరాలకు పెంచుటకు తగు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటియుసి) గౌరవ అధ్యక్షులు చాడ వెంకట్ రెడ్డి, అధ్యక్షులు వి.ఎస్.బోస్, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రాన్ని అందజేశారు.

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు : మహేందర్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రతి పథకంలో మహిళలను భాగస్వాములను చేయడమే కాకుండా వారిని ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు చేయూతగా మహిళా సంఘాల సభ్యులకు వడ్డిలేనిరుణాలను అందిస్తుందని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని శామీర్ పేట్ మండలం లోని శుభం కన్వెన్షన్ హాల్లో మేడ్చల్ నియోజక వర్గంకు చెందిన 3120 మహిళా సంఘాల సభ్యులకు రూ.2 కోట్ల 33 లక్షల వడ్డీలేని రుణాలను పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి చెక్కుల పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ మను చౌదరి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్టిఐ కమీషన్ సభ్యులు జైపాల్ రెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షులు అజేయ లక్ష్మి హాజరైనారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ మాట్లాడుతూ మహిళలు విద్యావంతులైతే తమ పిల్లలను తీర్చిదిద్దుకుంటారని, అందుకోసం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి, తద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేసుకున్నామన్నారు. మహిళలు అన్నిరంగాలలో రాణించాలని అందుకు అవసరమైన సహాయం ప్రభుత్వం అందిస్తున్నారు. మహిళలు అవకాశాలను ఉపయోగించుకొని రాజకీయ పరంగా ఎదగాలన్నారు. తెలంగాణ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ మహిళలు విద్యావంతులై అభివృద్ధి చెందితేనే ఆ సమాజం ఆ దేశం ఆ రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఇంటి పనులు వంట పనులు వీటికి తోడు అభివృద్ధి కోసం అయినా ఆర్థిక వ్యవహారాలలో మహిళలు ముందుకు రావాలని మల్లారెడ్డి తెలిపారు. మహిళలు

సైనికులుగా నిరంతరం కష్టపడుతూ పనిచేస్తారన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం ఏ ప్రణాళికను ప్రవేశపెట్టిన అందులో మహిళలను కేంద్రబిం దువుగా చేస్తుందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అభివృద్ధి పథంలో మహిళల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. మహిళా సంఘాలకు ఉండడంలోనే మీయొక్క శ్రద్ధ, నిబద్ధత తెలుస్తుందన్నారు. కొన్ని సార్లు కష్టాలు, సమస్యలు వచ్చిన నిరుత్సా హపడకుండా ధైర్యంగా సమస్యలను ఎదుర్కొవాలన్నారు. ప్రపంచంలోనే దేశ అధ్యక్షులు, పలు కంపెనీల సీఈవోలుగా మహిళలు ఉన్నారని, మహిళలతోనే కుటుంబాలు సమాజాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మహిళలు తమ ఉత్పత్తులకు పదును పెట్టి ప్రపంచ మార్కెట్లతో పోటీపడాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, శామీర్ పేట్ మండల తహసీల్దారు, డిఆర్డిఓ సాంబశివరావు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ హెరిటేజ్ రన్-2026

విశాలాంధ్ర- హైదరాబాద్ : హైదరాబాద్ మహానగర అపురూపమైన చరిత్రను, వాస్తు నిర్మాణ వైభవాన్ని, ఉజ్వలమైన స్ఫూర్తిని అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించడానికి హైదరాబాద్ హెరిటేజ్ రన్ (హెచ్‌హెచ్ఆర్)-2026ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ఈ కార్యక్రమ వివరాల్ని చారిత్రక తారామతి బారామతి వేదికగా మంగళవారం వెల్లడించారు. పర్యాటక, సాంస్కృతిక (క్రీడలు) శాఖ ఆధ్వర్యంలో రాపిడో టైటిల్ స్పాన్సర్‌గా ఈ చారిత్రక క్రీడా కార్యక్రమం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈవెంట్‌కు తెలంగాణ టూరిజం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (ఎస్‌ఏటిఎస్) సహకారం అందిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ మహానగర వైభవాన్ని, చారిత్రక ప్రాధాన్యతను ప్రపంచానికి చాటి చెప్పేందుకు తారామతి బారామతిని వేదికగా ఎంచుకున్నామని చెప్పారు. ఈ హైదరాబాద్ హెరిటేజ్ రన్ కేవలం ఒక పరుగు మాత్రమే కాదుబీ ఇది క్రీడలు, పర్యాటకం, సాంస్కృతిక గర్వానికి సంబంధించిన మహా వేడుక. 'చార్మినార్ నుంచి కుతుబ్ షాహీ సమాధుల వరకు' మార్గాన్ని సజీవ వారసత్వ కారిడార్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌ను వారసత్వ క్రీడా పర్యాటకానికి ప్రపంచ గమ్యస్థానంగా సుస్థిరం చేయాలనేదే మా లక్ష్యం అని అన్నారు. హైదరాబాద్ నగర వాసులు, యువత క్రీడాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని, హైదరాబాద్ హెరిటేజ్ రన్‌ను ఘనంగా విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతి వల్లూరు, హైదరాబాద్ ర్యాపిడో హెడ్ ఉమేష్, పాల్గొన్నారు.

హెరిటేజ్ రన్ వివరాలు...

నగర చరిత్రను ప్రత్యక్షంగా అనుభూతి చెందేలా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. ఫిబ్రవరి 1, 2026న 21కే హాఫ్ మారథాన్ ఐకానిక్ చార్మినార్ వద్ద మొదలై కుతుబ్ షాహీ సమాధుల వద్ద ముగుస్తుంది. మార్గంలో హైకోర్టు, సిటీ కాలేజ్, అసెంబ్లీ, గోల్కొండ కోట, తారామతి బారామతి వంటి ప్రధాన చారిత్రక ప్రదేశాలను చుట్టి వస్తుంది. 5కే, 10కే రన్ చారిత్రక కుతుబ్ షాహీ సమాధుల వద్ద ప్రారంభమై అక్కడే ముగుస్తుంది.

సింగరేణిలో 'సోలార్ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్'

విశాలాంధ్ర, హైదరాబాద్ : పగటిపూట ఉత్పత్తి జరిగే సోలార్ విద్యుత్తులో వినియోగించబడని విద్యుత్తును ఉచితంగా గ్రిడ్‌కు సరఫరా చేయకుండా, బ్యాటరీలో నిలువ చేసుకొని, అవసరమైనప్పుడు వాడుకునే అవకాశం కలిగించే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను రాష్ట్రంలోనే తొలిసారిగా సింగరేణిలో ప్రారంభించనున్నారు. పునరుత్పాదక విద్యుత్తు పెంపుదలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చేస్తున్న విశేషమైన కృషిలో భాగంగా సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియాలో తన 28 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌కు అనుబంధంగా ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ను ఇటీవల ఏర్పాటు చేసింది. ఇది ఒక మెగావాట్ సామర్థ్యం కలిగిన ప్రయోగాత్మక ప్లాంట్. దీనిని రెండు మూడు రోజుల్లో ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

బీఈఎస్ఎస్ ఎందుకు? ఉపయోగం ఏమిటి?...

రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్తుకు అందిస్తున్నప్రోత్సా హాన్నిఅందిపుచ్చుకొని సింగరేణితో సహాపలు రాష్ట్ర సంస్థలు సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. సింగరేణి సంస్థ ఇప్పటికే తన ఏరియాల్లో 245.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. ఇవి సమర్థంగా పనిచేస్తూ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ విధంగా ఉత్పత్తి చేసే విద్యుత్తును తెలంగాణ ట్రాన్స్ కో గ్రిడ్ ద్వారా అనుసంధానం చేసి సరఫరా చేస్తున్నారు. అయితే సింగరేణిలో డిమాండ్‌లేని సమయాల్లో ఉత్పత్తి అవుతున్నసోలార్ విద్యుత్‌ను గ్రిడుకు ఉచితంగా సరఫరా చేయడం జరుగుతోంది. ఇలా మిగిలిపోయిన సోలార్ విద్యుత్తును పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ద్వారా నిల్వ చేసి గరిష్ట విద్యుత్ వినియోగం ఉండే సమయంలో కంపెనీ అవసరాలకు వినియోగించడం జరుగుతుంది. సాంకేతికపరంగా బీఈఎస్ఎస్ అత్యాధుని కమైన సోలార్ విద్యుత్తు నిల్వ, పొదుపు వ్యవస్థగా పేర్కొనవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం వారు త్వరలో పెద్ద ఎత్తున సుమారు 250 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సంకల్పించిన నేపథ్యంలో మందమర్రిలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 1 మెగావాట్ బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ ఒక తొలి అడుగుగా భావించవచ్చు. సుమారు 2.73 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ వలన సింగరేణి సంస్థ ఏడాదికి సుమారుగా వినియోగించబడని 9.1 లక్షల యూనిట్ల సోలార్ విద్యుత్తును సద్వినియోగం చేసుకుంటూ రూ. 70 లక్షల వరకు ఆదా చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. రాష్ట్రంలో అనేక సోలార్ విద్యుత్తు ప్లాంట్లు ఉన్నప్పటికీ తొలిసారిగా బీఈఎస్ఎస్ ఏర్పాటు చేసే అవకాశం తమకు కల్పించినందుకు సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లులకు తమ ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో సింగరేణి వ్యాప్తంగా అనువైన చోట్ల ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

శాంతియుత వాతావరణంలో ఉర్సు ఉత్సవాలు : ఏసీపీ

విశాలాంధ్ర- కొత్తూరు: త్వరలో జరగబోయే హజరత్ జహంగీర్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలను గ్రూపులుగా ఏర్పడకుండ హిందువులు, ముస్లింలు స్నేహ భావంతో కలిసిమెలిసి శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని శంషాబాద్ ఏసిపి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మంగళవారం కొత్తూరు సీఐ నర్సయ్య ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఇనుముల్ నర్వ పంచాయతీ పరిధిలోగల మతసామరాస్యానికి ప్రతీకగా నిలిచిన హజరత్ జహంగీర్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా స్థానికులతో కలిసి దర్గా ఆవరణలో ఏర్పాటుచేసిన శాంతి సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల చరిత్ర గల పవిత్రమైన హజరత్ జహంగీర్ పీర్ దర్గాకు కుల మతాలకు అతీతంగా హిందువులు, ముస్లింలు ఈ ప్రాంతమే కాకుండ ఇతర ప్రాంతాలనుండి పెద్ద సంఖ్యలో వచ్చి ఇక్కడ మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఈ దర్గాకు ముస్లింల కంటే హిందువులే ఎక్కువ సంఖ్యలో వచ్చి దర్శించుకుంటారు. ఇక్కడ ప్రతి ఏటా నిర్వహించే ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఈసారి జరిగే ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అందరూ స్నేహ భావంతో కలిసిమెలిసి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. అదేవిధంగా సమస్యలు, పరిష్కారం రెండు మీ దగ్గరే ఉన్నాయి కాబట్టి ముందుగా సమస్యలను గుర్తించి తమ దృష్టికి తీసుకువస్తే స్థానికుల సహకారంతో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అత్యవసరం ఉంటేనే 100 నెంబర్‌కి డయల్ చేయాలి తప్ప కొందరు వ్యక్తులు అవసరం లేకపోయినా ఫోన్ చేయడంతో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి న్యాయం జరగడం లేదని ఆయన గుర్తుచేశారు. ఈ సమావేశంలో కొందరు స్థానికులు మాట్లాడుతూ దర్గాకు కోట్లల్లో ఆదాయం ఉన్న భక్తులకు కనీస సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని మండిపడ్డారు. దర్గా అభివృద్ధిపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. దర్గా పరిసరాల్లో రోడ్లు సరిగా లేనప్పటికీ ఓవర్ లోడ్ తో టిప్పర్ లారీలు వేగంగా వెళ్లడంతో ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగాయని వివరించారు. ప్రమాదాల నివారణకు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని, దర్గా ఆవరణలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసి శాంతి భద్రతలపై దృష్టి సారించాలని ఏసీపీ దృష్టికి తెచ్చారు. దర్గా పరిసరాల్లో మద్యం, గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సత్యశీలా రెడ్డి, గోపాలకృష్ణ, నాయకులు ఆగిరి రవికుమార్ గుప్తా, రషీద్ ఖాన్, ఖాజు, లింగం నాయక్, గోపాల్ నాయక్, రాజేష్ నాయక్, షకీల్, రవికుమార్ ముదిరాజ్, జిలాని, షౌకత్, మహేష్, జహంగీర్, సాదెక్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

విశాలాంధ్ర మొయినాబాద్: రోడ్డు రవాణ శాఖ నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా రోడ్డు రవాణ శాఖ సీఐ నవీన్ హెచ్చరించారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పోలీస్‌స్టేషన్ ముందు ఆర్టీఓ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రైవేటు కళాశాలలకు చెందిన బస్సుల్లో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు ఎక్కించుకొని తీసుకువెళు న్న బస్సులకు జరిమాన విధించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆర్టీఓ సీఐ నవీన్ మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలకు చెందిన బస్సులు నిబంధనలు పాటించాలని ఫిట్నెస్ సరిచూసుకొని రోడ్డుపై ప్రయాణించాలని.. అదే విధంగా ప్రైవేటు బస్సుల్లో ప్రమాదాలు జరిగే సమయంలో ఎమెర్జెన్సీ తలుపులు తెరిచే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బస్సుల్లో విద్యార్థులను ఎక్కించాలని తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు రాక పోకలు చేసే వాహనాలు ఖచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆర్టీఓ అధికారులకు సహకరించి రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేయాలని తెలిపారు.

'యూనిటీ మార్చ్'కు రాజు, అవినాష్‌రెడ్డి ఎంపిక

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: 'యూనిటీ మార్చ్' కోసం రాజు శెట్టి కురుమ, అవినాష్ రెడ్డి ఎంపిక యువజన శక్తి, జాతీయ ఏకతను ప్రతిబింబించే ప్రతిష్టాత్మక 'యూనిటీ మార్చ్'కు రంగారెడ్డి జిల్లా నుంచి రాజు శెట్టి కురుమా మరియు అవినాష్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. దేశం యొక్క గొప్ప సంస్కృతి, సంప్రదాయ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' సందేశంతో ఈ యాత్ర చేపట్టబడుతోంది. ఈ ప్రతిష్టాత్మక మార్చ్ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో జరుగనుంది. ఈ యాత్రకు మరింత ప్రతిష్టను తీసుకురావడానికి, పాల్గొనబోయే యువతతో పాటు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు కూడా భాగస్వామ్యం కానున్నారు. దీనివల్ల దేశ వ్యాప్తంగా యువతకు ఇది అరుదైన, జీవితాంతం గుర్తుండిపోయే అవకాశం అవుతుంది. రంగారెడ్డి జిల్లాను ప్రాతినిధ్యం వహిస్తూ ఎంపికైన రాజు శెట్టి కురుమ మరియు అవినాష్ రెడ్డి, ఈ అవకాశంపై ఆనందం వ్యక్తం చేస్తూ, జాతీయ ఏకత సందేశాన్ని ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు.

చెరువుకు కొత్త కళ

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: పర్యావరణ పరిరక్షణ శిక్షణ-పరిశోధన సంస్థ ఈపిటిఆర్ఐలో చెరువు పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. హైదరాబాద్ మెట్రోపాలిటన్ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులతో చెరువు పూర్తిగా కొత్త రూపు దాల్చింది. ముందుగా చెరువులోని మట్టిని తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచగా, చుట్టూ నడకమార్గాలు నిర్మించడం వల్ల ఉదయం-సాయంత్రాల్లో సహజ వాతావరణంలో నడకకు అనువైన ఏర్పాట్లు కలిశాయి. నీటి నాణ్యత మెరుగుపడేందుకు ఏరేటర్లు ఏర్పాటు చేసి, చెరువు ఒడ్డున బెంచీలు, చెత్తబుట్టలు అమర్చారు. పచ్చదనం కోసం విస్తృతంగా మొక్కలు నాటడంతో ప్రాంగణం మొత్తం హరిత వాతావరణంతో కళకళలాడుతోంది. మార్గాలంతా సంప్రదాయ రంగోలులతో అలంకరించడంతో క్యాంపస్‌కు కొత్త శోభ వచ్చి చేరింది. జీవవైవిధ్యాన్ని పెంపొందించేందుకు చేపల రకాలను కూడా వదిలారు. ఈ అభివృద్ధి మొత్తం గచ్చిబౌలిలోని ఈపిటిఆర్ఐ క్యాంపస్ సౌందర్యాన్ని మరింత పెంచింది. పునరుద్ధరించిన చెరువును రాష్ట్ర పర్యావరణ-అడవులు, విజ్ఞాన శాఖ ప్రధాన కార్యదర్శి మరియు ఈపిటిఆర్ఐ డైరెక్టర్ జనరల్ అహ్మద్ నదీం ప్రారంభించి చేపట్టిన పనులను సమీక్షించారు. అనంతరం పర్యావరణ అవగాహన, సామర్థ్యాభివృద్ధిపై ప్రత్యేక సంచికను విడుదల చేసి, ఈపిటిఆర్ఐ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రతిబింబించే ప్రదర్శన స్టాల్‌ను ప్రారంభించారు. చెరువు పునరుద్ధరణతో నీటి సంరక్షణకు కొత్త దారి పడిందని, పచ్చదనం పెరిగి క్యాంపస్ మొత్తం సహజ వాతావరణానికి చిరునామాగా మారిందని అధికారులు పేర్కొన్నారు.

లా కళాశాల భవనాలకు శంకుస్థాపన

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగరంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలో విద్యా మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా నూతనంగా నిర్మించనున్న ఇంజనీరింగ్ లా కళాశాల భవనాలకు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణతో కలిసి శంకుస్థాపన చేసి భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సదుపాయాలతో నిర్మించనున్న ఈ భవనాలు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యవంతమైన విద్యావాతావరణాన్ని అందిస్తాయని తెలిపారు. మహబూబ్‌నగర్ ప్రాంతాన్ని విద్యా హబ్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఉస్మానియా, కాకతీయ, సెంట్రల్ విశ్వవిద్యాలయాల స్థాయిలో నిలిపేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎంపి మాట్లాడుతూ ఇంజనీరింగ్, లా విద్యలో నాణ్యత పెంపొందించడమే లక్ష్యంగా మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు వసతి గృహాల నిర్మాణం కూడా చేపడుతున్నామని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి గోనెల శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి జీఎన్ శ్రీనివాస్, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తెలుగు గూడెం గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్ష సాకారమైందని గౌరవ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కోటి రూపాయల సీఆర్ఆర్ నిధులతో నూతనంగా నిర్మించిన బిటి రోడ్డును ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు గూడెంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ రోడ్డు నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో రైతులు నివసిస్తున్న నేపథ్యంలో, వారు పండించిన ధాన్యాన్ని మార్కెట్‌కు సులభంగా తరలించేందుకు మెరుగైన రవాణా సదుపాయాలు అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. తెలుగు గూడెం, ఇప్పలపల్లి, జమిస్తాపూర్ గ్రామాల రైతులు మరియు స్థానిక ప్రజలకు ఈ నూతన బిటి రోడ్డు ఎంతో ఉపయోగకరంగా నిలవనుందని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రామచంద్రయ్య, మాధవరెడ్డి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, ఖాజా , మల్లు అనిల్ రెడ్డి, గోవింద్ యాదవ్, తెలుగు గూడెం ఆంజనేయులు, జన్ను సురేందర్, పోతన్పల్లి మోహన్ రెడ్డి, నాగయ్య ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంభనకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే

విశాలాంధ్ర,షాద్‌నగర్, రూరల్: మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారత కోసం తీసుకుంటున్న పలు సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే శంకర్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నిలిపివేసిన వడ్డీ లేని రుణాల పథకాన్ని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పునరుద్ధరించిందని, రాష్ట్రవ్యాప్తంగా ఇటీవలి కాలంలోనే రూ.304 కోట్లు విడుదల చేసి మహిళా సంఘాల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ మహిళా సమైక్య సంఘాలకు మొత్తం రూ.3,48,68,500 నిధులు జమయ్యాయని తెలిపారు. ఈ నిధులతో మహిళలు చిన్నతరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టి ఆర్థికంగా బలపడే అవకాశం ఉందన్నారు. రుణాలపై వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తోందని వివరించారు. దేశ చరిత్రలో అజరామరమైన నేత ఇందిరా గాంధీ సేవలను స్మరించారు. మహిళల అభ్యున్నతే రాష్ట్ర ప్రగతికి పునాది అని పేర్కొంటూ నైపుణ్యాభివృద్ధి చిన్న వ్యాపారాల విస్తరణ, సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల కోసం ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, చీరలు వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తోందని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు అండగా నిలబడలేదని వారికి కేటాయించిన నిధులను అనేకంగా దోచుకొని దాచుకున్నారని ఎమ్మెల్యే అన్నారు. కెసిఆర్ కుటుంబ సభ్యురాలు అయిన కూతురే స్వయంగా టిఆర్ఎస్ దోపిడీ గురించి వివరిస్తుందని ఈ విషయాలను మహిళలు గ్రహించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించిన మహిళలకు వారి రుణం తీర్చుకునేందుకు నేడు ఈ రుణాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరిత, మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, తహసిల్దార్ నాగయ్య, ఆయా మండలాల ఎంపీడీవోలు,స్వయం సహాయక మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకులు నరసింహారెడ్డి మృతి

విశాలాంధ్ర, హైదరాబాద్ : భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ కామారెడ్డి జిల్లా మాజీ జిల్లా కార్యదర్శి. మరియు ఏఐటీయూసీ రాష్ట్ర సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది వి ఎల్ నరసింహారెడ్డి నిన్న రాత్రి 10 గంటల 30 నిమిషాలకు గుండెపోటుతో మృతి చెందారు. కామారెడ్డి ఉమ్మడి నిజాంబాద్ జిల్లా నిరుపేద కార్మిక వర్గం కోసం 40 సంవత్సరాలుగా నిరంతరం ప్రజల కోసమే పోరాటాలు చేసిన చరిత్ర ఆయనది. ఉమ్మడి నిజాంబాద్ జిల్లా ఆర్మూర్. రంగాచారి కాలనీ కామారెడ్డిలో పనిహారం రంగాచారి కాలనీ 31 చేరాయిలో హమాలీలకు ఇళ్ల స్థలాలు, పోరాటాల ద్వారా ఏదైనా సాధించుకోవచ్చని నమ్మిన సిద్ధాంతాలను కట్టుబడి చివరి శ్వాస వరకు అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొని నిస్వార్థంగా పనిచేసిన వ్యక్తిని కోల్పోవడం భారత కమ్యూనిస్టు పార్టీ కామారెడ్డి జిల్లా కమిటీ. ఏఐటియుసి కామారెడ్డి జిల్లా కమిటీ..కామారెడ్డి సిపిఐ జిల్లా కార్యదర్శి. ఎల్ దశరథ్ సంతాపం తెలియజేశారు.

నరసింహారెడ్డి మృతికి కూనంనేని సంతాపం

సీపీఐ కామారెడ్డి జిల్లా మాజీ జిల్లా కార్యదర్శి. మరియు ఏఐటీయూసీ రాష్ట్ర సీనియర్ నాయకులు వి.ఎల్ నరసింహారెడ్డి గుండెపోటుతో మరణించడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆయన మృతి పట్ల సిపిఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ నుండి ప్రగాఢ సంతాపాన్ని ఆయన తెలిపారు. ఉమ్మడి నిజామాబాదు జిల్లాలో కార్మికులు, పేద ప్రజల అభ్యున్నతి కొరకు అనేక పోరాటాలు చేశారని ఆయన తెలిపారు. నరసింహారెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతిని కూనంనేని తెలిపారు.

పల్లా వెంకట్ రెడ్డి సంతాపం

నరసింహారెడ్డి మృతి పట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి సంతాపాన్ని తెలియజేశారు. ఆయన మరణం నిజామాబాద్ జిల్లా సిపిఐ పార్టీకి, ఏఐటీయూసీకి తీరని లోటని వారు తెలిపారు. న్యాయవాదిగా కూడా పని చేశారని, ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేశారని పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. వి ఎల్ నరసింహారెడ్డి మృతి పట్ల సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఎల్ నరసింహారెడ్డి మరణం పట్ల ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ సంతాపం తెలిపారు. నరసింహారెడ్డి ఉద్యమంలో వృత్తిలో సహచరుడని అన్నారు. పేద ప్రజల కోసం చివరి శ్వాస వరకు కృషిచేసిన మంచి కమ్యూనిస్టు పార్టీ నాయకులని వారు తెలిపారు. డెమొక్రటిక్ లాయర్స్ అసోసియేషన్ తోపాటు ఐఏఎల్‌లో చాలా కాలం పాటు క్రియాశీలకంగా పని చేశారని ప్రభాకర్ తెలిపారు.

నిరుపేదలకు తీరనిలోటు పశ్యపద్మ

వి ఎల్ నరసింహారెడ్డి పిన్న వయస్సు నుండి వామపక్ష భావాలకు ఆకర్షితుడై విద్యార్థి ఫెడరేషన్‌లో పనిచేశారు. ఢిల్లీ యూనివర్సిటీలో లా గ్రాడ్యుయేట్ అయ్యారు. ఢిల్లీ విద్యార్థి ఫెడరేషన్‌లో కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. ప్రముఖ లాయరుగా, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, కామారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శిగా పనిచేశారు. అనేకమంది నక్సలైట్ ఉద్యమంలో పనిచేసి బయటికి వచ్చిన యువకులకు అండగా నిలిచాడు. కామారెడ్డి జిల్లాలో అనేక శాఖలలో పార్టీ నిర్మాణానికి పూనుకున్నారు. ప్రజా నాయకుడిగా ఎదిగాడు. వి.యల్ నరసింహారెడ్డిగారు కష్టజీవులకు అండగా నిలబడి సహాయ సహకారాలు అందించారు.వి ఎల్ నరసింహారెడ్డి మరణం కష్టజీవులు అందరికీ తీరని లోటు. వారికి విప్లవ జోహార్లు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజే చేస్తున్నాను.

ఈశాన్య రాష్ట్రాల పురోగతిలో భాగస్వామ్యం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆశాజనక వృద్ధి కేంద్రాలుగా మారుతున్న ఈశాన్య రాష్ట్రాల పురోగతిలో భాగస్వామ్యం అయ్యేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. డిజిటల్ కనెక్టివిటీ, ఎంటర్ప్రెన్యూర్‌షిప్, టెక్నాలజీ, స్కిల్ డెవలప్ మెంట్, లైఫ్ సైన్సెస్, బయో ఇన్నోవేషన్, రూరల్ గ్రోత్ తదితర రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యానికి సమగ్ర రోడ్ మ్యాప్ ను రూపొందిస్తామన్నారు. మంగళవారం రాజ్ భవన్ లో నిర్వహించిన "తెలంగాణ - నార్త్ ఈస్ట్ కనెక్ట్(ఫేజ్ -2)" ప్రారంభోత్సవంలో ఆయన విశిష్ఠ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... ప్రాంతం, రాష్ట్రంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ అక్కున చేర్చుకునే గొప్ప మనస్సు తెలంగాణ ప్రజలది అని వివరించారు. కనెక్టివిటీ, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ లాంటి సవాళ్లను సైతం అధిగమించి డిజిటల్ అక్షరాస్యత, ఐటీ స్కిల్లింగ్, ఫిన్ టెక్, డిజిటల్ సర్వీస్ లను ఈశాన్య రాష్ట్రాలు అందిపుచ్చుకుంటున్నాయన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, భావితరాల అవసరాలకు అనుగుణంగా నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ఆ దిశగా రేపటి తెలంగాణ కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ యూనివర్సిటీ, ఏఐ సిటీ, దేశంలోనే తొలి ఏఐ ఆధారిత డేటా ఎక్స్ ఛేంజ్, ఏఐ ఇంటిగ్రేటెడ్ అకడమిక్ కరిక్యులం... కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ హబ్ గా మార్చుతాయన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో స్టార్టప్ లను ప్రోత్సహించేందుకు టీ హబ్ తరహాలోనే "వన్ బయో" పేరిట ప్రత్యేక ఇంక్యుబేషన్ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. 2047 నాటికి "భారత్" సూపర్ పవర్ గా మారాలంటే దేశంలోని ప్రతి ప్రాంతం ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. కలిసి ఎదగాలన్నదే తమ ప్రభుత్వ అభిమతమన్నారు. రాబోయే రోజుల్లో నార్త్ ఈస్ట్ తెలంగాణ టెక్ కారిడార్, జాయింట్ ఇన్నోవేషన్ ల్యాబ్స్, బయో ఇంక్యుబేటర్స్ క్రియేటివ్ టెక్ స్టూడియోలు, గ్రీన్ ఎనర్జీ కొలాబరేషన్స్ తదితర అంశాల్లో ఈశాన్య రాష్ట్రాలతో కలిసి పనిచేస్తామన్నారు.

నెహ్రూ జూలాజికల్ పార్కుకి ఐఎస్ఓ సర్టిఫికేషన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్కుకి ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికేషన్ లభించింది. అయితే, ఈ సర్టిఫికేషన్ ను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ చేతుల మీదుగా నెహ్రూ జులాజికల్ క్యూరేటర్ వసంతకు మంగళవారం తెలంగాణ సచివాలయంలో అందజేశారు. హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్క్ వరుసగా ఆరు సంవత్సరాలు ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికేషన్ పొందిన దేశంలోనే మొట్టమొదటి జూ అని మంత్రికి జూ ముఖ్య అధికారి వసంత తెలిపారు. ఐఎస్ఓ 9001 సర్టిఫికేట్ నాణ్యతా నిర్వహణ ప్రమాణాలను నిర్ధారిస్తుందని చెప్పారు. వీటిలో జూస్ స్థిరమైన సేవా నాణ్యత, సమర్థవంతమైన, పారదర్శక అంతర్గత ప్రక్రియలు, జంతు సంరక్షణ, పెంపకంలో అనుసరించే ప్రామాణిక విధానాలు, టికెటింగ్ మరియు సందర్శకుల సేవలు, అత్యవసర ప్రతిస్పందన మరియు సిబ్బంది శిక్షణ మరియు నైపుణ్యాభివృద్ధి ఇక్కడ ఉన్నాయని వివరించారు. ఏ జూకైనా ఐఎస్ఓ 14001 సర్టిఫికేషన్లు పొందడం ఒక పెద్ద విజయం అని చెప్పుకొచ్చారు. ఇది జూ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన పర్యావరణ నిర్వహణ ప్రమాణాలకు అనుగుణంగా ఉందని సూచిస్తుందన్నారు. ఐఎస్ఓ 14001: హైదరాబాద్ జూ అందుకున్న పర్యావరణ నిర్వహణ వ్యవస్థ వ్యర్థాల ఉత్పత్తిని పర్యవేక్షించడం, తగ్గించడం, శక్తి, నీటి వినియోగం, కార్బన్ పాదముద్ర, నివాస నిర్వహణ, కాలుష్య నియంత్రణ, బాధ్యతాయుతమైన వనరుల వినియోగం మరియు పరిరక్షణ, పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించ డంలో జంతుప్రదర్శనశాలల నిరంతర ప్రయత్నాలను సూచిస్తుందన్నారు. జూ నిర్వహణకు జూ 5-స్టార్ రేటింగ్‌ను కూడా పొందిందని, ఇది జూ పొందగలిగే అత్యున్నత గుర్తింపులలో ఒకటి అన్నారు. ఈ ధృవపత్రాలు హైదరాబాద్ జూను దేశంలోని ఇతర జూలకు ఒక బెంచ్‌మార్క్ సంస్థగా, జంతు సంక్షేమం, పరిరక్షణ మరియు నిర్వహణలో అగ్రగామిగా, ప్రజా ప్రతిష్ట మరియు విశ్వసనీయతను పెంచడానికి, సందర్శకులు, దాతలు మరియు ప్రభుత్వ సంస్థలలో తుష్ప పట్టడానికి, సీఎస్ఆర్ మద్దతుకు అవకాశాలు, అంతర్జాతీయ సహకారాలు మరియు పరిరక్షణ ప్రాజెక్టులు మొదలైన వాటికి నిలయంగా నిలబెడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ 1963 అక్టోబర్ 6న ప్రారంభించబడి, వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. ఇది భారతదేశంలోని అతిపెద్ద జూలలో ఒకటి, ప్రపంచవ్యాప్తంగా 30 లక్షలకు పైగా సందర్శకులను ఆకర్షిస్తుందని మంత్రికి వివరించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కమిషనర్

విశాలాంధ్ర-దుండిగల్: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం దుండిగల్ మున్సిపల్ పరిధిలో వేస్ట్ మడ్ ఆయిల్ షాపు పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మైంటైన్ చేస్తున్న వారికి గుర్తించి రూ.5000 జిరిమానా విధించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ మాట్లాడుతూ దుకాణాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, వర్కర్లకి మాస్క్,షూ,హ్యాండ్ గ్లౌస్ మొదలైన పి పి టి కిట్లు ధరించాలని సూచించారు.వ్యాపారాలు చేసేవాళ్లు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని,మీ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ సుభాష్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబుని కలిసిన కాంగ్రెస్ నేతలు

విశాలాంధ్ర-దుండిగల్: మంగళవారం మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించిన సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఇంచార్జ్,ఐటి శాఖ మంత్రి దూదిళ్ల శ్రీధర్ బాబుని మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ సెక్రటేరియట్ లో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి,కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, కూకట్ పల్లి ఇంచార్జి బండి రమేష్,టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్స రెడ్డి బూపతి రెడ్డి,బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరెకపూడి గాంధీకి ఎక్సైజ్ సిబ్బంది శుభాకాంక్షలు

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గపరిధిలో కొత్తగా కొండాపూర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ మంజూరు చేసిన శుభసందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని వారి కార్యాలయంలో మర్యాదపూర్వ కంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఎక్సైజ్ సూపర్డెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్ గౌడ్ , ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గపరిధిలో కొత్తగా కొండాపూర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ మంజూరు చేసిన శుభసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను అని, మాధకద్రవ్యాలను అరికట్టడి చేసే దిశగా ఎక్సైజ్ శాఖను మరింత బలోపేతం చేస్తున్నామని, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది రిక్రూట్మెంట్ తో పాటుగా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని గాంధీ తెలిపారు. ఆదాయం కాదు ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవితం అందించడానికి కృషి చేస్తున్నాం అని, డ్రగ్స్‌ను అరికట్టాలని, ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రజల బాగు కోసం నిరంతరం కృషి చేయాలని చైర్మన్ గాంధీ తెలిపారు.

న్యాయవాదుల సంక్షేమమే ప్రధాన ఎజెండా

విశాలాంధ్ర ఖమ్మం లీగల్ : ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ తొండపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది వి. రఘునాథ్ సమావేశంలో పాల్గొని ఖమ్మం బార్ ను ఉద్దేశించి , మాట్లాడారు. బార్ కౌన్సిల్ అన్ని సమయాల్లో న్యాయవాదుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని, యువ న్యాయవాదులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం, హెల్త్ కేర్ బెనిఫిట్స్ కోసం, న్యాయవాదుల రక్షణ చట్టం కోసం ముందు ఉండి పని చేయల్సిన అవసరం ఉందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో న్యాయవాదుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్న బార్ కౌన్సిల్ మెంబర్ లను ఎన్నుకోవాలి అని పిలుపునిచ్చారు . రాబోయే ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి బార్ కౌన్సిల్ మెంబర్ గా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. బార్ , బెంచ్ మధ్య గల సంబంధాన్ని ఆరోగ్యకరంగా ఉండే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు.మహిళా న్యాయవాదులకు బార్ కౌన్సిల్ లో తగిన స్థానం కల్పించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా సీనియర్ న్యాయవాదులు గద్దల దిలీప్, విప్లవ కుమార్, తిరుమల్ రావు, ఖాదర్బాషా , .పట్టాభి ,ఓరుగంటి శేషగిరిరావు ,మహిళా న్యాయవాదులు శిరీషా, దేవరకొండ కల్యాణి, యువ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికీ 10 ఏళ్ళు జైలు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : గంజాయి కేసులో ఇద్దరు వ్యక్తులకు పది ఏళ్ళ వరకు జైలు శిక్ష పడింది. పైగా దోషులకు చెరొక రూ. 1లక్ష జరిమానా కూడా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి (ఎన్.డి.పి.ఎస్.స్పెషల్ జడ్జ్) ఎస్. సరిత మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాచలం టౌన్ అప్పటి సబ్ ఇన్స్పెక్టర్ బి. మహేష్ 2020 ఏడాది సెప్టెంబర్ 15 న ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీ చేయుచుండగా టాటా కంపెనీ మినీ గూడ్స్ వ్యాన్ లో 10 ప్లాస్టిక్ పాకిట్లలో 226.500 కిలోలు గంజాయి పట్టుకున్నారు. మొత్తం దాని విలువ రూ.33 లక్షల 97,250 గా నిర్ధారించారు. ఒడిస్సా రాష్ట్ర మల్కాన్ గిరి జిల్లాకు చెందిన సుజిత్ గోల్డర్, మనోజిత్ రాయి లను అదుపులోకి తీసుకొని వారిపై అప్పటి ఇన్స్పెక్టర్ టి స్వామి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసారు. కోర్టులో ముగ్గురు సాక్షులను విచారించారు. సుజిత్ గోల్డర్, మనోజిత్ రాయ్ పై నేరం రుజువు కాగా ఇద్దరికీ పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించారు. ఈ ప్రాసిక్యూషన్ ను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వి.డి.లక్ష్మి నిర్వహించారు. కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్సై డి. రాఘవయ్య, లైజాన్ ఆఫీసర్ ఎస్. వీరభద్రం, పి.సీ. సుధీర్ బాబులు సహకరించారు.

ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటు

పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్లు, జలరవాణా, గిడ్డంగులు అనుసంధానం

పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీ లింక్) ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సచివాలయంలో మంగళవారం జరిగిన సమీక్షలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధ్వర్యంలో పనిచేసే హోల్డింగ్ కంపెనీ తరహాలో ఏపీ-లింక్ వ్యవహరించనుంది. మొత్తంగా ఐదు రంగాలను ఈ కార్పొరేషన్ అనుసంధానించనుంది. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రోడ్లు, అంతర్గత జలరవాణా, గిడ్డంగులను అనుసంధానిస్తూ లాజిస్టిక్స్ వ్యయం తగ్గించడంతో పాటు... ఆ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా ఏపీ లింక్ బాధ్యత తీసుకోనుంది. ఇక రాష్ట్రంలోని లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు, సమన్వయం, పర్యవేక్షణకు ఏపీ లింక్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఈ కార్పొరేషనుకు ఓ ఎండీ, వివిధ అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, సలహా కమిటీ, క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులను అమలు చేయడానికి జిల్లా స్థాయి సెల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ వివరాలను ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీ లింక్ ద్వారా లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చూడాలని... అలాగే క్షేత్ర స్థాయిలో వివిధ రంగాలకు అవసరమైన లాజిస్టిక్స్ అందించే విషయంలో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

అన్ని హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు

ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో తనిఖీలను మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు తమ విధి నిర్వహణలో భాగంగా చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు... రెసిడెన్షియల్ స్కూళ్లలోని నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఇతర సదుపాయాలపై సీఎం సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... "సంక్షేమ శాఖ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో పారిశుద్ధ్యం నూటికి నూరు శాతం నిర్వహించాలి. చిన్న పొరపాటు జరిగినా సహించేది లేదు. ఇటీవల హాస్టళ్లలో జరిగిన తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకూడదు. అలాంటివి పునరావృతమైతే నేరుగా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. 20 శాతం హాస్టళ్లలో టాయిలెట్ల నిర్మాణం ఇంకా జరపాల్సి ఉంది. ఈ టాయిలెట్ల నిర్మాణం కోసం అవసరమైన రూ.40 కోట్లు విడుదల చేస్తాం. టాయిలెట్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. ఆర్వో ప్లాంట్లు, టాయిలెట్లు లేకుండా హాస్టళ్లు ఉండడం సరి కాదు. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం వల్ల ఇవన్నీ జరిగాయి. ఆర్వో ప్లాంట్లు లేని ప్రతి హాస్టల్లోనూ... ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలి. డాక్టర్లతో విద్యార్థులకు రెగ్యులర్ హెల్త్ చెకప్స్ చేయించాలని, హాస్టళ్లలో పరిస్థితి పరిశీలించేందుకు క్షేత్రస్థాయి పర్యటనల చేపట్టడంతో పాటు...పరిస్థితులపై నిత్యం టెలికాన్ఫరెన్స్ నిర్వహించుకోవాలి" అని సీఎం మార్గనిర్దేశనం చేశారు. మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గుమ్మడి సంధ్యారాణి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పంచాయతీ రాజ్, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు పాలకులు దాసోహం

మావోయిస్టులతో చర్చలు జరపాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

విశాలాంధ్ర-కాకినాడ: కార్పొరేట్ కంపెనీల లాభాల కోసమే ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, సహజ సంపదను ఎడాపెడా దోచిపెడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య విమర్శించారు. చర్చల కోసం ముందుకొచ్చిన మావోయిస్టులను పట్టుకొని కాల్చిచంపడం తగదన్నారు. తెలంగాణ మాదిరిగా రాష్ట్రంలో కులగణన నిర్వహించి... స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈశ్వరయ్య స్థానిక హోటల్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ అడవులు, గనులు, ఇతర సహజ సంపదను అప్పగిస్తోందని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పనిచేస్తారన్న భయంతోనే మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చిచంపుతున్నారని ఆరోపించారు. ఇవి ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటర్లన్నారు. అటవీ సంపదను రక్షిస్తున్న 1600 మంది గిరిజన బిడ్డలను పొట్టనపెట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా మావోయిస్టులను చర్చలకు ఆహ్వానించి...సమస్యను పరిష్కరించాలని ఈశ్వరయ్య సూచించారు. కార్మిక కోడ్లపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాలని డిమాండ్ చేశారు. సొంత గనులు కేటాయించడం ద్వారా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉందని సూచించారు. స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. లక్షల కోట్లు పెట్టుబడులు అంటూ చంద్రబాబు, జగన్ ఊదరగొట్టారని, వారిచెప్పిన లెక్క ప్రకారమే రాష్ట్రానికి రూ.60 లక్షల కోట్లు వచ్చాయని, అవి ఎక్కడ ఉన్నాయో సమాధానం చెప్పాలని ఈశ్వరయ్య ప్రశ్నించారు. కడప స్టీల్‌ప్లాంట్, రామాయపట్నం పోర్టు, దొనకొండ పారిశ్రామికవాడ, కాకినాడ సెజ్ ఏమయ్యాయన్నారు. డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో సీపీఐ వందేళ్ల వేడుకలు జరుగుతాయని, ఆ రోజు లక్ష మందితో జనసేవాదళ్ కవాతు నిర్వహిస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు, కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, నగర కార్యదర్శి పప్పు ఆదినారాయణ, బొబ్బిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలందరికీ గృహ వసతి

నాలుగేళ్లలో 12.59 లక్షల ఇళ్ల నిర్మాణం: మంత్రి పార్థసారథి

విశాలాంధ్ర-సచివాలయం: రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఐదేళ్లలో 15.59 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ఉందని తెలిపారు. ఇందులో ఇప్పటికే 3.00 లక్షల గృహాలను పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 12.59 లక్షల గృహాలను వచ్చే నాలుగేళ్లలో పూర్తి చేస్తామని వివరించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మాట్లాడుతూ పీఎంఏవై-1 పథకం అమలు గడువును కేంద్రం మరో ఏడాది పాటు పొడిగించిన నేపథ్యంలో ఈ పథకం కింద ఇప్పటి వరకూ ప్రారంభం కాని 3.03 లక్షల గృహాలను కూడా ఈ ఏడాది డిశంబరు కల్లా పూర్తి చేస్తామన్నారు. ఐదేళ్ల కాలంలో దాదాపు 15.59 లక్షల గృహాలను నిర్మించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ఉందని, అయితే వీటిలో పీఎంఏవై-1.0 క్రింద 8.87 గృహాలు, పీఎంఏవై-2.0 అర్బన్ లో 91 వేల గృహాలు, పీఎంఏవై గ్రామీణ్ క్రింద 5.81 లక్షల గృహాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పీఎంఏవై గ్రామీణ్ క్రింద 5.81 లక్షల గృహాలను నిర్మించాలనే లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికే 3.47 లక్షల మంది ఆవాస్ యోజన యాప్ లో దరఖాస్తు చేసుకున్నారని, ఇంకా ఎవరన్నా అర్హులు ఉంటే ఈ నెలాఖరులోగా యాప్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఐదేళ్ల కాలంలో గత ప్రభుత్వం కేవలం 6 లక్షల గృహాలను మాత్రమే పూర్తి చేస్తే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల కాలవ్యవధిలోనే 3.192 లక్షల గృహాలను పూర్తి చేయడం మంత్రి వివరించారు. గత ప్రభుత్వం మంజూరు చేసి 18.61 లక్షల గృహాల్లో మిగిలి ఉన్న 11.90 లక్షల గృహ నిర్మాణాలను కొనసాగిస్తున్నామన్నారు. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కామన్ వాల్ తో ట్విన్ హౌసెస్ నిర్మించుకునే అవకాశాన్ని కల్పిస్తూ త్వరలో జీఓ కూడా జారీ చేయనునట్లు మంత్రి తెలిపారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, పీవీటీజీల గృహ నిర్మాణాలకు తమ ప్రభుత్వం అదనంగా ఇచ్చే ఆర్థిక సహాయాన్ని గత ప్రభుత్వం నిలిపివేసిందని, అయితే తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ అదనపు ఆర్థిక సహాయాన్ని పునరుద్ధరిస్తూ దాదాపు రూ.3,200 కోట్లను మంజూరు చేయడం జరిగిందన్నారు.

రూ.80 కోట్ల మేర అవినీతి

గృహ నిర్మాణాల విషయంలో గతంలో జరిగిన అవకతవకలపై విజిలెన్సు నివేదిక అందజేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ నివేదిక ప్రకారం రాక్రీట్ నిర్మాణ సంస్థ గృహ నిర్మాణాల విషయంలో దాదాపు రూ.80 కోట్ల మేర అవినీతికి ఈ సంస్థ పాల్పడినట్లు వెల్లడైందని, ఈ సొమ్మును ఆ సంస్థ నుండి రికవరీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

జర్నలిస్ట్ హౌసింగ్‌కు ప్రభుత్వం సానుకూలం: పార్థసారథి

విశాలాంధ్ర - సచివాలయం: రాష్ట్ర రాజధాని అమరావతిలో జర్నలిస్ట్ హౌసింగ్ ప్రాజెక్ట్ అమలుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని గృహనిర్మాణ శాఖ మంత్రి కె. పార్థసారథి తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రిని అమరావతి జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు , సీనియర్ జర్నలిస్టులు మంగళవారం కలిశారు. జర్నలిస్టుల కోసం సీఆర్డీఏ అధ్వర్యంలో బహుళ అంతస్థుల గృహ సముదాయాన్ని నాలుగు కేటగిరీలలో నిర్మించే నిమిత్తం 30 ఎకరాల భూమిని మందడం, తుళ్లూరు పరిధిలో అమరావతి హౌసింగ్ సొసైటీకి 2019లో కేటాయించటం జరిగిందని జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. దానిని తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తూ సీఆర్డీఏ సంస్థనే డెవలపర్‌గా ఉండి ప్రాజెక్ట్ నిర్మించాలని సొసైటీ గతంలో ప్రభుత్వాన్ని కోరిందని తెలిపారు. అందుకే సొసైటీకి కేటాయించిన భూమిని తిరిగి ప్రభుత్వానికి ఇవ్వటం జరిగిందని చెప్పారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించిన నేపథ్యంలో ప్రభుత్వం జీవో 107 ఇస్తూ హ్యాపీనెస్ట్ మోడల్‌లో నిర్మిస్తామని పేర్కొందన్నారు. ఇప్పుడు ఆ ఉత్తర్వులు అమలు జరిగేలా చూడాలని కోరుతూ పార్థసారథిని అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో పాటు సీనియర్ జర్నలిస్టులు కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను హౌసింగ్ సొసైటీ విజ్ఞప్తిని మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. దీనిని సాధ్యమైనంత త్వరగా అమలు జరిగేలా అవసరమైన వారితో సంప్రదింపులు జరుపుతామన్నారు. తక్షణమే సమాచార శాఖ డైరెక్టర్ విశ్వనాథ్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంపై ఆయనతో సత్వరమే సంప్రదింపులు జరుపుతామని జర్నలిస్టు సంఘ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి పాటిబండ్ల నాగశ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్లు చావా రవి, ఈశ్వర్ (టీవీ 9), శ్రీనివాస్ (మహాటీవి), సీనియర్ జర్నలిస్టులు గోపి (అడిషనల్ బ్యూరో చీఫ్-ఆంధ్రప్రభ), సత్యనారాయణ (ఆంధ్రజ్యోతి), శ్రీనాథ్ (హిందూ డిప్యూటీ ఎడిటర్), ఏ మల్లికార్జున రావు , బీ నాగేశ్వరరావు ఉన్నారు.

ప్రజాదర్బార్‌లో లోకేశ్‌కు వినతులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్ మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలను మంత్రికి వివరించారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన ఆయన స్వయంగా అర్జీలు స్వీకరించి సిబ్బందికి తక్షణ పరిష్కార చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. గత వైసీపీ పాలనలో అన్యాయం జరిగిందని ఎచ్చెర్లకు చెందిన జరుగుళ్ల గురుమూర్తి కేసుల ఎత్తివేత, ఆర్థికసాయం కోరగా, పీజీ పూర్తి చేసిన పగిడి వెంకటలక్ష్మి ఉద్యోగావకాశం కోరారు. కురగల్లులో పీఏసీఎస్‌లో రూ.7.55 కోట్ల పొదుపు దుర్వినియోగంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మరొకరు విజ్ఞప్తి చేశారు. పెద్దవడ్లపూడి రైతు కుర్రా వెంకట్రావు భూమి వెబ్ ల్యాండ్ నమోదు, రిటైర్డ్ పార్ట్‌టైం ఉద్యోగులు పెన్షన్ పెంపు, విజయనగరం వాసి నాగభూషణం కుమారుడి వైద్యసాయం, పల్నాడు దివ్యాంగురాలు ట్రై స్కూటీ, అనంతపురం మహాలక్ష్మి అంగవైకల్య పెన్షన్ కోరారు. ప్రజల సమస్యలను పరిశీలించి తగిన సహాయం అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

గుండెకు రక్షణ 'టెనెక్ట్ ప్లస్'

విశాలాంధ్ర - సచివాలయం: గ్రామీణ ప్రాంతాల్లో అకస్మాత్తుగా గుండె నొప్పి వచ్చిన వారికి అత్యవసర వైద్యం కింద స్టెమీ విధానంలో ఇస్తున్న చికిత్సవల్ల గతేడాది జూన్ ఒకటో తేదీ నుంచి ఈ నెల 15 వరకు 3,027 మంది ప్రాణాలు నిలిచాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలో 238 ప్రభుత్వ సామాజిక, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల్లో ప్రవేశపెట్టిన 'స్టెమీ' విధానం కింద ఖరీదైన 'టెనెక్ట్ ప్లస్' ఇంజెక్షన్ ఉచితంగా ఇవ్వడం ద్వారా విలువైన ప్రాణాలు నిలబడుతున్నాయని పేర్కొన్నారు. ఛాతీనొప్పి లక్షణాలతో ఆసుపత్రులకు వచ్చిన వారిలో 'టెనెక్ట్ ప్లస్' ఇంజెక్షన్ అవసరమని గుర్తించిన 3,155 మందిలో 3,027 మంది ప్రాణాలు నిలబడినట్లు పేర్కొన్నారు. మిగిలిన వారి ఆరోగ్య పరిస్థితి అప్పటికే విషమించడం, సమయం మించిపోవడం వంటి కారణాలతో ప్రాణాలు విడిచారని పేర్కొన్నారు. ఈ సంఖ్యను ఇంకా తగ్గించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా అనంతపురం జిల్లాలో 617 మందికి స్టెమీ చికిత్స లభించిందన్నారు. గుంతకల్లు ఆసుపత్రిలో ఈ సంఖ్య 124 వరకు ఉంది. విశాఖ జిల్లాలో 416, కర్నూలు-412, గుంటూరు-354, కాకినాడ-346, తిరుపతి-213, ఎన్టీఆర్-205, శ్రీకాకుళం-203, కడప-147, ఒంగోలు-134, నెల్లూరు జిల్లాల్లో 108 మందికి 'స్టెమీ' వైద్యం అందించినట్లు మంత్రి వివరించారు. స్టేమీ విధానాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు 238 ఆసుపత్రుల్లో అవసరమైన పరికరాలు, యంత్రాల కోసం రూ.16.60 కోట్లు ఖర్చుపెట్టారన్నారు. 'ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇంజెక్షన్ ధర రూ. 40 వేలు నుంచి 45 వేలు ఉంది. ప్రభుత్వం టెండర్ ద్వారా వీటిని కొనుగోలు చేస్తోంది. ఒక్కొక్క ఇంజెక్షన్ కు రూ.19 వేలు తోపాటు అదనంగా ఇతర మందుల కోసం రూ. 6 వేలు ఖర్చుపెడుతోంది. దీని ప్రకారం ఇప్పటి వరకు లబ్ధిపొందిన 3,155 మందికి కలిపి రూ.7.88 కోట్ల వరకు ప్రభుత్వం వ్యయం చేసింది' అని తెలిపారు.

కొందరి మధ్య రహస్య ఒప్పందం

సీఎం మార్పుపై డీకే శివకుమార్

కనకపుర: కర్నాటక ముఖ్యమంత్రి మార్పుపై బయట మాట్లాడను, పార్టీలో ఐదుగురు-ఆరుగురి మధ్య అది రహస్య ఒప్పందం అని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. 'నేను నా మనస్సాక్షినే నమ్ముకుంటా' అని వ్యాఖ్యానించారు. పార్టీకి తలవంపులు తేవడం, దానిని బలహీనం చేసే ఉద్దేశం లేదని చెప్పారు. అధికారం కోసం సాగుతున్న పోరాటం దృష్ట్యా గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కర్నాటకలోనే ఉన్నాగానీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ ఆయనను కలవలేదు. ఖర్గే ఢిల్లీకి బయల్దేరినప్పుడు ఆయనను సాగపేందుకు విమానాశ్రయానికి వెళ్లారు. 'నాకు ఏమీ తెలియదు. నన్ను సీఎం చేయమని అడగలేదు. ఐదుగురు-ఆరుగురు మధ్య అదొక రహస్య ఒప్పందం. దాని గురించి బహిరంగంగా మాట్లాను. నా మనస్సాక్షినే నమ్ముకుంటా. మనం మన మనస్సు నచ్చినట్లు నడుచుకోవాలి. పార్టీని అవమానించడంగానీ, బలహీనపర్చడంగానీ నేను చేయను. పార్టీ... కార్యకర్తలు ఉంటేనే మనం ఉంటాం' అని కనకపురా నియోజకవర్గంలోని తన నివాసం వద్ద విలేకరులతో డీకే శివకుమార్ అన్నారు. సిద్ధరామయ్య గురించి మాట్లాడుతూ 'ఆయన సీనియర్ నాయకుడు. పార్టీకి కీలకం. 7.5 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు' అని డిప్యూటీ సీఎం తెలిపారు. తదుపరి బడ్జెట్ తానే ప్రవేశపెడతానని సిద్ధరామయ్య చెప్పడం సంతోషించే విషయమని అన్నారు. 2028లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు, 2029లో జరగాల్సిన లోక్‌సభ ఎన్నికలపై దృష్టితో గెలుపు లక్ష్యంతో ఐక్యంగా ముందుకు వెళదామని డీకే శివకుమార్ పిలుపునిచ్చారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరు

డేగా ప్రభాకర్

విశాలాంధ్ర - బాపట్ల: సీపీఐ ఆవిర్భవించి డిసెంబరు 26 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో శత వసంతాల వేడుకలను ఖమ్మంలో నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సీపీఐ జిల్లా సమితి సమావేశం మేకల వెంకాయమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ప్రభాకర్ మాట్లాడుతూ ఐదు లక్షల మందితో బహిరంగ సభ... ర్యాలీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా వామపక్షాలకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. సీపీఐ భావజాలాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు తమ వంతుగా కార్యక్రమాలు రూపకల్పన చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీపీఐ వందేళ్ల చరిత్రలో అనేక పోరాటాలు, విజయాలు సాధించినట్లు తెలిపారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికులు, కర్షకులు, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, దీనిపై పోరాటం చేయాలని డేగా పిలుపునిచ్చారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం కార్మికులపై దాడి చేయడమేనని ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు పాలనలో పేదల బతుకుల్లో ఎలాంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు కూటమి ప్రభుత్వం పన్నాగం పన్నిందన్నారు. ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడాన్ని విరమించుకోవాలని హితవు పలికారు. బాపట్ల జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పోరాటాలు ఉధృతం చేయనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. ఉద్యమాల పురిటి గడ్డ బాపట్ల జిల్లాలో సీపీఐ బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. గ్రామస్థాయి నుంచి సీపీఐని బలోపేతం చేసి కార్మిక, కర్షక శ్రామికుల హక్కుల పరిరక్షణకు పోరాటాలు చేస్తామన్నారు. సీపీఐ నాయకులు కోలా వీరాంజనేయులు, పొట్లూరి అంకమ్మరావు, జె.రత్నకుమారి, ఆట్ల పోలిరెడ్డి, మేకల రమణయ్య పాల్గొన్నారు.

ఈఎంఆర్‌ఎస్ జాతీయ సాంస్కృతిక ఉత్సవాలకు సిద్ధం

22 రాష్ట్రాల నుంచి 1644 మంది విద్యార్థులు హాజరు

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

విశాలాంధ్ర - సచివాలయం: రాష్ట్రంలో తొలిసారిగా గిరిజన చిన్నారులకు సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తుండటం ఎంతో సంతోషంగా ఉందని, దేశవ్యాప్తంగా ఉన్న 405 ఈఎంఆర్‌ఎస్ స్కూళ్లు ఈ ఉత్సవాల్లో పాల్గొంటునాయని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం రాష్ట్రంలో సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సన్నాహకాల వివరాలను మంత్రి వివరించారు. రాష్ట్రం నుంచి 28 పాఠశాలల నుంచి 110 మంది గిరిజన చిన్నారులు ప్రతిభ చూపేందుకు సిద్ధమైనట్లు ఆమె వెల్లడించారు.

ప్రభుత్వం డిసెంబర్ 3,4,5 తేదీల్లో నిర్వహించడానికి సమాయత్తమవుతోంది. రాష్ట్ర రాజధాని అమరావతి సమీపంలోని కేఎల్ యూనివర్శిటీలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉద్భవ్-2025లో పాల్గొనేందుకు వచ్చే వారికి సదుపాయాల్లో లోటుపాట్లు తలెత్తకుండా రవాణా, వసతి, భోజన ఏర్పాట్లు ఉండాలని ఆమె అధికారులను ఆదేశించారు. గిరిజన చిన్నారుల సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు వారిలో నెలకొన్న భయం, బిడియం పోగొట్టి ప్రతిభను చాటే ఓ మంచి వేదికను కల్పించాలన్నదే ఈ ఉత్సవాల ధ్యేయమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పేరు ప్రతిష్టలను జాతీయ స్థాయంలో ఇనుమడింపజేసేలా పోటీలను నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఉద్భవ్-2025 పోస్టర్, లోగోను మంత్రి ఆవిష్కరించారు. ఉద్భవ్ -2025 పేరుతో నిర్వహించనున్న ఈ సాంస్కృతిక, సాహిత్య ఉత్సవాలలో ప్రతిభ చాటేందుకు 22 రాష్ట్రాలకు చెందిన 405 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నుంచి 1644 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. దేశంలోని సాంస్కృతిక, కళా వైవిద్యం గిరిజనుల జీవిత ముఖచిత్రాలను ప్రతిబింబించే సంగీతం, సాహిత్యం, నృత్యం, థియేటర్ ఆర్ట్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి, గురుకులం కార్యదర్శి ఎం. గౌతమి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వీడని పీటముడి!

- అక్కరకు రాని రీసర్వే
- భూ సమస్యలతో రైతన్న గగ్గోలు
- ఎల్‌పీఎన్ అధిక నంబర్లతో మొదటికే మోసం
- చంద్రన్నపాలెం అన్నదాతల ఆందోళన



విశాలాంధ్ర- లింగపాలెం: భూసమస్యలు తీరుతాయన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన రీసర్వే వల్ల ... అవి తీరకపోగా, కనీసం ముడిపడిన చిక్కులు వీడకపోవటంతో రైతులు నానాయాతన పడుతున్న దుస్థితి మండలంలో నెలకొంది. ఏలూరు జిల్లా లింగపాలెం మండలంలో రీసర్వేను ప్రయోగాత్మకంగా చేపట్టారు. పైలెట్ ప్రాజెక్టుగా లింగపాలెంను ఎంపిక చేసి ఫస్ట్ ఫేజ్‌లో పోచవరం, చంద్రన్నపాలెం రెవెన్యూ గ్రామాలలో రీసర్వే 2021-22 లో పూర్తి చేశారు. రీ సర్వే చేసినా చంద్రన్నపాలెంకు తిప్పలు తప్పడం లేదు. మూడేళ్లు అవుతున్న రీసర్వే వల్ల ఎదురైన చిక్కుముడి వీడకపోవటంతో రైతులు గొల్లుమంటున్నారు. దాదాపు 354 ఎకరాలు ఉన్న చంద్రన్నపాలెంలో భూములు అమ్ముకోవాలన్నా, కొనాలన్నా వీలులేని పరిస్థితి నెలకొంది. ఈ రెవెన్యూ గ్రామంలో సాహసం చేసి భూములు కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్ అవటం లేదు. భూమిని అమ్ముకుని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కాలనుకున్న వారికి నిరాశే మిగులుతుంది. పిల్లల్ని పెద్ద చదువులు చదివించాలనుకుని ఉన్న భూములు అమ్ముకోవటానికి వీలు లేకుండా ఉందని గ్రామంలోని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో్ల పిల్లల్ని పెద్ద చదువులు చదివించలేక పోతున్నామని చెబుతున్నారు.

రైతులకు ఎన్ని సర్వే నెంబర్లలో భూములు ఉన్నప్పటికీ వీటన్నిటిని ఒకే నెంబర్ పై చూపించే సౌకర్యం రీ సర్వేలో ఏర్పాటు చేశారు. ఒక్కొక్క రైతుకు ఒక ల్యాండ్ పార్సిల్ నెంబర్ (ఎల్‌పీఎన్) కేటాయిస్తారు. ఈనెంబర్లో రైతుకు చెందిన భూముల వివరాలు ఉంటాయి. ఈ నెంబర్లను స్థానికంగా ఉండే సర్వేయర్లు కేటాయించాలి. చంద్రన్నపాలెంలో 422 ఎల్‌పీఎన్ నెంబర్లు కేటాయించాల్సి ఉండగా రెండు నెంబర్లు అధికంగా వచ్చాయి. దీంతో మొదటికే మోసం వచ్చిందని వాపోతున్నారు. ఎక్కువ నమోదైన రెండు నెంబర్లను తొలగించాల్సి ఉండగా వీటిని తొలగించకపోవడం వల్ల సమస్య నెలకొంది. ఈ సమస్యను 2024, మార్చి 26న విశాలాంధ్ర వెలుగులోకి తెచ్చింది. అప్పుడు కాస్త హడావుడి చేసి వదిలేశారు. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. అధికారులు మారుతున్నారు... కాలం గడిచిపోతుంది. అనేక గ్రామాలలో రీసర్వే జరుగుతుంది. చంద్రన్నపాలెం సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఈ సమస్య పరిష్కారంపై ఎందుకింత నిర్లక్ష్యం చూపుతున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈసమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోపోవటం సర్వత్ర విమర్శలకు దారితీస్తుంది. ఈ సమస్యకు పరిష్కారం రాష్ట్ర రాజధానిలో ఉన్న చీఫ్ ల్యాండ్ నిర్వహణ కార్యాలయంలోనే జరగాలి. మండల, జిల్లా స్థాయి నుంచి పూర్తిస్థాయి ఆధారాలతో కూడిన వివరాలు చీఫ్ ల్యాండ్ నిర్వహణ కార్యాలయానికి పంపాలి. కానీ అలాంటిదేది జరగలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తహసిల్దార్ కార్యాలయం నుంచి సబ్ కలెక్టరుకు ఇక్కడ నుంచి సర్వే శాఖ ఏడీఏకు అక్కడి నుంచి జాయింట్ కలెక్టర్‌కు చివరగా చీఫ్ ల్యాండ్ నిర్వహణ కార్యాలయానికి రికార్డులు వెళ్లాలి. దీనిపై స్థానిక అధికారులను ప్రశ్నిస్తే ఇదిగో అదిగో అంటూ కాలం గడుపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రీసర్వే చేస్తే సమస్యలు ఉండవని ప్రభుత్వం దీన్ని చేపట్టిందని ఇటువంటి సమస్యను పరిష్కరించకపోతే ఉపయోగం ఏంటంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. భూ సమస్యలు ఇలాగే కొనసాగితే రీసర్వే వల్ల రైతులకు ఒరిగేది ఏంటని నిలదీస్తున్నారు. చంద్రన్నపాలెం రైతుల సమస్యను పరిష్కరించడానికి ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారంటూ రైతన్నలు ఆగ్రహం చెందుతున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.